నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
వరంగల్-ములుగు
మంగళవారం ఆగస్టు 13, 2024 www.navatelangana.com

కెనాల్ మట్టి తరలిస్తే కఠిన చర్యలు

ఎస్సారెస్పీ ఏఈ బాలదాసు

నవతెలంగాణ కథనంతో స్పందించిన అధికారులు

నవతెలంగాణ-రాయపర్తి

మండల పరిధిలోని ఎస్సారెస్పీ కెనాల్ కాలువకు ఇరువైపులా ఉన్న సేఫ్టీ వాల్‌మట్టి (మొరం)ను అధికార పార్టీ నాయకులు విచ్చలవిడిగా తోడుస్తున్నడంతో సెలవు దినం చూసి.. ఎస్సారెస్పీ మట్టిని దోచే అనే కథనం సోమవారం నవ తెలంగాణ పత్రికలలో ప్రచురితం



కావడంతో ఎస్సారెస్పీ ఏఈ బాల దాసు, రెవెన్యూ శాఖ గిర్దావర్ చంద్రమోహన్ ఎస్సారెస్పీ కెనాల్ కాల్వ వద్దకు వెళ్లి మట్టి తవ్విన ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనుమతులు లేకుండా మట్టి తరలిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఇప్పటి నుండి కెనాల్ కాల్వపై గట్టి నిఘా ఉంటుందని తెలిపారు. మొరం దందా అక్రమార్కులపై ఉక్కుపాదం మోపుతామని పేర్కొన్నారు.

యువతీ,యువకుడు బలవన్మరణం

పైడిపల్లి వాసులుగా గుర్తింపు

అక్రమ సంబంధమే కారణమా?

క్షేత్రస్థాయిలో దర్యాప్తు చేపడుతున్న పోలీసులు

నవతెలంగాణ-రాయపర్తి

మండలం కేంద్రం శివారులోని రామచంద్రుని చెరువులో దూకి ఇరువురు (యువతి, యువకుడు) బలవత్మరణం చేసుకున్న ఘటన సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు, మతుల వద్ద లభించిన ఆధారాల ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. హన్మకొండ జిల్లా లోని పైడిపల్లి గ్రామం మద్యగూడెంకు ప్రాంతానికి చెందిన సంగాల దిలీప్



(30), తిక్క అంజలి (26). దిలీప్‌కు భార్య శిరీష, ఇద్దరు కుమార్తెలు ఉండగా అంజలి అవివాహిత. ఆదివారం ఇంటి నుంచి పరారయ్యారు. సోమవారం మధ్యాహ్నం సమయంలో జేతురాంతండాకు చెందిన మేకల కాపరులు రామచంద్రుని చెరువు కట్టపై నుంచి వెళ్తుండగా చెరువులోని నీటిలో ఇద్దరి మతదేహాలు తేలాటాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దాంతో వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య, సీఐ సూర్య ప్రకాష్, ఎస్సై ప్రవీణ్ కుమార్ ఘటన స్థలానికి చేరుకొని క్లూస్ టీం సహాయంతో విచారణ చేపట్టారు. చెరువుకట్టపై ద్విచక్ర వాహనం, బ్యాగు, వాటర్ బాటిల్, చెప్పులు ఉండగా వీరి బలవన్మరణానికి కారణం వివాహేతర సంబంధమా ? లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అనే అనుమానాలు పలువురు వ్యక్తం చేస్తున్నారు. ఏసీపీని వివరణ కోరగా దర్యాప్తు చేపట్టి పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

రైతులు రుణాలను రెన్యువల్ చేసుకోవాలి

జిల్లా కలెక్టర్ సత్య శారద

నవతెలంగాణ-వరంగల్

పంట రుణాలు మాఫీ పొందిన రైతులకు వెంటనే రుణాలు రెన్యూవల్ చేసుకొనేలా ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మొదటి, రెండో విడతల్లో రైతు రుణ మాఫీ, రెన్యూవల్ పురోగతిపై బ్యాంకర్లు, వ్యవసాయ శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వ హించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభు త్వం ప్రతిష్టాత్మకంగా రెండు విడతల్లో లక్షన్నర రూపాయల వరకు చేపట్టిన రుణమాఫీ పథ కంలో రైతులకు



లబ్ది చేకూరేలా చూడాలన్నారు. దీనిపై రైతులకు ఉన్న సందేహాలను నివత్తి చేయాలని ఆదేశించారు. పంట రుణాలు పొందిన డబ్బులను వ్యవసాయ పనుల నిమిత్తం వాడుకు నేలా రైతులకు చెల్లించాలన్నారు. బ్యాంకు అధికారులు రుణమాఫీ డబ్బులు ఇతర రుణాల కింద జమచేయ కుండా సకాలంలో చెల్లించి రైతులకు ఉపయోగపడేలా చూడాలని సూచించారు. వ్యవసాయ విస్తరణాధికారి, వ్యవసాయా ధికారులు, బ్యాంక్ అధికారులు రుణాలు రెన్యూవల్‌పై రైతుల్లో అవగాహన కల్పించి ప్రోత్సహించాలని, పంట రుణాల రెన్యూవల్ త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. గ్రీవెన్స్‌లో స్వీకరించిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని తెలిపారు. రుణ మాఫీపై జిల్లా వ్యాప్తంగా గ్రీవెన్స్ సెల్‌కు నేటి వరకు 220ఫిర్యాదులు రాగా వాటిని పరిష్కరించినట్టు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా వ్యవసాయ అధికారి ఉషాదయాల్, లీడ్ బ్యాంక్ మేనేజర్ రాజు, జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యాస రచన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-చెన్నారావుపేట

స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా వరంగల్ జిల్లా వ్యాప్తంగా హైస్కూల్ విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో చెన్నారావుపేట మండలం ఉప్పరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి సిహెచ్ ద్రాక్షాయని మొదటి స్థానాన్ని, ఉపన్యాస పోటీల్లో 9వ తరగతి విద్యార్థి రెడ్డబోయిన కీర్తన తతీయ స్థానాన్ని



పొందినట్లు హెచ్‌ఎం తేజావత్ జయ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో విద్యార్థులు ద్రాక్షాయని, కీర్తన, గైడ్ టీచర్ గజవెల్లి సుందర్‌ను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. హెచ్‌ఎం జయ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా నిర్వహించిన స్వచ్ఛదనం-పచ్చదనం పోటీల్లో రెండు బహుమతులు ఉప్పరపల్లి విద్యార్థులు గెలుచుకోవడం సంతోషకరమని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శశిధర్, సంతోష్ కుమార్, బాలాజీ రావు, ఉదయ్ కుమార్, మొగిలి, జి.సుందర్, కె.మాధవి, రమాదేవి, వర్ధెల్లి సతీష్ కుమార్, వ్యాయామ ఉపాధ్యాయురాలు స్వప్న, జూనియర్ అసిస్టెంట్ జాహేద్ పాల్గొన్నారు.

78వ స్వాతంత్ర దినోత్సవ స్పోర్ట్స్ మీట్

నవతెలంగాణ-కాశిబుగ్గ

లేబర్ కాలనీలోని శ్రీసాయి విజ్ఞాన భారతి హైస్కూల్‌లో సోమవారం 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా స్పోర్ట్స్ మీట్ కార్యక్రమాన్ని సీనియర్ ఉపాధ్యాయుడు మొహమ్మద్ షాబు ద్దీన్ జెండా ఊపి ప్రా రంభించారు. ఈ సందర్భంగా పాఠ శాల కర స్పాండెంట్ డాక్టర్ సామల శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యా ర్థుల్లో దాగి ఉన్న సజనాత్మకతను,



వివిధ రకాల కళలను వెలికి తీసేందుకు స్పోర్ట్స్ మీట్ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. వ్యాయామాన్ని, చక్కటి దేహ దారుఢ్యం కలిగి ఉండేందుకు అవసరమైన శిక్షణను సైతం పాఠశాల స్థాయి నుండి అందించాల్సిన బాధ్యత తమపై ఉందని, అందువల్లే విద్యార్థులకు రెండు నుండి మూడు సార్లు స్పోర్ట్స్ మీట్, సాంస్కతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థిని, విద్యార్థులు, ఉపాధ్యాయ బందం పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-ఖానాపురం

ప్రజల ఆరోగ్య పరిస్థితిలో అండగా ఉండే ముఖ్యమంత్రి సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు చెక్కులను సోమవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, నర్సంపేట వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లా డుతూ మండలంలో సీఎం సహాయ నిధి కోసం దరఖాస్తు చేసుకున్న



85మంది లబ్ధిదారులకు 24,79,000 రూపాయల చెక్కులను పంపిణీ చేసినట్లు వారు పేర్కొన్నారు. ఆపదలో ఆదుకునే సీఎం సహాయ నిధి కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ప్రత్యేక చొరవతో సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎలగందుల రాజు, బుధరావుపేట గ్రామ పార్టీ అధ్యక్షులు ఎస్.కె లాల్ పాషా, రాగంపేట గ్రామ పార్టీ అధ్యక్షులు కావటి రమేశ్, రాగంపేట గ్రామ మాజీ ఉప సర్పంచ్ మీసం రవీందర్, మండల నాయకులు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంజీఎంలో కుక్కలు పసికందును పీక్క తినడం దారుణం

ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి నలిగంటి రత్నమాల

నవతెలంగాణ-వరంగల్



వరంగల్ మహానగర పాలక సంస్థ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వరంగల్ ఎంజీఎం హాస్పిటల్‌లో రెండు రోజుల పసిబిడ్డను అత్యంత దారుణంగా కుక్కలు పీక్క తిని చంపిన ఘటనపై మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. సందర్భంగా ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి నలిగంటి రత్నమాల మాట్లాడుతూ ఎంజీఎంలో పసికందును కుక్కలు పీక తినడం అత్యంత దారుణమన్నారు. గతంలో కాజీ పేటలో ఆరేండ్ల పాపపై కుక్కల దాడి చేయడం వల్ల మతి చెందారు. ఖిల వరంగల్ మున్సిపల్ కార్మికురాలిపై, ఎన్టీఆర్ నగర్ ఓ బాలుడిపై కుక్కలు దాడి చేశాయి. ఇట్లాంటి సంఘటనలు పునరావతం కాకుండా చూడాలని కమిషనర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా వరంగల్ జిల్లా కార్యదర్శి జిల్లా కమిటీ సభ్యులు టి భవాని, డి లక్ష్మి, ఆకుల కీర్తి, మైదం జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌టీఎల్ నోటీసులను వెంటనే రద్దు చేయాలి

గ్రేటర్ కార్పొరేషన్ ఎదుట

కాలనీ వాసులు ధర్నా

సీపీఐ(ఎం) జిల్లా కార్యవర్గ సభ్యులు

సింగారపు బాబు

నవతెలంగాణ-వరంగల్



గ్రేటర్ వరంగల్ పోచమ్మ మైదాన్ 13వ డివిజన్ ఎంహెచ్ నగర్ (దేశాయిపేట)లో 21 ఏండ్లుగా నివాసం ఉంటున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ కులాలకు చెందిన వారు ఈ కాలనీలో దినసరి కూలీ పనులు మేస్త్రీ, బిల్డింగ్ లేబర్, తట్టపని, ఆటో డ్రైవర్‌గా, రిక్షా కార్మికులగా పని చేసుకుంటు జీవనం గడుపుతున్నారు. ఎంహెచ్ నగర్ కాలనీలో 650కుటుంబాలు 2003 ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 308లో గుడిసెలు వేసుకొని నివసిస్తున్నారని, 2007లో అప్పటి కాంగ్రెస్ పార్టీ స్థానిక ఎమ్మెల్యే బస్వరాజు సారయ్య, వరంగల్ తహసీల్దార్(ఎంఆర్వో) చంద్రశేఖర్ హయాంలో బిపిఎల్ కింద ఇందిరమ్మ ఇండ్ల స్థలాల పట్టాలు మంజూరు చేసి పంపిణీ చేశారని తెలిపారు. అయితే ఎఫ్‌టీఎల్ నోటీసులు పంపిస్తున్నారని, వెంటనే వాటిని రద్దు చేయాలన్నారు. ఈ సందర్భంగా సోమవారం వరంగల్ మున్సిపాలిటీ కమిషనర్‌కు సింగారపు బాబు, కాశీబుగ్గ ఏరియా కార్యదర్శి మమ్మద్‌బషీర్‌అహ్మద్ కాలనీవాసులతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సింగారపు బాబు మాట్లాడుతూ గత ప్రభుత్వం తరుపున ఇందిరమ్మ ఇల్లు బిల్లులు పక్కా ఇండ్లు మంజూరు చేసి ఇవ్వగా స్థిరనివాసం ఏర్పరచుకొని నివసిస్తున్నామని తెలిపారు. కాలనీలో ప్రభుత్వం నుంచి మరుగుదొడ్లు, సిసి రోడ్లు డ్రైనేజీ కాలువలు, మిషన్ భగీరథ నీరు నల్లా కనెక్షన్లు, వీధిలైట్లు, చిన్నల పిల్లల పార్కు లు అనేక రకాల సౌకర్యాలు కల్పించారని తెలిపారు. అనంతరం మహమ్మద్ బషీర్ మాట్లాడుతూ ఎన్నో ప్రభుత్వాలు వస్తున్నాయి పోతున్నాయి కానీ, ఇంతవరకు ఎవరు మాకు నోటీసులు ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో కాలనీవాసులను భయభ్రాంతులకు గురి సమంజసం కాదన్నారు. గత కొన్ని రోజుల క్రితం వరంగల్ నగర మున్సిపాలిటీ నుండి చిన్నవడ్డేపల్లి చెరువు ఎఫ్ టి ఎల్ పరిధిలో ఉన్నారంటూ నోటీసులు జారీ చేయడంతో మా బతుకులు బజారు పడే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తాళ్ల పెల్లి స్వామి, దామెర రమేష్, దార రమాదేవి, దార కుమార స్వామి, దామెర మైబు, ప్రభాకర్, నవీన్, నర్సింగ రావు, లింగయ్య, ఎండి అస్లాం పాషా, ఎండి గౌస్, అశోక్ , ఎండి అక్బర్, ఏం సంతోష్, మొగిలి, కిరణ్ ,దాసు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు కేటాయించిన భూమి ఇప్పించాలని ధర్నా

నవతెలంగాణ-పర్వతగిరి

మండలంలోని కల్లెడలో పేదలకు బీసీ,ఎస్సీ కులస్తులకు ప్రభుత్వ అసైండ్ భూమి అలాట్‌మెంట్ అయిన వారి వద్దనుండి బలవంతముగా భూస్వామి కబ్జాలో ఉందని తమకు కేటాయించిన భూములు తమకే దక్కాలని సోమవారం వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అధికారులకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు మీడియా సమక్షంలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కల్లెడ గ్రామములో సర్వే నెంబర్ 543 లో ప్రభుత్వ భూమి గతములో అందాజ 150 మంది ఎస్సీ, బిసి కులస్తులకు మంజూరు చేసి ఎవ్వరి భూమి వారికి హద్దులు పెట్టారని, హద్దులు పెట్టిన తరువాత తమకు ఇచ్చిన భూమిని ఇతరులు కబ్జా చేసి, ఇతర భూ



స్వాములు ప్రభుత్వ అలాట్ మెంట్లో లేని కబ్జాలో ఉన్న పహాణీ భూములను తమకు సమాచారం లేకుండా వచ్చి సర్వే చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. కల్లెడలో గల 543 సర్వే నెంబర్ సర్వే చేయుటకు కలెక్టర్, తహసిల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినప్పటికీ ఎవరు పట్టించుకోలేదని, సర్వేయర్ సర్వే చేసిన రిపోర్ట్ అడిగిన కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అసిస్టెంట్ డైరెక్టర్ సర్వే డిపార్ట్మెంట్ డిప్యూటీ ఇన్స్పెక్టర్ సర్వే డిపార్ట్మెంట్ వాళ్లతో సర్వే చేయించి గతంలో ప్రభుత్వం మంజూరు చేసిన వారకి, లేదా వారి వారసులకు ఆ భూమిని అప్పగించాలని బాధితులు వేడు కుంటున్నారు. కార్యక్రమంలో దాసరి సారయ్య, నక్క లక్ష్మణ్, నక్క రాములు,తక్కలపెల్లి ఎల్లయ్య,చిన్నపాక వెంకటయ్య, తక్కలపల్లి ఉప్పలయ్య. నక్క రాములు. దాసరి రవి.రాపాక క్రిషన్, పసుల శ్రీనివాస్, బాబు.నక్క రాజు, సురేష్ భురికి రవికుమార్, దాసరి యాకయ్య. దాసరి వెంకన్న. బురికి ఉప్పలయ్య. తదితరులు పాల్గొన్నారు.

బీసీ కుల గణన జరిగే వరకూ ఎన్నికలు నిర్వహించొద్దు

బీసీ హక్కుల సాధన సమితి ములుగు

జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల రాజు

నవతెలంగాణ-ములుగు



బీసీ కుల గణన జరిగే వరకూ ఎన్నికలు నిర్వహించకూడదనీ బీసీ హక్కుల సాధన సమితి ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల రాజు అన్నారు. బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు జిల్లా కేంద్రంలో బీసీల సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణిలో వినతిపత్రం అందించారు. ఈ కార్య క్రమంలో పాల్గొన్న బీసీ హక్కుల సాధన సమితి ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల రాజు మాట్లాడుతూ బీసీల సమస్యలపై బీసీలకు కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి విడనాడాలని బీసీల సమస్యలు వెంటనే పరిష్కరించాలని నేటి డిమాండ్స్‌డే సందర్భంగా డిమాండ్ చేయడం జరిగినదన్నారు. ప్రధానంగా దేశ వ్యాప్తంగా బీసీ కులగరణ చేపట్టాలని చట్టసభలలో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలన్నారు. రెండు లక్షల కోట్లతో బీసీల సమగ్ర సంక్షేమానికి అభివద్ధికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలని యుద్ధ ప్రాతిపదికన రాష్ట్రంలో కుల గణన జరపాలని బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. సంవత్సరానికి రూ. 20వేల కోట్లతో బడ్జెట్ కేటాయించి సంక్షేమానికి అభివద్ధికి ఖర్చు చేయాలన్నారు దరఖాస్తు పెట్టుకున్న వారందరికీ సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని కోరారు. బీసీ విద్యార్థులకు పూర్తిస్థాయిలో ఫీజు రియంబర్స్మెంట్ పాత బకాయిలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ హక్కుల సాధన సమితి నాయకులు బండి నర్సయ్య,కొక్కుల రాజేందర్, గుంజె శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కాటాపూర్ పీహెచ్‌సీ సమస్యలు పరిష్కరించాలి

సీపీఐ(ఎం) మండల కార్యదర్శి దుగ్గి చిరంజీవి

నవతెలంగాణ-తాడ్వాయి



మండలంలోని కాటాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పిహెచ్‌సి) సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి, గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు దుగ్గి చిరంజీవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని కాటాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, పీహెచ్‌సీ సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాటాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు మెరుగైన వైద్యం అందిస్తున్నారని, సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న దృష్ట్యా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ పీహెచ్‌సీ పరిధిలో 7గ్రామపంచాయతీలతో కలుపుకొని మొత్తం 11గ్రామాలు ఉన్నాయన్నారు. ఈ 11గ్రామాల రోగాల బారిన పడిన ప్రజలే కాకుండా, సరిహద్దు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల, ఆళ్లపల్లి మండలాల నుంచి కూడా, మ ర్కోడు, గొల్లగూడెం, అనంతరం కొత్తూరు, దామర తోగు గ్రామాల రోగులు, సరిహద్దు మంగపేట మండలంలోని కొత్తూరు మోట్లగూడెం గ్రామాల ప్రజలు వైద్యానికి వస్తున్నారని, బెడ్లు సరిపోవడం లేదని అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 24గంటలు సర్వీస్ ఆరోగ్య కేంద్రంగా అప్‌గ్రేడ్ చేయాలని డిమాండ్ చేశారు. రోగులకు తాగడానికి నీరు లేక నానా ఇబ్బందులు పడుతున్నారని, కనీసం పేషెంట్లను చూసిన అనంతరం చేతులు కడుక్కోవడానికి వైద్యులకు, వైద్య సిబ్బంది కూడా నీరు కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో వేసిన బోరు మొత్తం కూలిపోయిందని, హాస్పటల్‌కు "టీకా మందులు" చల్లని ప్రదేశంలో భద్రపర్చడానికి ఐఎల్ఆర్ డిఫ్రిడ్జ్ కావాలని, హాస్పటల్‌కు కాంపౌండ్ వాల్, విద్యుత్ సమస్య కూడా ఉందన్నారు. దీన్ని సంబంధిత అధికారులు పరిశీలించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

కస్తూర్బాగాంధీ పాఠశాలలో ఎమ్మెల్యే సందర్శన

నవతెలంగాణ-పర్వతగిరి

వర్ధన్నపేట మండల పరిధిలోని ఇల్లంద గ్రామంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను, జూనియర్ కళాశాలను సోమవారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినీలు ఎమ్మెల్యే కు బొకే ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం పాఠశాల పరిసర ప్రాంతాలను పరిశీలించారు. తర్వాత ఎమ్మెల్యే పాఠశాల ఆవరణంలోకి వెళ్లి వంటశాలను, బాలికలకు అందించే భోజనాన్ని నాణ్యతగా ఉందా లేదా అని పరిశీలించి నేరుగా బాలికలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల తరగతి గదులను పరిశీలించి మౌలిక సదుపాయాలు సరిగా



లేక ఇబ్బంది పడుతుండగా సంబంధిత అధికారులతో మాట్లాడి మరమ్మత్తులు చేపిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. వాటర్ ప్లాంట్, తరగతి గదిలో తలుపులు కిటికీలు సరిగా లేనందున స్థానిక నాయకులు మరమ్మతులు చేపిస్థామని ఎమ్మెల్యేకు చెప్పారు. తదనంతరం జూనియర్ కళాశాలలో మౌలిక వసతులు సక్రమంగా లేని కారణంగా వసతుల కల్పన కోసం నిధులు కేటాయించి మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట మండల అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరుకుడు వెంకటయ్య, జిల్లా నాయకులు పోశాల వెంకన్నగౌడ్, కమ్మగోని ప్రభాకర్‌గౌడ్, శ్రీపాద సతీష్, యాదగిరి, మరుపట్ల సాయికుమార్, అక్బర్, కొండేటి బాలకష్ణతో పాటు కాంగ్రెస్ పార్టీ జిల్లా మండల బ్లాక్ గ్రామ స్థాయి నాయకులు వివిధ అనుబంధ సంఘాల నాయకులు, ఎంఎ డీవో, గ్రామ పంచాయతీ కార్యదర్శి, పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

నవ తెలంగాణ-గోవిందరావుపేట

నేడు మండలంలోని పసర గ్రామంలో ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు నార్లాపూర్ రోడ్డు స్కూల్ నుండి వన్ సైడ్ కరెంటు నిలిపి వేయ బడు తుందని వినియోగదారులు సహకరించాలని లైన్ ఇన్స్పెక్టర్ రామచంద్రయ్య తెలిపారు. నార్లాపూర్ రోడ్డు స్కూల్ నుండి వన్ సైడ్ కరెంటు బంద్ చేయబడుతుందని,రేపు స్కూల్లో ఉన్న చెట్లు కొట్టేందుకు విద్యుత్‌ను నిలిపేస్తున్నట్లు తెలిపారు.

ప్రతి సోమవారం విద్యుత్ ప్రజావాణి

ఎంపీడీసీఎల్ ములుగు డీఈ నాగేశ్వరరావు

నవతెలంగాణ-ములుగు

వినియోగదారులకు మరింత చేరువై వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించే దిశగా వారి ఫిర్యాదులను తీసుకొని వాటిని సకాలంలో పరిష్కరించేందుకు ప్రతి సోమవారం విద్యుత్ ప్రజావాణి నిర్వహించనున్నట్లు డివిజనల్ ఇంజనీర్ నాగేశ్వరరావు సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కారం కోసం టీజీ ఎన్పీడీసీఎల్ ములుగు డివిజన్ పరిధిలోని అన్ని ముఖ్య కార్యాలయాల్లో డివిజన్ ఆఫీస్, ఈఆర్వో, సబ్ డివిజన్ ఆఫీస్, సెక్షన్ ఆఫీస్‌ల్లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డివిజన్ ఆఫీస్, ఈఆర్వో, సబ్ డివిజన్ ఆఫీస్, సెక్షన్ ఆఫీస్ లలో ప్రతి సోమవారం ఉదయం 10గంటల నుండి ఒంటి గంట వరకు ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. విద్యుత్ ప్రజావాణి కార్యక్రమాన్ని వినియోగదారుల సేవే లక్ష్యంగా, వారి ఫిర్యాదుల సత్వర పరిష్కారం చూపే విధంగా విద్యుత్ ప్రజావాణి" ను సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి తీర్చిదిద్దారని తెలిపారు.

ఏజెన్సీ చట్టాలను అమలు చేయాలి

మన్యంలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి

ఏఎన్ఎస్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి

నవతెలంగాణ-ములుగు

షెడ్యూల్డ్ ప్రాంత గిరిజన చట్టాల అమల్లో అధికారులు తీవ్ర అలసత్వం వహిస్తున్నారని ఏఎన్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు కొర్స నర్సింహా మూర్తి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్‌కు సోమవారం వినతి అందించారు. ములుగు కలెక్టర్ కార్యాలయం లో జరిగిన గ్రీవెన్స్ లో కలిసి గిరిజన ప్రాంత చట్టాల అమలు తీరు సరిగా లేదని అందుకు అధికారులే ప్రధాన కారణం అన్నారు. ఏజెన్సీ ప్రాంత మండలాల్లో పని చేసే



రెవెన్యూ, పంచాయతీ అధికారుల్లో జవాబు దారితనం లేదన్నారు. వలస గిరిజనేతరులు గ్రామ కంఠ భూముల్లో బహుళ అంతస్తులు నిర్మిస్తున్నారని అన్నారు. ఎల్‌టీఆర్ చట్టానికి విరుద్ధంగా గిరిజనేతరులు భూముల క్రయ విక్రయాలు చేస్తున్నారని అన్నారు. తహసీల్దార్‌లకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఏజెన్సీ చట్టాలపై గౌరవ, మర్యాద లేదని అధికారుల వల్లన ఆదివాసీలకు నష్టం జరుగుతోందన్నారు. ప్రత్యేక స్వయం ప్రతి పత్తి కలిగిన షెడ్యూల్డ్ ప్రాంతాలను అధికారుల తీరుతో ప్రశ్నార్థకంగా మారిపోతున్నాయని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో కనపడే అభివద్ధి గిరిజనులది కాదని, అది వలస గిరిజనేతరులది అని,ఆదివాసీల అభివద్ధి ఆనవాలు ఏజెన్సీలో ఎక్కడ లేదని ఆరోపించారు. ఐటీడీఏ చైర్మన్‌గా ఆదివాసీల అభివద్ధిపై ప్రత్యేక దష్టి పెట్టాలని కోరారు. అత్యవసర ఆరోగ్య పరిస్థితి కల్పించి మన్యం వాసులను కాపాడాలన్నారు. ఏజెన్సీ విద్య పైన ప్రత్యేక దష్టి పెట్టక పోతే అడవి బిడ్డలు విద్యకు దూరం అయ్యే ప్రమాదం ఉందన్నారు. సీఎం గిరివికాస్ పథకం ద్వారా వేసిన బోర్లకు విద్యుత్తు సౌకర్యం కల్పించక పోవడం తో ఆదివాసీ అన్నదాతలు తీవ్రంగా నష్టపోతున్నారని వివరించారు.సత్వరమే సమస్యలు పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు నర్సింహామూర్తి తెలిపారు.

రెండో విడత దళిత బంధు నిధులను వెంటనే మంజూరు చేయాలి

రాష్ట్ర దళిత బంధు సాధన సమితి అధ్యక్షులు కోకిల మహేష్

నవతెలంగాణ-ములుగు

దళితబంధు రెండో విడత నిధులను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర దళిత బంధువుల సాధన సమితి అధ్యక్షులు కోకిల మహేష్ డిమాండ్ చేశారు. దళిత బంధు రెండో విడత భాగంగా



జిల్లా కలెక్టర్ ద్వారా ఎంపికైన రెండో విడత లబ్ధిదారులకు వెంటనే జిల్లా కలెక్టర్ అకౌంట్లో జమ చేయబడిన 26 కోట్ల 49 లక్షల రూపాయలను తక్షణమే విడుదల చేయాలని సోమవారం జిల్లా కలెక్టర్కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కోగిల మహేష్‌తో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జిల్లా యంత్రాంగంచే ఎంపికైన రెండో విడత దళిత బంధు లబ్దిదారులకు ప్రభుత్వం నుండి రూ.26 కోట్ల49లక్షల రూపాయలు కలెక్టర్ అకౌంట్లో జమ చేయబడ్డాయని, కానీ అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడం వల్ల వాటిని తాత్కాలికంగా నిలుపుదల చేశారని గుర్తు చేశారు. జిల్లా కలెక్టర్ ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లి దళిత బిడ్డలకు దళితబంధు లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం కలెక్టర్ ఆఫీసు నుండి అంబేద్కర్ సెంటర్ వరకు దళితబంధు లబ్ధిదారులతో కలిసి అంబేద్కర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రిలు సీతక్కకు తక్షణమే దళితుల ఆకాంక్షను గుర్తించి పేద బిడ్డలైన దళితులను నిధులను విడుదల చేసి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దళిత బంధు కోఆరినేటర్ మడికొండ రమేష్, రాష్ట్ర సలహాదారు దర్శనాల సంజీవ, రాష్ట్ర నాయకులు రాజేష్, కర్రీ శాంబాబు జనగాం రవి, కవ్వం పల్లి బాబు ఆరెందుల కుమార స్వామి, దాసరి రమేష్ పాల్గొన్నారు.

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

హనుమకొండ

మంగళవారం ఆగస్టు 13, 2024 www.navatelangana.com

ఈనెల 31 వరకు బీఆర్ఓయూలో ప్రవేశాలు



నవతెలంగాణ-సుబేదారి

డాక్టర్ బీఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో డిగ్రీ, పీజీ కోర్సుల్లో, బీఎల్ఐసి, ఎంఎల్ఐసీ, పీజీ డిప్లొమా, పలు సర్టిఫికెట్ కోర్సుల్లో 2024-25 విద్యా సంవత్సరం ప్రవేశాలకు గడువు ఈనెల 31 వరకు దరఖాస్తు చేసుకోవాలని వరంగల్ ప్రాంతీయ సంచాలకులు, ఆర్ట్స్అండ్సైన్స్ కళాశా ల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరిజ్యోతి తెలిపారు. రాష్ట్రంలోని స్టడీ సెంటర్లలో చేరడానికి విద్యార్హతలు, ఫీజు, కోర్సులు తదితర వివరాలను వెల్లడించారు. **www.braouonline.in; www.braou.ac.in**లో పొందవచ్చన్నారు. ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ట్యూషన్ ఫీజును చెల్లించాలని, అంతకు ముందు చేరిన విద్యార్థులు సకాలంలో ఫీజు చెల్లించలేక పోయినవా రు కూడా ఈనెల 18లోపు ట్యూషన్ ఫీజును ఆన్లైన్లో చెల్లించాలన్నారు. పూర్తి సమాచారం కొరకు, ఆన్లైన్లో నమోదు తదితరఅంశాలపై సందేహా లుంటే సమీపంలోని అధ్యయన కేంద్రంలో సంప్రదించాలని లేదా విశ్వవిద్యా లయ హెల్ప్డెస్కునంబర్లు 7382929570/580, 040-23680290 /291/294/295 టోల్ఫ్రీ నెం.1800 5990101లో సంప్రదించవచ్చని సూచించారు.

డిగ్రీ, పీజీ ఓల్డ్బ్యాచ్ విద్యార్థులు రెండో, మూడో సంవత్సరంలో ఫీజు సకాలంలో చెల్లించలేక పోయిన వారు, 2015-16 విద్యాసంవత్సరం నుండి 2023-24 వరకు అడ్మిషన్ పొందిఉంటే నెట్ బ్యాంకింగ్/ క్రెడిట్/ డెబిట్కార్డ్ లేదా టీఎస్ ఆన్ లైన్ ద్వారా ట్యూషన్ ఫీజు చెల్లించవచ్చునని వివ రించారు. ఈ సమావేశంలో అధ్యాపకులు డాక్టర్ పుల్లా రమేష్, డాక్టర్ చారి, డాక్టర్ గిరిప్రసాద్, డాక్టర్ నహీదా పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

పౌల్ట్రీఫారాలు మూసి వేయాలని ఫిర్యాదు



నవతెలంగాణ-ఆత్మకూర్

మండలంలోని నీరుకుళ్ళ వెళ్లే దారిలో శ్రీ చెన్నకేశవస్వామి (లక్ష్మి చార్ల) ఆలయ సమీపంలో నీరుకుళ్ళ రహదారి పక్కన ఉన్న కోళ్లఫామ్లను మూసివేయాలని నీరుకుళ్ళ, కందిబండ, పెంచికల పేట, కేశవపూర్ గ్రామాల ప్రజలు ముకుమ్మడిగా సోమవారం ప్రజావాణి లో కలెక్టర్కు ఫిర్యాదుచేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు మాట్లాడుతూ పంటపొలాలకు, చెన్నకేశవస్వామి ఆలయానికి సమీపంలో కోళ్ల ఫామ్లు కొనసాగుతూ ఉండడంతో కోళ్లఫామ్లో నుండి వచ్చే దుర్వాసనతో ఇటు భక్తులను సమీప పంట పొలాల రైతులను రహదారి గుండా ప్రయాణించే వాహనదారులకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కోళ్లఫామ్ వ్యర్థాలు, దుర్వాసన వల్ల ఈగలు దోమలు వృద్ధిచెంది పంట పొలాలను నాశనం చేయడమే గాక అక్కడ పనిచేస్తున్న రైతులకు ఇబ్బందులు తప్పడంలేదని వాపోయారు.

చెన్నకేశవస్వామి దర్శనానికి వచ్చే భక్తులు ఐదు నిమిషాలు కూడా ఆలయంలో ఉండలేని పరిస్థితి ఉందన్నారు. కోళ్లఫామ్లో వ్యర్థాలను సమీపంలోని వాగుల్లో వదలడం మూలంగా వాగు నీరు కలుషితవుతుందన్నారు. అలాగే కోళ్లఫామ్లో పనిచేసే సిబ్బంది బహిరంగ ప్రదేశాల్లో మద్యంసేవిస్తూ బాటసారులు, మహిళలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఫిర్యాదు చేశారు.

అసత్య ప్రచారాలు సహించేది లేదు

- **గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ కార్యవర్గం**

నవతెలంగాణ-హనుమకొండ

అసత్య ప్రచారాలు చేస్తే సహించమని గ్రేటర్ వరంగల్ ప్రె స్క్లబ్ కార్యవర్గం హెచ్చరించింది. సోమవారం బాలసముద్రంలోని ప్రెస్క్లబ్లో అధ్యక్షుడు వేముల నాగరాజు అధ్యక్షతన కా ర్యవర్గం సమావేశం నిర్వహించా రు. మొదటగా దివంగత జర్నలిస్ట్ యోగిరెడ్డి, ఆయన కూతురు ఆద్యరెడ్డి మృ తి పట్ల తీవ్ర సంతాపం తెలిపారు. అనంతరం సామాజిక మాధ్యమాల్లో ప్రెస్ క్లబ్ కమిటీపై కొంతకాలంగా తప్పుడు ప్రచారాలు చేస్తున్న సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనువాస్ ఆలియాస్ కత్తి శ్రీను పరిధి దాటి దివంగత జర్నలిస్ట్ యోగిరెడ్డి ఆత్మహత్యకు క్లబ్కమిటీనే కారణమని పోస్ట్ చేయటాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామన్నారు. శ్రీనివాస్ను సమావేశానికి పిలిచి వివరణ కోరిన అనంతరం సంతృప్తి చెందని కార్యవర్గం ఆయన సభ్యత్వాన్ని రద్దు చేస్తూ తీర్మానించింది. ఏ సభ్యుడైనా కమిటీపై నిరాధార ఆరోపణలు చేసినా, తప్పుడు ప్రచారాలు చేసి కమిటీపై బురద చల్లే ప్రయత్నాలు చేసినా సహించేది లేదని హెచ్చరించింది. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బోల్ల అమర్, ఉపాధ్యక్షులు గోకారపు శ్యాం, బొడిగె శ్రీను, కొడిపల్లి దుర్గాప్రసాద్, అల్లం రాజేష్ వర్మ యంసాని శ్రీనివాస్, జాయింట్ సెక్రెటరీలు సంపెట సుధాకర్, పెద్దపల్లి వరప్రసాద్, వలిశెట్ట్ సుధాకర్, బూర్ల నరేందర్, పెడిచెట్టి విష్ణువర్ధన్, కార్యవర్గసభ్యులు హరీష్, శ్రీకాంత్, నయీంపాషా, వేణుగోపాల్, దిలీప్, సంజీవ్, రాజు, విజయ్రాజ్ తదితరులు పాల్గొన్నారు.

కేయూకు రెగ్యులర్ వీసీని నియమించాలి

- **ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్**



నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

కాకతీయ యూనివర్సిటీకి రెగ్యులర్ వైస్ఛాన్సలర్ను ప్రభుత్వం వెంటనే నియమించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ డిమాండ్ చేశారు. సోమవారం కేయూ లైబ్రరీ వద్ద నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాకతీయ యూనివర్సిటీకి ఇన్చార్జి వీసీగా ఐఏఎస్ వాకాటి కరుణను నియమించినప్పటికీ యూనివర్సిటీకి రావడం లేదన్నారు. కాకతీయ యూనివర్సిటీకి రెగ్యులర్ వీసీని నియమించనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్దఎత్తున యూనివర్సిటీలో ఉద్యమాలు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో కాకతీయ యూనివర్సిటీ విద్యార్థులు మంగీలాల్ ప్రవీణ్, ప్రదీప్ వేణు,అఖిల్ శ్రీకాంత్, జగదీష్ సజన్, కన్న సాయికుమార్, నరేష్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-ఐనవోలు

ఐనవోలు మండల కేంద్రంలో ఐయపురం రాజు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా ఆయన కుటుంబ సభ్యులను పదవ తరగతి పూర్వమిత్రులు కుటుంబ సభ్యులకు పరామర్శించి రూ. 12వేల ఆర్థిక సహాయాన్ని సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో రా జారపు రాజ్కుమార్, జంపాల రాజు, పైండ్ల సంతోష్, అరెల్లి మధు, కట్టబోయిన హరీష్,పబ్బోజు రాజశేఖర్, గద్దల రమేష్, పోలేపాక మహేశ్వర్, రాజారపు రాకేష్, మునిగలరాజు, శశికాంత్, అఖిల్, మహేష్, శ్రీకాంత్, నరేష్, రాజు, మధు, అనిల్, ప్రశాంత్, మహేందర్, రంజిత్, ఉదయ్, మహేష్, శ్రీజ, సుప్రియ, రాయుడు, సాయి పాల్గొన్నారు.

ఏసీబీకి పట్టుబడ్డ ఇరిగేషన్ ఏఈ



నవతెలంగాణ-హనుమకొండ

నిత్యం ఏసీబీ అధికారులు దాడులు నిర్వహిస్తున్నా లంచగొండి అధికారులు మాత్రం తమ తీరు మార్చుకోవడం లేదు. ఏదో ఒక చోట లంచం తీసుకుంటు ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్గా పట్టుబడుతూనే ఉన్నారు. తాజాగ సోమవారం హనుమకొండలో ఓ ఇరిగేషన్ ఏఈ లంచం తీసుకుంటు ఏసీబీ అధికారులకు అడ్డంగా దొరికిపోయాడు. వివరాలిలా ఉన్నాయి. జనగామ జిల్లా పాలకుర్తి మండలం గుడికుంటతండా గ్రామ మాజీ ఎంపీటీసీ బానోత్ యాకు తాను ఎంపీటీసీగా ఉన్నప్పుడు గ్రామంలో చేసిన అభివృద్ధి పనుల బిల్లులు పెండింగ్లో ఉన్నాయి. ఆ బిల్లుల మంజూరు కోసం ఇరిగేషన్ ఏఈ గుగులోత్ గోపాల్నాయక్ను సంప్రదించగా రూ.10 వేలు లంచం డిమాండ్ చేయడంతో యాకు ఏసీబీ అధికారులను సంప్రదించారు. కాగా సోమవారం ఏఈ గోపాల్ బాధితుడు యాకు నుంచి హనుమకొండలోని నక్కలగుట్ట ఎస్బీఐ ప్రాంతంలో రూ. 6వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్గా పట్టుకున్నారు. ఏఈ గోపాల్ గుడికుంట తండా స్పెషల్ ఆఫీసర్గా విధులు నిర్వహిస్తున్నారు.

జర్నలిస్ట్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

ఐనవోలు : జర్నలిస్ట్ యోగిరెడ్డి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని జీఎంపీస్ మం డల ప్రధాన కార్యదర్శి నల్లబెట్టు చిన్న రాజు యాదవ్ కోరారు. ప్రభుత్వం స్పందించి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం తో పాటు, ఆర్థిక సహాయం అందించి, డబుల్ బెడు రూమ్ ఇల్లు ఇవ్వాలని అన్నారు.

వయనాడు బాధితుల చేయూతకు నిధుల సేకరణ



నవతెలంగాణ-ఎల్కతుర్తి

కేరళ రాష్ట్రంలోని వయనాడు వరద బాధితులకు చేయూతనందిం చేందుకు సీపీఎం, వ్యవసాయ రైతు కూలీ సంఘం నాయకులు మండల కేంద్రంలో నిధుల సేకరణ చేశారు. కేరళ రాష్ట్రంలో వయనాడు వరద బాధితుల సహాయార్థం ఇంటింటికి తిరుగుతూ నిధులు సేకరించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర వ్యవసాయ రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకులు అంబాల స్వరూప మాట్లాడుతూ కేరళలో వరదబీభత్సానికి ఇండ్లు, వస్తువులను కోల్పోయిన వారికి మా వంతు బాధ్యతగా సహాయా న్ని అందించడం కోసం సహాయనిధి సేకరిస్తున్నామన్నారు. సేకరించిన సహాయ నిధిని జిల్లా కమిటీకి పంపిస్తామని, అదేవిధంగా బాధితులకు ప్రతి ఒక్కరు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల వ్యవసాయ రైతు కూలీ సంఘం మండల కమిటీ సభ్యులు ఎల్ల స్వామి, షణ్ముఖము, తూర్పాటి శ్రీను, అజ్మీర, బిక్షపతిలు పాల్గొన్నారు.

రుణమాఫీ పొందిన రైతులకు కొత్త పంటరుణాలు ఇవ్వాలి

- **టెస్కాబ్ ఛైర్మన్ మార్నేని రవీందర్రావు**



నవతెలంగాణ-నయీంనగర్

రుణమాఫీ కింద లబ్ధిపొందిన రైతులకు త్వరగతిన కొత్త పంటరుణాలు ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర కోఆపరేటివ్ బ్యాంక్ ఛైర్మన్ మార్నేని రవీందర్ రావు అన్నారు. వరంగల్ జిల్లా సహకార కేంద్రం ప్రధాన కార్యాల యంలో సోమవారం ఛైర్మన్ మార్నేని రవీందర్రావు డీసీసీబీ బ్యాంక్ మేనేజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్నేని మాట్లాడుతూ రుణమాఫీ- 2024 కింద లబ్ధి పొందిన రైతులకు త్వరగతిన తిరిగి కొత్తపంట రుణాలు ఇవ్వవలసిందిగా సూచించారు. అదేవిధంగా అర్హత గల రైతులకు సంబంధించిన ఇన్వాలీడ్ ఆధార్లుగా ఉన్నటువంటి ఎర్రర్లను ప్రభుత్వం వారి అనుమతితో ఈ నెల 19 లోపు సరియైన ఆధార్కాపీలను సమర్పించి రైతు లకు లబ్ధి చేకూరేలా చేయాలన్నారు.

అర్హులైన రైతుల రుణాలను ప్రభుత్వానికి సమర్పించడంలో అలసత్వాన్ని ప్రదర్శించిన సంఘాల సిబ్బందిని బాధ్యులను చేయవలసిందిగా సంబంధిత డిసిఓలకు సమాచారం ఇవ్వాలని బ్యాంక్ సీఈఓని ఆదేశించారు. అలానే ప్రతీ సంఘాలను సందర్శించి రుణమాఫీ పొందిన రైతులకు వీలైనంత త్వరగా తిరిగి రెన్యువల్ చేయడం ద్వారా రైతులకు వానాకాలం పంటల సాగుకు పెట్టుబడి ఇబ్బందులు తలెత్తకుండా సాగు చేస్తారని సూచించారు.

రుణాల రికవరీ, పాలసీ మార్గదర్శకాలపై,విద్య రుణాలు,దీర్ఘకాలిక రుణాలు, బంగారం రుణాలు, డిపాజిట్స్పై వారు సమీక్ష సమావేశం నిర్వహిం చారు. ఈ సమావేశంలో సీఈఓ వజీర్ సుల్తాన్, డీజీ ఎం అశోక్, ఏజీఎంలు మధు,గొట్టం స్రవంతి, కృష్ణ మోహన్, గంప శ్రవంతి, రాజు, బ్యాంక్ మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

సెల్ఫోన్ యజమానులు సీఈఐఆర్ పోర్టల్లో ఫిర్యాదు చేయాలి

- **వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్కిశోర్ఝా**

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

సెల్ఫోన్ యజమానులు తమ ఫోన్ పోగొట్టుకుంటే చింతించవద్దని తక్షణమే సీఈఐఆర్ పోర్టల్లో ఫిర్యాదు చేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ప్రజలకు సూచించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సెల్ ఫోన్ యజమానులు పోగొట్టుకున్న సెల్ ఫోన్ల స్వాధీనంకు సంబంధించి సిసిఎస్ పోలీసుల ఆధ్వర్యంలో సెల్ఫోన్ రికవరీ మేళా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పోగొట్టుకున్న సెల్ఫోన్ల ఆచూకీ కనుగొని పోలీసులు స్వాధీనం చేసుకున్న సెల్ఫోన్లను వరంగల్ పోలీస్ కమిషనర్ చేతులమీదుగా సెల్ఫోన్ యజమానులకు అందజేశారు. అనంతరం సీపీ మాట్లాడుతూ దొంగతనం కాని పోగొట్టుకున్న సెల్ ఫోన్ల ఆచూకీ సీసీఎస్తో పాటు ప్రతి పోలీస్స్టేషన్ పరిధిలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇప్పటి వరకు 7022 సీఈఐఆర్ పోర్టల్లో ఫిర్యాదు చేయగా ఇందులో 4028 సెల్ ఫోన్లను గుర్తించి అందులో ఇప్పటి వరకు 2527 సెల్ఫోన్లను స్వాధీనం చేసుకొని సెల్ఫోన్ యజమానులకు అందజేయడం జరిగిందన్నారు. గత వారంరోజుల పాటు సీసీఎస్ పోలీసులు శ్రమించి 150కు పైగా సెల్ఫోన్లను స్వాధీనం చేసుకున్నారన్నారు.

సెల్ఫోన్ దొంగతనాల నుండి విముక్తి కల్పించడానికై డిపార్ట్మెంట్ ఆఫ్ టెలీ-కమ్యూనికేషన్ సీఈఆర్పోర్టల్ను అందుబాటులోకి తీసుకురావడంతో మంచి ఫలితాలు సాధిస్తున్నట్లు వివరించారు. ఎవరైనా మొబైల్ పోగొట్టుకున్న లేదా దొంగిలించబడిన వెంటనే సీఈఐఆర్ పోర్టల్ https://www.ceir.gov.in నందు బ్లాక్ చేసి, సంబంధిత పోలీసుస్టేషన్లో సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీసీఎస్ ఇన్స్పెక్టర్ అబ్బయ్య, ఎఎస్ఐ గోపాల్ రెడ్డి, ఐటీ కోర్ హెడ్ కానిస్టేబుల్ మాధవరావు, హెడ్ కానిస్టేబుల్ రాములుతో పాటు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



రైల్వేకార్మికుల సమస్యలు పరిష్కరించాలని ధర్నా

నవతెలంగాణ-ఎన్జీవోస్ కాలనీ

రైల్వే కార్మికల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్యూనియన్కాజీపేటటెక్నికల్ బ్రాంచ్ సెక్రటరీ సమ్మయ్య అన్నారు. రై ల్వే కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం రైల్వే కార్మికులు కాజీపేటలో నిరసన ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సమ్మయ్య మాట్లాడుతూ ఎస్సిఆర్ఎంయు జనరల్సెక్రటరీ సిహెచ్.శంకర్రావు పిలుపు మేరకు సికింద్రాబాద్ డివిజనల్ నాయకులు రవీందర్ సారథ్యంలో కాజీపేట టెక్నికల్ బ్రాంచ్లో మహా ధర్నా నిర్వహించడం జరిగిందన్నారు. రైల్వే కార్మికుల సమస్యలైన కొత్తపెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిం చాలని, కరోనా సమయంలో నిలిపివేసిన 18 నెలల డిఏ ఆరియర్స్ ని వెంటనే కార్మికులకు ఇవ్వాలని లేనిపక్షంలో ఏఐఆర్ఎఫ్, ఎస్సిఆర్ఎంయు పిలుపునిస్తే రైల్వే కార్మికుల హక్కులకొరకు సమ్మెకు సిద్ధమన్నారు. కార్మికుల హక్కులకై ఎల్లవేళలా పో రాడే మజ్దూర్ యూనియన్ ఎర్రజెండాను ట్రేడ్ యూనియన్ ఎన్నికలలో గెలిపించవలసిన బాధ్యత కార్మిక వర్గంపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ చైర్మన్ రాజు, ట్రెజరర్ రాజు, ఆఫీస్ బేరర్స్ సదాశివరెడ్డి, హరీష్, రఫీ, లావణ్య, అక్బర్, కార్మికులు పాల్గొన్నారు.



క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో దేశాన్ని కాపాడుకుందాం

- **ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆగస్టు 14న జనజాగరణ**



నవతెలంగాణ-నయీంనగర్

క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో దేశాన్ని రక్షించుకుందామని, కేంద్ర బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలోకు వ్యతిరేకంగా ఐక్యంగా ఉద్యమించాలని తెలంగాణ వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షులు సారంపల్లి వాసుదేవరెడ్డి పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా ఆగస్టు 14న రాత్రి హనుమకొండ చౌరస్తాలో జనజాగరణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. సోమవారం సిఐటియు జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ అధ్యక్షతన ప్రజాసంఘాల సంయుక్త సమావేశం రాంనగర్ లోని సుందరయ్య భవన్లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం సామాన్యులకు మాటల్లో, సంపన్నులకు కార్పొరేట్లకు మూటలు వడ్డించే విధంగా మోడీప్రభుత్వం కేంద్రంలో బడ్జెట్ను ప్రవేశపెట్టిందని. అత్యంత కీలకమైన వ్యవసాయం, పారిశ్రామిక రంగానికి ఈ బడ్జెట్లో ప్రాధాన్యత ఇవ్వలేదని, అన్నిరంగాల్లో కార్పొరేట్లకే పెద్దపీట వేసిందని, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలను ప్రైవేటీకరించకుండా పటిష్ట పరిచే చర్యలు నిర్దిష్టంగా ప్రకటించలేదని. ప్రభుత్వ రంగ సంస్థల ప్రవేటికరణల్లో భాగంగానే సింగరేణి 61 బ్లాక్ లను ప్రైవేటు సంస్థలు కట్టబెట్టే ప్రక్రియను చేపట్టిందన్నారు.

అందులో భాగంగానే తెలంగాణలో ప్రతిష్టాత్మకమైన సింగరేణి శ్రావణపల్లి బ్లాకును వేలం వేయడానికి సిద్ధపడిందని, స్కీం వర్కర్స్ను కార్మికులుగా గుర్తించలేదని, అసంఘటీత రంగ కార్మికుల సంక్షేమం పట్టించుకోలేదని, రైతులకు కనీసమద్దతు ధర గ్యారెంటీ ఇవ్వలేదని, సుదీర్ఘ రైతు పోరాట ఫలితంగా రద్దు చేసిన రైతు చట్టాలను హామీ మేరకు నిర్దిష్ట చర్యలు తీసుకోలేదని, గ్రామీణ ఉపాధి హామీని బలోపేతం చేసే రకంగా చర్యలు చేపట్టలేదన్నారు. అనేక త్యాగాలు, పోరాటాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా మారుస్తూ పార్లమెంట్ లో చట్టం చేసిందన్నారు. వేతనాలకోడు చట్టంతో కనీస వేతనాలు నిర్ణయించే మౌలిక విధానానికి తూట్లు పొడిచిందని, పార్శ్వామిక సంబంధాల కోడ్ చట్టంతో సమ్మెహక్కును కాలరాస్తుందని,సామాజిక భద్రత కోడు వృత్తి సంబంధ రక్షణ, ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్లతో పిఎఫ్, ఈఎస్ఐ, వెల్ఫేర్ బోర్డ్ లపై గొడ్డలి వేటు వేస్తుందని, తిరిగి 12 గంటల పని విధానం అమల్లోకి తెస్తుందనీ దేశంలో అత్యధిక ధనవంతులకు కార్పొరేట్ వర్గాలకు ఆదాయ సంపదపై టాక్స్ పెంచి విద్యా ఆరోగ్యం వ్యవసాయ రంగాల కేటాయించాలని కోరారు.

నాలుగు లేబర్ కోడ్లను , విద్యుత్ సవరణ బిల్లును 2002 రద్దు చేయాలని, 73 షెడ్యూల్డ్ పరిశ్రమల జీఓలను సవరించి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, బొగ్గు బ్లాకులు వేలం వేయడాన్ని నిలుపుదల చేయాలని, సింగరేణికే నేరుగా గనులు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. పెట్రోల్, డీజిల్, కిరోసిన్, వంటగ్యాస్ పై కేంద్ర ఎక్సైజ్ సుఖాన్ని గణనీయంగా తగ్గించాలని, ప్రజా పంపిణీ వ్యవస్థను విస్తరింప చేయాలని 14 నిత్యవసర వస్తువులు దాని పరిధిలోకి విస్తరించాలని డిమాండ్ చేశారు.

ఈ సమావేశంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.చుక్కయ్య, సిఐటియూ జిల్లా ఉపాధ్యక్షులు గాదె ప్రభాకర్ రెడ్డి, తెలంగాణ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి వాంకుడోత్ వీరన్న, తెలంగాణ మత్స్యకారులు మత్స్య కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గొడుగు వెంకట్ ,కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి మంద సంపత్, ఐద్వా జిల్లా కార్యదర్శి ఎల్.దీప, రమలు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ చిట్ఫండ్పైచర్యలు తీసుకోవాలి

- **డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.తిరుపతి**



నవతెలంగాణ-సుబేదారి

ప్రజల సొమ్మును చిట్టీలు, డిపాజిట్ల పేరుతో డబ్బులు వసూలు చేసుకుని వారికి ఇవ్వకుండా తప్పించుకొని తిరుగుతున్న ప్రైవేటు చిట్ఫండ్ యజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.తిరుపతి హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం అందజేశారు. చిట్టీలు, డిపాజిట్లు చేసుకునే సమయంలో అనేక మాయమాటలు చెప్పి గడువు ముగిశాక చెల్లించిన డబ్బులను తిరిగి ఇవ్వకుండా, వారి కార్యాలయం దగ్గరికి వెళితే ఎవరూ లేకుండా తాళాలు వేసి ఉండడంతో చాలామంది బాధితులు వెనుతిరిగి పోతున్నారన్నారు. చిట్ఫండ్ యాజమాన్యాలు మాత్రం వాళ్ల బాధలు పట్టించుకోకుండా ప్రజల సొమ్ముతో జల్సాలు చేస్తున్నారు. ప్రజల సొమ్మును తిరిగి ఇవ్వాలని గతంలో సంబంధిత అధికారులు, పోలీసులు ఆదేశాలు జారీచేసినా వాటిని తుంగలోకితొక్కి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రజలను మోసం చేసిన ప్రైవేట్ చిట్ఫండ్ యజమాన్యాలపై చర్యలు తీసుకొని ప్రజల సొమ్మును తిరిగి ఇప్పించాలని డిమాండ్ చేశారు.

యువత నైపుణ్యాలు పెంపొందించుకోవాలి




నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

యువతీ యువకులు తమలోని నైపుణ్యాలను పెంపొందించు కుని జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోవాలని జాతీయ యువజన పురస్కార గ్రహీత మండల పరశురాములు అన్నారు. అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా సోమవారం హనుమకొండ స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ సెంటర్లో అభ్యుదయ సేవా సమితి, జిల్లా యువజన సంక్షేమ, క్రీడా శాఖ సంయుక్తంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయనముఖ్య అతిథిగాహాజరై యువతలో నైపుణ్య అభివృద్ధిపై అవగాహన కల్పించారు. యువతకు నైపుణ్యాలు ఎంతగానో అవసరమని, భవిష్యత్లో వాటి ప్రాముఖ్యత గురించి వివరించారు.

ఈ కార్యక్రమంలో ఆఫీస్ సూపరింటెండెంట్ వై.విజయశ్రీ, రిటైర్డ్ ఉద్యోగి జేఎస్.రఘువీర్, స్కిల్ డెవలప్మెంట్ ఫ్యాకల్టీ సభ్యులు ఎస్.సోనీ, ఎస్.శైలజ, బి.నిషిత, నాగస్వరూప, జె.తిరుపతి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో టై, బెల్టుల పంపిణీ



నవతెలంగాణ-నడికూడ

మండలంలోని చర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో సోమవారం సుప్రజా ఫార్మసీ యజమాని అచ్చ జనార్ధన్ వరంగల్ తన పుట్టినరోజు సందర్భంగా రూ.5 వేలవిలువ గల టై, బెల్టులను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సంద ర్భంగా హెచ్ఎం అచ్చ సుదర్శన్, సుప్రజా ఫార్మసీ యజమాని అచ్చ జనార్ధన్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.రవీందర్, విద్యా వాలంటీర్లు బాపూరావు, పరిశవేని జ్యోతి, అంగన్వాడీ టీచర్స్ భీముడు లక్ష్మీ, నందిపాటి సంధ్య, ఐఆర్పి రమేష్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్టీఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం



నవతెలంగాణ-సుబేదారి

స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్టిఎఫ్ఐ) ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని ఎస్టీఎఫ్ఐ పతాకాన్ని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కే.సోమశేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి కే సోమశేఖర్ మాట్లాడుతూ విద్యారంగ పరిరక్షణ కోసం, ఉపాధ్యాయుల హక్కుల కోసం దేశవ్యాప్తంగా పోరాటం చేస్తూ ఎస్టిఎఫ్ఐ విద్యారంగానికి దిక్సూచిగా పని చేస్తుందన్నారు. నూతన విద్యావిధానాన్ని రద్దుచేయాలని, అందరికీ అందుబాటులోకి విద్యను తేవాలని, పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని, దేశ వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలన్నారు. విద్యారంగానికి బడ్జెట్లో 30శాతం నిధులు కేటాయించి ప్రభుత్వాలు తమ చిత్తశుద్ధిని చాటుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ వరంగల్ జిల్లా అధ్యక్షులు తాటికాయల కుమార్ ,హనుమకొండ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సిహెచ్.రవీందర్రాజు, పెండెం రాజు, జిల్లా ఉపాధ్యక్షులు మేకిరి దామోదర్, జిల్లా కోశాధికారి రవూఫ్, జిల్లా కార్యదర్శులు సిఎస్ఆర్ మల్లిక్, తిరునహరి శ్రీనివాస్, సిహెచ్.లింగారావు, సదానందం, కుమారస్వామి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కాళోజీ కళాక్షేత్రం పనులు గడువులోగా పూర్తి చేయాలి

- **హనుమకొండ జిల్లా కలెక్టర్ పీ.ప్రావీణ్య**



నవతెలంగాణ-హనుమకొండ

కాళోజీ కళాక్షేత్రం పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు ఆయా శాఖల అధికారులు చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. సోమవారం బాలసము ద్రంలోని కాళోజీ కళాక్షేత్రం నిర్మాణ పనులను కలెక్టర్ జిడబ్ల్యుఎంసి కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనులు జరుగుతున్న కాళోజి కళాక్షేత్రంలోని ఆడిటోరియం,పెయింటింగ్స్, టైల్స్, ఎలక్ట్రికల్, ప్లంబర్, ఫ్యాబ్రికేషన్ తదితర పనులను కలెక్టర్ పరిశీలించి వాటికి సంబంధించిన పనుల పురోగతి వివరాలను అధికారులను, నిర్మాణ సంస్థల ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిర్మాణ పనుల వేగం పెంచాలని, పనిచేసే కార్మికుల సంఖ్యను పెంచి పనులను త్వరగా పూర్తిచేయాలన్నారు. ఎక్కడా కూడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలోఈఈ భీమ్రావు, కుడా పిఓ అజిత్ రెడ్డి సంబంధిత అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

వయనాడు వరద బాధితుల కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో కేయూలో విరాళాల సేకరణ

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

కేరళ రాష్ట్రంలో ఇటీవల కురిసిన కురిసిన భారీ వర్షాల కారణంగా వయనాడు ప్రాంతంలో కొండ చరియలు విరిగిపడి వందలాది మంది మృత్యువాత పడగా వేలాది మంది నిరాశ్రయులయ్యారు. వారిని ఆదుకోవడం కోసం సీఐటీయూ జాతీయ కమిటీ పిలుపులో భాగంగా కాకతీయ యూని వర్సిటీలో సోమవారం సంఘీభావ నిధిని ఉద్యోగులు, విద్యార్థులు, కార్మి కుల నుండి రూ.13280లు సేకరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ మాట్లాడుతూ సేకరించిన రూ.13280 లను వరద బాధితుల సహాయార్థం సీఐటీయూ ఆల్ ఇండియా కమిటీ ద్వారా వారికి పంపించడం జరుగుతుందని సంఘీభావనిధి ఇచ్చినటు వారందరికీ కూడా కృతజ్ఞతలు తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలతో ఇండ్లు కూలిపోవడం, రహదారులు దెబ్బ తినడంతో ప్రభుత్వం కల్పించే పునరావాస కేంద్రాల్లో వేలాదిమంది ప్రజలు ఉంటున్నారని అలాంటి వారికి కార్మికవర్గం అండగా ఉండాలని ఆయన కోరారు. కేంద్ర ప్రభుత్వం కూడా తక్షణమే వారిని ఆదుకోవడం కోసం తగిన ఆర్థిక సహాయం చేయాలని రమేష్ డిమాండ్ చేశారు. తక్షణ సహాయాన్ని కేంద్ర ప్రభుత్వం విడుదల చేయాలని కోరారు.





ఈ కార్యక్రమంలో సీఐటీయూ యూనివర్సిటీ నాయకులు మెట్టు రవి, కచ్చకాయల చిరంజీవి, ఆకుతోట రామచందర్, దేశినీ రవికుమార్, సందీప్, శోభ, దామర కృష్ణ, సంఘాల శ్రీనివాస్, ఎస్.రాజు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
3
జయశంకర్ భూపాలపల్లి
మంగళవారం ఆగస్టు 13, 2024
www.navatelangana.com

'సంపూర్ణతా అభియాన్' లక్ష్యాలు సాధించాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



నవతెలంగాణ-భూపాలపల్లి

సంపూర్ణతా అభియాన్ కార్యక్రమ లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లాలో నీతి అయోగ్ యాస్పిరేషనల్ బ్లాకుగా గుర్తించిన మారుముల మండలాలైన పలిమెల, మహాముత్తారం మండలాలలో సంపూర్ణతా అభియాన్ కార్యక్రమం నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... వైద్య ఆరోగ్య శాఖ ద్వారా రెండు మండలాలలోని ప్రజలకు వైద్య సేవలు అందించాలని, 35 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరికీ రక్తన మూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. బిపి, మధుమేహం థైరాయిడ్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందించాలని సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించి ప్రజలను అప్రమత్తం చేయాలని తెలిపారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం అందించాలని తెలిపారు. చదువు మానేసిన విద్యార్థులను గుర్తించి వారిని తిరిగి పాఠశాలలో చేర్పించాలని అన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు మట్టి నమూనాలను సేకరించి పరీక్షించి డిమాండ్ ఉన్న పంటలను సాగుచేసే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామీణ అభివద్ధి శాఖ ద్వారా మహిళలకు స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసి స్కిల్ డెవలప్మెంట్, ఉపాధి కల్పనలపై అవగాహన కల్పించాలన్నారు. యాస్పి రేషనల్ బ్లాక్ మండలాలలో ఈ నెల 25వ తేది వరకు 80 శాతంప్రగతి రావాలని, నివేదికలు అందించాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జెడ్పీ సీఈవో విజయలక్ష్మి, సీపీఓ శామ్యూల్, తదితరులు పాల్గొన్నారు.

సత్వర చర్యలు చేపట్టాలి

ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. సోమవారం సమీకృత కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజా వినతులు స్వీకరించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా పలు సమస్యలతో కూడిన 43 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. వచ్చిన ప్రతి దరఖాస్తును పరిశీలించి సంబంధిత శాఖలు పరిష్కరించాలని ఎండార్స్మెంట్ చేసినట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి నుండి జిల్లాకి సంబంధించి వచ్చిన ప్రజావాణి దరఖాస్తులు అలాగే జిల్లాస్థాయిలో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించాలని ఆదేశించారు. మండల స్థాయిలో ప్రతి తహసిల్దార్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహిస్తున్నామని, మండల పరిధిలోని సమస్య అయితే సంబంధిత తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు చేయాలని స్పష్టం చేశారు. అనంతరం జిల్లా అధికారులతో మత్తు పదార్థాల నియంత్రణపై జిల్లా వ్యాప్తంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా అధికారులతో మత్తు పదార్థాల నియంత్రణపై ప్రతిజ్ఞ చేయించారు. అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.


సీఎంఆర్ డెలివరీ లక్ష్యాలు సాధించాలి

నవతెలంగాణ-భూపాలపల్లి

సెప్టెంబర్ 30వ తేదీ వరకు సిఎంఆర్ డెలివరి లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ రైస్ మిల్లర్లును ఆదేశించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్లో సీఎంఆర్ ప్రక్రియ వేగవంతంపై రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా లో వానాకాలం 2023కు సంబంధించిన 16 వేల మెట్రిక్ టన్నుల సిఎంఆర్ పెండింగ్‌లో ఉందని సెప్టెంబర్ 30 వరకు పూర్తి చేయాలని ఆదేశించారు. మార్కెట్‌లో రా రైస్ కు ఎక్కువ డిమాండ్ ఉందని మిల్లర్లు ఎంత ఎక్కువగా మిల్లింగ్ చేస్తే అంత తొందరగా రానున్న వానాకాలం పంటకు మిల్లర్లు సిద్ధంగా ఉండొచ్చని అన్నారు. మిలర్లతో ప్రతి 15 రోజులకు ఒకసారి మీటింగ్ నిర్వహిస్తామని తెలిపారు. మిల్లర్లు జాప్యం వహిస్తే సీఎంఆర్ ధాన్యాన్ని మరొక మిల్లుకు కేటాయిస్తామని అన్నారు. రేపటి నుండి రెవెన్యూ అధికారులు మిల్లింగ్ తీరును తనిఖీ చేస్తారని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, పౌర సరఫరాల సంస్థ డీఎం రాఘవేందర్, మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రవి తదితరులు పాల్గొన్నారు.

కొమురంభీం స్ఫూర్తితో అభివృద్ధికి బాటలు


మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్



నవతెలంగాణ-మల్హర్‌రావు

కొమురంభీమ్, మండల అభివృద్ధి ప్రధాత బెల్లంకొండ మల్హర్ రావు స్ఫూర్తితో అభివృద్ధికి బాటలు వేస్తామని మంథని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ మంథని ఇన్‌చార్జి పుట్ట మధుకర్ అన్నారు. మాజీ ఎంపీపీ బెల్లంకొండ మల్హర్ రావు 60వ జయంతి సందర్భంగా మండలంలోని కొయ్యూర్ ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన మల్హర్‌రావు విగ్రహానికి పూలమాలేసి ఘన ని వాలి అర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. నాడు సర్పంచ్‌గా మల్హర్ రావు మండల అభివృద్ధికి బీజం వేశారని గుర్తు చేశారు. నాగులమ్మ ఆలయం నుంచి మల్లారం తాడిచర్ల వరకు రోడ్లు నిర్మాణం కోసం అధికారులను ఎదిరించారని, ప్రజల అవసరాల కోసం ఎవరినైనా ఎదిరించవచ్చని చెప్పిన గొప్ప వ్యక్తి అన్నారు. జల్ జంగల్ జమీన్ అనే నినాదంతో పోరాటం చేసిన కొమురం భీం స్ఫూర్తితో మల్హర్‌రావు ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేశారన్నారు. మల్హర్‌రావు ఆశయాలను కొనసాగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గొనె శ్రీనివాసరావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ రామారావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాఘవరెడ్డి, యూత్ అధ్యక్షుడు జాగరి హరీష్, కొయ్యూర్ తాజామాజి సర్పంచ్ సిద్ధి లింగమూర్తి, మాజీ ఎంపీటీసీ రావుల కల్పన మొగిలి, మాజీ కోఆప్షన్ అయూబ్ ఖాన్, రామన్న యాదవ్ తోపాటు బీఆర్ఎస్ మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజావాణికి 50 దరఖాస్తులు : డిప్యూటీ తహసీల్దార్



నవతెలంగాణ-మహదేవపూర్

మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో 50 దరఖాస్తులు వచ్చాయని డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ అన్నారు. ఆయా దరఖాస్తులను పరిశీలించి, పరిష్కారం కాకుంటే జిల్లా కేంద్రానికి పంపడం జరుగుతుందని పేర్కొన్నారు. ఎక్కువ శాతం భూ సమస్యలపై వినతులు వచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ జగన్మోహన్ రెడ్డి, కార్యాలయ సూపరింటెండెంట్ సౌభాగ్యవతి కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు

ఆరుగురు పేకాట రాయుళ్ల అరెస్ట్

నవతెలంగాణ-గణపురం

మండలంలోని చెల్పూర్ శివారు వీరేపల్లికి చెందిన ఆరుగురు పేకాట ఆడుతుండగా గణపురం ఎస్ఐ రేఖ అశోక్ సోమవారం పట్టుకున్నారు. పేకాట ఆడుతూ పట్టుబడ్డ వారిలో వీరయ్యపల్లికి చెందిన పొనగంటి ప్రశాంత్, కన్నూరి ప్రశాంత్ బీరెల్లి విలాస్, ఆముదాల సతీష్, పేరుక సారంగపాణి, గడ్డం సారంగపాణిలు ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజలకు న్యాయం చేయాలి : జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే

నవతెలంగాణ-భూపాలపల్లి



పోలీసులు సమర్ధవంతంగా పనిచేసి ప్రజలకు న్యాయం చేయాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పి కిరణ్ ఖరే అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజాదివాస్ కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి 17 ఫిర్యాదులు స్వీకరించి వారి సమస్యలు తెలుసుకున్నారు. సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులకు ఫోన్ చేసి మాట్లాడారు. ప్రజల సమ స్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలని, విధులు నిర్వహించడంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. సంఘ వ్యతిరేక చర్యలకు పాల్పడేవారి పట్ల చట్ట పరంగా కఠినంగా వ్యవహరించాలని ఎస్పి ఆదేశించారు.

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు చేయాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్



స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణకు అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం అన్ని శాఖల జిల్లా అధికారులతో స్థానిక ఐడీఓసీ కార్యాలయపు సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజు వివిధ శాఖల ద్వారా స్టాల్స్ ఏర్పాటు చేయాలని, జిల్లాలలో పలు సందర్భాల్లో ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు, అధికారులకు ప్రశంసా పత్రాలు అందించేందుకు సిబ్బంది జాబితా అందచేయాలని అన్నారు. ప్రతి కార్యాలయం నుంచి ప్రతిపాదనలు సమర్పించాలని పేర్కొన్నారు. వేడుకలకు సంబంధించి ప్రోటోకాల్ పాటిస్తూ సీటింగ్ ఏర్పాట్లు చేయాలని, స్టేజ్ ఏర్పాట్లు, తాగునీటి సరఫరా, పబ్లిక్ అడ్రస్ సిస్టం ఏర్పాట్లను సంబంధిత శాఖ అధికారులు అంబేద్కర్ స్టేడియంలో పకడ్బందీగా చేయాలన్నారు. జిల్లా ప్రగతి సందేశం తయారు చేయాలని డీపీఆర్ఓ, డీఆర్డీఓను ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా విద్యార్థులతో దేశ భక్తి గీతాలపై నృత్య ప్రదర్శనలు, తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వేడుకల సందర్భంగా అంబులెన్సులు, అగ్నిమాపక వాహనం అందుబాటులో ఉంచాలని అన్నారు. అనంతరం జిల్లా ఎస్పీ కిరణ్ ఖరెతో కలిసి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంను పరిశీలించారు. వర్షం కారణంగా నీరు నిల్వ ఉండకుండా గ్రావెల్‌తో నింపాలని మున్సిపల్ అధికారులను, విద్యుత్ సరఫరా అందించాలని సింగరేణి అధికారులను ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణ ఏర్పాట్లు ప్రారంభించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జెడ్పీ సీఈఓ విజయలక్ష్మి, డీఆర్డీఓ నరేష్, డీఈఓ రాజేందర్, జిల్లా వైద్యాధికారి డా మధుసూదన్, ఆర్డీఓ మంగిలాల్, మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్, కలెక్టరేట్ పరిపాలన అధికారి ఖాజా మొయినుద్దీన్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

నవతెలంగాణ-గణపురం



నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధే లక్ష్యమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. సోమవారం మండలంలోని బుద్ధారం నుండి పొట్టిగుట్ట రోడ్డు మరమ్మతుకు, బుద్ధారంఎస్సీ కాలనీ నుండి బీసీ కాలనీ వరకు పనులకు శంకు స్థాపన చేసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. మండలాలను అభివృద్ధి బాటలో ముందుకు తీసుకెళ్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ విడిదినేని అశోక్, మాజీ సర్పంచ్ గండ్ర ఆగమరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ వంగపల్లి భాస్కర్, గణపసముద్రం మత్స్యశాఖ డైరెక్టర్ గూళ్ల రాజకుమార్, సీనియర్ నాయకులు అంబటిపల్లి సంపత్ రావు, మాల బద్రయ్య, ఐలు స్వామియాదవ్, గుల్ల భద్రయ్య అధికారులు పాల్గొన్నారు.

ఇంటింటా ఫీవర్ సర్వే, వైద్య శిబిరం



నవతెలంగాణ-మల్హర్‌రావు

మండల కేంద్రమైన తాడిచెర్లతోపాటు,ఎస్సికాలనిలో ఎక్కువగా ,,తాడిచెర్ల విష జ్వరాలు,, అనే కథనానికి మండల ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి రాజు, పంచాయతీ కార్యదర్శి చెలుకల రాజు యాదవ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం,పారిశుధ్య చర్యలు,ఇంటింటా పివర్ సర్వే సోమవారం చేపట్టారు.వైద్య శిబిరంలో 36 ఒపి, ఇంటింటా పివర్ సర్వేలో 25, విషమంగా ఉండడంతో ఒక్కరిని భూపాలపల్లి జిల్లాలోని వంద పడకల ఆసుపత్రికి రెపర్ చేసినట్లుగా వైద్యాధికారి తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడారు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండటం,ప్రజల ఆరోగ్యాన్ని రక్షించడానికి ఇంటింటా పివర్ సర్వే చేపట్టినట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

గుడిసె వాసులకు పట్టాలు ఇవ్వాలి

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి

నవతెలంగాణ-భూపాలపల్లి



గుడిసెవాసులకు పట్టాలు ఇవ్వాలని, ప్రజా ఆకాంక్షకు అనుగుణంగా పరిపాలన జరగాలని, పార్టీ బలోపేతానికి రాష్ట్ర నిర్మాణ కౌన్సిల్ సమావేశాలు ఏర్పాటు చేశామని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి అన్నారు. సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సీపీఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన జిల్లా నిర్మాణ కౌన్సిల్ సమావేశానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావుతో కలిసి ఆయన హాజరై మాట్లాడారు. కేంద్రంలో ప్రధాని మోడీ మూడోసారి అధికారంలోకి రాగానే దేశంలో నీట్ లీకేజీ లాంటి అనేక సమస్యలు తలెత్తి విద్యార్థులకు, నిరుద్యోగులకు తీరని అన్యాయం జరిగిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లట ఆయనకు సహకరించిన మిత్రపక్షాలకే అధిక నిధులు కేటాయించారని, తెలంగాణకు మొండిచేయి చూపించారని మండిపడ్డారు. రాష్ట్ర విభజన హామీలను విస్మరించిందని దుయ్యబట్టారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో నియంతృత్వ ధోరణి అవలంభిచడంతో ప్రజలు కాంగ్రెస్‌కు అవకాశం ఇచ్చారని అన్నారు. ఆ మేరకు పరిపాలన కొనసాగించాలని అన్నారు. ఉపాధి హామీ, మధ్యాహ్న భోజనం పేదలకు రావాల్సిన పెండింగ్ డబ్బులు చెల్లించాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పేదలు వేసుకున్న గుడిసెలు, పక్కా ఇంటి నిర్మాణం కోసం, తదితర సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యే కూనమనేని సాంబశివరావుతో కలిసి వివరిస్తామని తెలిపారు. సీపీఐ ఆవిర్భవించి 100 సంవత్సరాలు కాబోతున్న సందర్భంగా పార్టీ బలోపేతానికి జిల్లా కౌన్సిల్ సమావేశాల అనంతరం వరంగల్‌లో మూడు రోజులు రాష్ట్రస్థాయి సమావేశాలు ఉంటాయని, భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జిల్లా కౌన్సిల్ సభ్యులు మోటపలుకుల రమేష్, పైళ్ల శాంతి కుమార్, మామిడాల సమ్మిరెడ్డి, సోత్కు ప్రవీణ్ కుమార్, మతాంగి రామచందర్,ఎం విజేందర్,క్యాథరాజు సతీష్, తాళ్ల పోశం, నెరేళ్ల జోసఫ్,వేముల శ్రీకాంత్ వివిధ మండలాల బాధ్యులు పాల్గొన్నారు.

సైన్స్ లేనిదే ప్రపంచం లేదు

జిల్లా సైన్స్ అధికారి బర్ల స్వామి



నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్

సైన్స్ లేనిదే ప్రపంచం లేదని జిల్లా సైన్స్ అధికారి బర్ల స్వామి అన్నారు సోమవారం జిల్లా కేంద్రంలో నేషనల్ గ్రీన్ కాప్స్ డిపార్ట్మెంట్ సహకారం తో ఎల్ఈడి- బల్బ్స్, ట్యూబ్ లైట్స్ తయారీ నిర్వహణ కార్యక్రమాన్ని జిల్లా విద్యా శాఖ సైన్స్ అధికారి బర్ల స్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బర్ల స్వామి మాట్లాడుతూ... విద్యార్థికి చదువుతో పాటు సైన్స్ సహజ పరిశీలన అవసరమని అన్నారు. ప్రతి విద్యార్థి జీవితంలో సైన్స్ ఒక భాగం అన్నారు. ఎల్ఈడీ, ట్యూబ్ లైట్స్ తయారీ కార్యక్రమం ద్వారా ప్రతి విద్యార్థిలో సైన్స్ ప్రతిభ ను వెలికి తీయొచ్చన్నారు. ప్రతి ఒక్కరు ఈ సైన్స్ అభివృద్ధి లో భాగం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఆశ్రమ బాలికల ప్రధానోపాధ్యాయులు ఈ రాజారత్నం, ఎన్జిసి స్టేట్ కోఆర్డినేటర్ బి విద్యాసాగర, ఎఫ్‌పి ఎస్‌టి జిల్లా అధ్యక్షుడు రాజబాబు, జిల్లాలోని 50 పాఠశాలల నుండి 150మంది విద్యార్థులు, 50మంది సైన్స్ ఉపాధ్యాయులు గైడ్ టీచర్స్ పాల్గొన్నారు.

ఆర్యవైశ్య భవనం ఏర్పాటుకు కృషి చేయాలి

- ఆర్యవైశ్య సంఘం సభ్యులు

నవతెలంగాణ-రేగొండ



రేగొండ మండల కేంద్రంలోని ఆర్యవైశ్య సంఘం భవన ఏర్పాటుకు సహకరించాలని ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు మాడూరి ముక్తేశ్వర్ కోరారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ను మర్యాదపూర్వకంగా కలిసి విన్నవించారు. లక్ష్మీనరసింహస్వామి ఆలయ కమిటీలో ఆర్యవైశ్యులకు సేవ చేసే అవకాశం కల్పించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే ఆర్యవైశ్య భవన ఏర్పాటుకు కృషి చేస్తానని, వచ్చే సంవత్సరం లక్ష్మీనరసింహస్వామి ఆలయ కమిటీ ఆర్య ఆర్యవైశ్యులకు స్థానం కల్పిస్తానని హామీ ఇచ్చారు. దీంతో ఆర్యవైశ్య సంఘం తరపున ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి తణుకు రాజయ్య, యువజన సంఘం అధ్యక్షులు జూలూరు గోవర్ధన్, ఆర్యవైశ్య సంఘం కోశాధికారి ఆకుల శ్రీనివాస్, యువజన సంఘం కోశాధికారి చిన్నాల సంపత్‌కుమాం, యువజన సంఘం సంయుక్త కార్యదర్శి శ్రీరామ్ నరేష్, కోటంచ గ్రామ కమిటీ అధ్యక్షుడు గోరంట్ల వీరన్న, ప్రధాన కార్యదర్శి చకిలం రాజేష్ కోశాధికారి గోరంట్ల శ్రవణ్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ గ్రంథపాలకుడిగా తుడుం చంద్రమౌళి

తెలంగాణ-భూపాలపల్లి టౌన్



జాతీయ గ్రంథ పాలకుల దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రంథాలయ శాస్త్ర పితామహుడు పద్మశ్రీ డాక్టర్ ఎస్సార్ రంగానాథన్ జయంతి సందర్భంగా సోమవారం తెలంగాణ స్టేట్ సెంట్రల్ లైబ్రరీ హైదరాబాద్‌లో గ్రంథా పాలకుల (లైబ్రేరియన్స్‌డే) దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాల నుంచి అత్యుత్తమగా విధులు నిర్వహిస్తున్న గ్రంథా పాలకులను ఎంపిక చేసి ఉత్తమ గ్రంథపాలకులుగా అవార్డు అందజేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా నుండి జిల్లా గ్రంధాలయ సంస్థ గ్రంథ పాలకులు తుడుం చంద్రమౌళి గ్రంథాలయ సంస్థకు చేసిన సేవలను గుర్తించి ఉత్తమ అవార్డు అందజేశారు. రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ రియాజ్ ఉత్తమ గ్రంథపాలక (బెస్ట్ లైబ్రేరియన్ అవార్డు) పురస్కారం ప్రశంస పత్రం, మెమొంటో అందజేసి అభినందించినారు,



మూడు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

నవతెలంగాణ-గణపురం

మండలంలోని గాంధీనగర్ జంక్షన్‌లో ఆదివారం అర్ధరాత్రి మూడు ఇసుక ట్రాక్టర్లను చిట్యాల సీఐ మల్లేష్, ఎస్ఐ అశోక్ పట్టుకున్నట్లు సమాచారం. వివరాల్లోకి వెళ్తే.... టేకుమట్ల మండలానికి చెందిన మూడు ఇసుక ట్రాక్టర్లు. అక్రమంగా కాల్వపల్లి నుండి ఇసుకను గణపురం తరలిసున్నారు. పక్కా సమాచారంతో పోలీసులు ట్రాక్టర్లను వెంబడించి పట్టుకొని గణపురం పోలీస్ స్టేషన్‌కు తరలించినట్టు తెలిసింది.

అనుమానాస్పదంగా వివాహిత ఆత్మ'హత్య' ?

నవతెలంగాణ-గణపురం

మండలంలోని అప్పయ్యపల్లి గ్రామానికి చెందిన నోముల వెన్నెల(22) అనుమానాస్పద స్థితిలో సోమవారం సాయంత్రం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి బంధువుల కథనం ప్రకారం .. అప్పయ్య పల్లి గ్రామానికి చెందిన నోముల రాకేష్, ధర్మరావుపేట గ్రామానికి చెందిన వెన్నెలను 2022లో ప్రేమ వివాహం చేసుకున్నాడు. రాకేష్ డీసీఎం వ్యాన్ డ్రైవర్ గా పనిచేస్తున్నాడు వీరికి సంవత్సరంన్నర బాబు ఉన్నాడు. రాకేష్‌కు వెన్నెలకు తరచూ గొడవ జరి గేదని వెన్నెలను మానసికంగా వేధించేవాడని రాకేష్ వెన్నెలను చంపి ఉరివే శాడని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. కాగా వెన్నెల ఏడు పేజీల సూసైడ్ నోట్ రాసింది. సంఘటన స్థలాన్ని భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు పరిశీలిం చారు

స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లపై జీఎం సమీక్ష



నవతెలంగాణ -కోల్ బెల్ట్

ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని జీఎం కార్యాలయంలో సోమవారం సింగరేణి భూపాలపల్లి ఏరియా జనరల్ మేనేజర్ సయ్యద్ హబీబ్ హుస్సేన్ ఏరియాలోని వివిధ గనుల, డిపార్ట్మెంట్ల అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులతో ఎక్కువమంది విద్యార్థులను మార్చి ఫాస్ట్‌లో, సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనేలా చొరవ తీసుకోవాలని సూచించారు.

పెండింగ్ బిల్లుల సమస్య పరిష్కరించాలని ఎంపీడీఓకు వినతి

నవతెలంగాణ-రేగొండ



రేగొండ మండల పరిధిలోని వివిధ గ్రామాల సర్పంచులకు రావాల్సిన పెండింగ్ బిల్లులు పరిష్కరించాలని సోమవారం ఎంపీడీవో వెంకటేశ్వరరావు, ఎంపీఓ రాంప్రసాద్‌కు పలువురు మాజీ సరపంచులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత సర్పంచులుగా ఉన్నప్పుడు అప్పులు చేసి అనేక అభివృద్ధి పనులు, కార్యక్రమాలు చేపట్టామని, సంబంధిత బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. రెండు సంవత్సరాలుగా బిల్లులు రాలేదని, ప్రతి సర్పంచ్‌కు సుమారు రూ.5నుంచి రూ.20లక్షల వరకు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ప్రతి గ్రామంలో ఎన్నో అభివృద్ధి పనులు చేశామని, నేటికీ బిల్లులు రాక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. ఎంతో కష్టపడి గ్రామాలను అభివద్ధి పథంలోకి తీసుకెళ్లిన సర్పంచులకు బిల్లుల చెల్లింపులో జాప్యం చేస్తూ కష్ట పెట్టొద్దని కోరారు. గత ప్రభుత్వంలో కరెంట్ బిల్లులు , బ్లీచింగ్ పౌడర్, బిల్లులు చెల్లించామని గ్రామాల అభివృద్ధి పనులు చేసిన గత సర్పంచులు అప్పుల పాలై రోడ్డు మీద పడే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచ్‌లకు పెండింగ్ బిల్లులు చెల్లించాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు ఏడునుతుల నిశిధర్ రెడ్డి, బండారి దేవేందర్,7 అంబాల చందు గౌడ్, దేవునూరి శ్రీనివాస్, బిక్య నాయక్, లింగంపల్లి ప్రసాద్ రావు, సంతోష్, తిరుపతి, పబ్బ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
4
జనగామ
మంగళవారం ఆగస్టు 13, 2024 www.navatelangana.com

ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

● జనగామ కలెక్టర్ రిజ్వాన్‌బాషా షేక్



నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

గ్రీవెన్స్ లో స్వీకరించిన దరఖాస్తులను తప్పనిసరిగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ తో కలిసి ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పలు సమస్యలపై (84) దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ తెలిపారు. పాలకుర్తి మండలం చెన్నూరు గ్రామానికి చెందిన కే వెంకటేశ్వర్లు తన దరఖాస్తు అందిస్తూ పాలకుర్తి కోఆపరేటివ్ సొసైటీలో రుణం తీసుకున్నానని మాఫీ చేయించాలని విజ్ఞప్తి అందించారు. జాఫర్గడ్ మండలం తిమ్మంపేట గ్రామానికి చెందిన గర్వాంధుల అర్జున్ తన దరఖాస్తు అందిస్తూ నా పట్టా భూమి చెరువు నీటితో మునిగి పోవడం వలన వేరే భూమి కేటాయించాలన్నారు. ప్రజల నుంచి స్వీకరించిన పలు ఫిర్యాదుల పై తహసిల్దార్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షిస్తూ దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తూ దరఖాస్తుతో పాటు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలతో గ్రీవెన్స్ కు రావాలన్నారు.

దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెంచాలని దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, ఆర్డీఓలు కొమురయ్య, వెంకన్న, వివిధ శాఖల సంబంధిత జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురి అరెస్టు

● జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్



నవతెలంగాణ-జనగామ

తాళాలు పగలగొట్టి అక్రమంగా ఇండ్లలో చొరబడి దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురిని జనగామ పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం జనగాం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దొంగతనాలకు సంబంధించిన వివరాలను డీసీపీ రాజమహేంద్రనాయక్ వివరించారు. దొంగతనాలకు పాల్పడిన హైదరాబాద్ సైదాబాద్ ఏరియా సింగరేణి కాలనీకి చెందిన చుకుటల కుమార్, బూరుగు యాదగిరి, తలతోటి ప్రవీణ్‌లను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. వీరి వద్ద నుండి 7.3 తులాల బంగారం ఆభరణాలు, 64 తులాల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. దొంగతనానికి పాల్పడి సోమవారం జిల్లా కేంద్రంలో అమ్ముకునేందుకు వచ్చిన వీరిని అనుమానాస్పదంగా గుర్తించి పట్టుకొని విచారించగా ఈ విషయం తెలిసినట్లు జనగామ డిసిపి వెల్లడించారు. ఈ ముగ్గురి ఒకే ప్రాంతంలో ఉంటూ డబ్బులు, తాగుడుకు అలవాటుపడి జనగామ పట్టణంలోని పట్టాల సమీపంలో ఉన్న ఇండ్లలో దొంగతనాలకు పాల్పడ్డారని తెలిపారు. వీరి పైన గతంలో సైదాబాద్ మల్కపేట ఎల్బీనగర్, యూసుఫ్‌నగర్, నాచారం పోలీస్ స్టేషన్లలో దొంగతనాల కేసులు ఉన్నట్లు తెలిపారు. జిల్లాలో అన్న అనుమానాస్పద స్థితిలో కనబడే వ్యక్తుల అప్రమత్తంగా ఉంటూ సమాచారాలను ప్రజలు వెంటనే పోలీసులకు అందజేయాలని డిసిపి కోరారు.

జిల్లాలో దొంగతనాలను నివారించేందుకు పోలీసులు ఎప్పటికప్పుడు గట్టిగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. చాకచక్యంగా వ్యవహరించి ఈ దొంగలను పట్టుకున్న ఏసిపి పార్థసారథి, దామోదర్ రెడ్డి, ఎస్సై భరత్ ఏఎస్ఐ శంకర్, కానిస్టేబుల్ రామన్న, అనిల్ కుమార్, సురేష్‌లను వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్‌కిషోర్‌ఝా అభినందించినట్లు డిసిపి వెల్లడించారు.

సాయుధ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయండి

నవతెలంగాణ-స్టేషన్‌ఘన్‌పూర్

వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలని జయప్రదం చేయాలని ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి కట్ట నరసింహ పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని ఇప్పగూడెంలో ప్రజానాట్యమండలి వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట శౌర్యయాత్ర కరపత్రాన్ని ఆవిష్కరించారు. సెప్టెంబర్ 1 నుండి 17 వరకు ప్రజానాట్యమండలి రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా శౌరయాత్ర రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలో కళాకారులతో ప్రదర్శనలు ఉంటాయన్నారు. వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వాస్తవ చరిత్రను ప్రజలకు తెలుపాలన్న ఉద్దేశంతో ప్రజానాట్యమండలి కళాకారులతో వీర తెలంగాణ నాటిక ప్రదర్శన ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి పూర్వ రాష్ట్ర కార్యదర్శి రాంపల్లి రమేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సాంబరాజు యాదగిరి, మాజీ రాష్ట్ర సహాయ కార్యదర్శి మునిగెల రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు తోడెంగల ఐలయ్య, రైతు సంఘం నాయకులు గట్ల మల్లారెడ్డి, ప్రనామ. నాయకులు కత్తుల రాజు, యం కర్ణాకర్, పొలాసు పరమేష్, గ్రామ కార్యదర్శి లింగనబోయిన శ్రీకాంత్,డివైఎఫ్ఐ గ్రామ కార్యదర్శి, నీరటి సంపత్, తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-కొడకండ్ల

ఎన్నికల ముందు గీత కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే పరిష్కరించాలని గీత కార్మిక సంఘం జనగామ జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్నే వెంకట మల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కమిటీ సభ్యుడు దేశ గాని శ్రీశైలం అధ్యక్షతన ఏర్పాటు చేసిన ముఖ్య సమావేశానికి ఆయన హాజరై మాట్లాడుతూ అర్హులైన ప్రతి గీత కార్మికునికి 4000 పెన్షన్ మంజూరు చేయాలని గీత కార్మికులకు సబ్సిడీ మీద మోటార్ సైకిల్ ఇవ్వాలని ప్రమాదం జరిగిన వెంటనే ఎక్స్‌గ్రేషియా అందేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన గీత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

నవతెలంగాణ-స్టేషన్‌ఘన్‌పూర్

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మతి చెందిన ఘటన సోమవారం మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. జాతీయ రహదారి పై ఉదయం 5 గంటల సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు సీఐ గాండ్ల రాజు తెలిపారు. మృతి చెందిన వ్యక్తి వయస్సు 45-50 ఏళ్ల మహిళగా ఉంటుందని తెలిపారు. ఎరుపు రంగు చీర, ఎరుపు రంగులో ఉందని చెప్పారు. మృతి చెందిన మహిళను ఎంజీఎం ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. ఎవరికైనా వివరాలు తెలిస్తే 8712 685208, 8712685261, 8712685037 ఈ నెంబర్‌కు సమాచారం అందించాలని సీఐ తెలిపారు.

జర్నలిస్టులకు ఇళ్లస్థలాల కేటాయించాలని వినతి



నవతెలంగాణ-బచ్చన్నపేట

గత 30 ఏళ్లుగా మండలంలో వివిధ పత్రికలలో జర్నలిస్టులో పని చేస్తున్నా ఇంతవరకు ఇండ్ల స్థలాలు తీసుకోలేదని కాంగ్రెస్ ప్రభుత్వం అయినా తమకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని బచ్చన్నపేట ప్రెస్ క్లబ్ అధ్యక్షులు తేలుకంటి మురళి, గౌరవ అధ్యక్షులు మూసిని వీరగౌడ్ ఆధ్వర్యంలో కిసాన్ సెల్ జాతీయ ఉపాధ్యక్షులు ధరణి కమిటీ చైర్మన్ కోదండ రెడ్డికి వినతి పత్రం అందించారు. మండలంలోని బండనాగారం గ్రామానికి వచ్చిన ఆయన రైతుల సమస్యలపై మాట్లాడారు. అనంతరం వారి నుండి పలు వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతుందన్నారు. తెలంగాణలో భూ సమస్యలు ఉండకూడదని లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తుందని గుర్తు చేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల ఇండ్ల స్థలాల విషయమై ఐఎంపిఆర్ కమిషనర్ హనుమంతరావు త ఫోన్లో మాట్లాడి వీరికి కేటాయించిన స్థలాలను వెంటనే కేటాయించాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు తేలుకొండి మురళి, గౌరవ అధ్యక్షులు వీరగౌడ్, ప్రధాన కార్యదర్శి మేకల శ్రీనివాస్ రెడ్డి, సభ్యులు బిక్షపతి, సందెల బాల సిద్దులు, హరికుమార్ ,కోనేటి స్వామి, కర్ణాకర్ ,బాల నరసయ్య, తిరుమల్‌రెడ్డి, మల్లేశం, శ్రీనివాస్, భాస్కర్ తదితరులు ఉన్నారు.

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం : ఎంపీడీవో



నవతెలంగాణ-పాలకుర్తి

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదపడతాయని ఎంపీడీవో రాములు అన్నారు. ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్ ఆదేశాల మేరకు సోమవారం మండల స్థాయిలో ప్రభుత్వ ఉద్యోగులకు నిర్వహించిన క్రీడల్లో భాగంగా క్రికెట్ క్రీడాకారులను విద్యాశాఖ నోడల్ అధికారి పోతుగంటి నర్సయ్యతో కలిసి పరిచయ కార్యక్రమం అనంతరం ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులతో జరిగిన క్రికెట్ పోటీలను ఎంపీడీవో రాములు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగస్తుల్లో దాగివున్న ప్రతిభను వెలికి తీసేందుకు ఆగస్టు 15 సందర్భంగా క్రీడలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈనెల 14న జిల్లా కేంద్రంలో జరిగే జిల్లాస్థాయి పోటీలో పాలకుర్తి మండలంలోని క్రీడాకారులు ప్రతిభను కనబరచాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయం సూపరిండెంట్ రవీందర్, పీఈటీలు శ్రీనివాస్, సోమల్లు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయులు మహేష్, శ్రీకాంత్, వెంకటేష్, క్రాంతి, మహేష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్‌లలో రుణమాఫీ సమస్యలు పరిష్కరించాలి

● జిల్లా కలెక్టర్ రిజ్వాన్‌బాషా షేక్



నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో రైతులు తీసుకున్న రుణమాఫీ సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్‌బాషా షేక్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సహకార సంఘాల్లో రైతుల రుణమాఫీ సమస్యలపై జిల్లా సహకార శాఖ ఆధ్వర్యంలో సంబంధిత శాఖ అధికారులతో అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌తో కలిసి కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీఏసీఎస్‌లలో దరఖాస్తులు ఆధార్ సాంకేతిక సమస్యలతో ఉన్న దరఖాస్తులను పరిష్కరించాలన్నారు. రుణమాఫీలో మొదటి, రెండో విడతల్లో రుణమాఫీ రాని వివరాలను సంబంధించిన నివేదిక ఇవ్వాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా పీఏసీఎస్‌లలో రైతుల రుణమాఫీ సమస్యలను జిల్లా సహకార అధికారి దృష్టికి తేవాలని సహకార సంఘాల సెక్రెటరీలను కోరారు. ఈ సమావేశంలో జిల్లా సహకార శాఖ అధికారి రాజేందర్‌రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి వినోద్‌కుమార్, సహకార సంఘాల సెక్రెటరీలు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో ఏ విద్యార్థి అసౌకర్యానికి గురికావద్దు

● ఎస్టీ బాలుర గురుకుల పాఠశాలను సందర్శించిన కొమ్మూరి



నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

జనగామ నియోజకవర్గంలోని ఏ పేద విద్యార్థి అసౌకర్యానికి గురికావద్దని, ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భవిష్యత్తులో తాను చూసుకుంటానని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఎస్టీ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, 5 ఎకరాల స్థలాన్ని, హాస్టల్ భవన నిర్మాణం ఏర్పాటు కోసం కృషి చేస్తానని మాజీ శాసనసభ్యులు, డిసిసి అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం జనగామ మండలం పసరమడ్ల గ్రామ పరిధిలోని ఎస్టీ బాలుర రెసిడెన్షియల్ పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కొమ్మూరి మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని ప్రిన్సిపాల్‌ను కోరారు. వారికి కావలసిన వసతులను తన దృష్టికి తీసుకు వస్తే సంబంధిత అధికారులతో చర్చించి వెంటనే సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

గత పాలకులు మద్యం, మామూళ్ల వసూళ్లపైనే పెట్టిన దృష్టి పేద విద్యార్థులపై పెట్టలేదని ఆరోపించారు. వారి వైఫల్యాల వల్లనే ఈనాడు ఇలాంటి పరిస్థితులను విద్యార్థులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. విద్యార్థులకు కావలసిన వసతులు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. ఎంపీ నిధుల కేటాయింపు ద్వారా మరిన్ని వసతులు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. గతంలో శాసనసభ్యులుగా ఉన్న సమయంలో నర్మెట్టలో ఎస్టీ విద్యార్థుల కోసం పాఠశాల భవన నిర్మాణం కోసం భూమిని దానంగా ఇచ్చిన సంగతి ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. అక్కడ నిర్మించిన విధంగా జనగామలో కూడా పాఠశాలను అన్ని వసతులు ఉండేలా నిర్మించాలని ఈ సందర్భంగా విద్యార్థులు కొమ్మూరిని కోరారు. గత ప్రభుత్వం విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించిందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యా వ్యవస్థను గాడిన పెట్టేందుకు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు నర్సిరెడ్డి, పిఎసిహెచ్ చైర్మన్ మహేందర్ రెడ్డి, జిల్లాయూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బనుక శివరాజ్ యాదవ్, పట్టణ అధ్యక్షులు బుచ్చిరెడ్డి, ఎంపీటీసీ మెరుగు బాలరాజుగౌడ్, నామాల శీనుగౌడ్, మాజీ సర్పంచ్ సిద్దులు, కరుణాకర్‌రెడ్డి, కృష్ణగౌడ్, మారబోయిన ప్రకాష్, ప్రవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

దొంగతనాలను అరికట్టాలని డీసీపీకి సీపీఐ(ఎం) వినతి



నవతెలంగాణ-జనగామ

జిల్లాలోని జఫర్‌గడ్ మండలం తమ్మడపల్లి (జి)లో జరుగుతున్న వరుస దొంగతనాలను అరికట్టాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాపర్తి రాజులు కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని డీసీపీ కార్యాలయంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డిసిపి రాజమహేంద్ర నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. జఫర్‌గడ్ మండలం తమ్మడపల్లి (జీ)లో 8 మాసాల నుండి వరుసగా జరుగుతున్న దొంగతనాలు, వ్యవసాయ బోరు మోటర్లను ధ్వంసం చేయడం, పత్తి బస్తాలు ఎత్తుకెళ్లడం , గొర్రెలు, మేకలు ఎత్తుకపోవడం లాంటి సంఘటనలు ఇటీవల అనేకం జరుగుతున్నాయని గ్రామస్తులు డీసీపీకి వారు వివరించారు.

ఈ విషయంపై స్పందించిన డీసీపీ మాట్లాడుతూ నా దృష్టికి వచ్చినటువంటి ఈ సమస్యలను విచారణ జరిపిస్తానని ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కనకా రెడ్డి, రాపర్తి రాజులు మాట్లాడుతూ 8 మాసాల నుండి తమ్మడపల్లి (జి) గ్రామంలోగుర్తు తెలియని వ్యక్తులు దురుద్దేశంతో చేస్తున్నటువంటి చర్యల ఫలితంగా రైతులు వ్యవసాయం చేయడానికి ఆందోళనలు చెందుతున్నారని పేర్కొన్నారు. బాధిత రైతులు పెద్దమొత్తంలో ఆర్థికంగా నష్టపోయారు అన్నారు. చిల్లర దొంగతనాలు చేస్తూ రైతులకు నష్టం చేసి దుశ్చర్యలకు పాల్పడుతున్న వ్యక్తులను పోలీసులు గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి సోమయ్య, ఇర్రి అహల్య, బాధిత రైతులు గుండెబోయిన రాజు, ముక్కెర గంగరాజు, అన్నేపు సోమయ్య, వేల్పుల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయిపాపన్న పేరు పెట్టాలి

● కేజీకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బాల్నే వెంకట మల్లయ్య



నవతెలంగాణ-స్టేషన్ ఘనపూర్

జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న పేరు పెట్టాలని, కల్లుగీతా కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని కల్లు గీతా కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బాల్నే వెంకటమల్లయ్య డిమాండ్ చేశారు. ఆగస్టు 2 నుండి 18 వరకు అమరుల యాదిలో గీతన్నల చైతన్య యాత్రలో భాగంగా సోమవారం రఘునాథ పల్లి మండలకేంద్రంలో కల్లుగీత కార్మిక సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శి బుర్ర లక్ష్మీనారాయణ, కుర్ర రాజు అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షులు కుర్ర ఉప్పలయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్నే వెంకట మల్లయ్య పాల్గొని మాట్లాడారు. కల్లుగీత కార్మికుల హక్కుల కొరకు పోరాడి అమరులైన సంఘం నాయకులను యాది చేసుకుంటూ, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఆగస్టు 2 న బొలగాని పుల్లయ్య 36 వ వర్ధంతి నుంచి 18న సర్దార్ సర్వాయి పాపన్న 374 వ జయంతి వరకు అమరుల యాదిలో గీతన్నల చైతన్య యాత్ర ప్రతీ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వం భూమి కొనుగోలు పథకంలో 439 సొసైటీలకు 5 ఎకరాల చొప్పున భూములు ఇచ్చారని, జీఓ 560 ప్రకారం ప్రభుత్వ స్థలం ఉన్నచోట కొన్ని సొసైటీలకు పట్టాలిచ్చారని గుర్తుచేశారు. కాగా స్థలాలన్నిటిని, ఆధీనంలోకి తీసుకొని చెట్ల పెంపకం చేపట్టాలన్నారు. గ్రామాల్లో స్థలాలున్న చోట 5 ఎకరాల చొప్పున సొసైటీకి భూములు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

రియల్ ఎస్టేట్ పేరిట తాటి, ఈత చెట్లను ధ్వంసం చేస్తున్నారని ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని అన్నారు. 5లక్షల కల్లుగీత కార్మికుల కుటుంబాలకు ఉపాధి కల్పించే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు వడ్లకొండ వెంకటేష్, గైని శ్రీనివాస్, బాల్నే రాజయ్య, మండల నాయకులు మల్కాపురం శ్రీకాంత్, రాజు, కుర్ర పర్శరాములు, రవి, ఇల్లందుల బిక్షపతి, దొమ్మాట యాకయ్య, క్రిష్ణ, గొట్టుపర్తి మల్లేష్, పెద్దగోని మల్లికార్జున్, రంగు నర్సయ్య, మొగలగాని భాస్కర్, తాళ్లపల్లి భాస్కర్, ఆంజనేయులు, బాల్నే గట్టుమల్లయ్య, కుర్ర సత్తయ్య, రాగుల కొమురయ్య, గోపగోని నారాయణ, వెంకటేశ్వర్లు, కుర్ర సత్తయ్య, చెరుకు వెంకటస్వామి, క్రిష్ణమూర్తి, రంగు భాస్కర్, బత్తిని నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

'గురుకులం'లో మైనర్ బాలికపై క్యాటరింగ్ వర్కర్ లైంగిక వేధింపులు

పాలకుర్తి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు

నవతెలంగాణ-పాలకుర్తి

మైనర్ బాలిక పట్ల గురుకుల పాఠశాలలో క్యాటరింగ్ వర్కర్ గా పనిచేస్తున్న ఓ వ్యక్తి లైంగిక వేధింపులకు పాల్పడిన సంఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండల కేంద్రంలో గల గురుకుల పాఠశాలలో చదువుకుంటున్న మైనర్ బాలికపై క్యాటరింగ్ వర్కర్ నిత్యం లైంగికంగా వేధించడంతో ఆ మైనర్ బాలిక సెలవులకు ఇంటికి వెళ్లి తిరిగి పాఠశాలకు రాకపోవడంతో విషయం బయటకు వచ్చింది. పాఠశాలకు ఎందుకు వెళ్లడం లేదని బాలిక తల్లిదండ్రులు ప్రశ్నించగా గురుకుల పాఠశాలలో క్యాటరింగ్ వర్కర్ గా పనిచేస్తున్న వ్యక్తి లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడని మైనర్ బాలిక తల్లిదండ్రులకు వివరించింది.

విషయం తెలుసుకున్న మైనర్ బాలిక తల్లిదండ్రులు గురుకుల పాఠశాలకు వచ్చి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌తో పాటు క్లాస్ టీచర్ ను ప్రశ్నించగా నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారని తమకి ఏమి తెలియదు అంటూ దాటవేశారని మైనర్ బాలిక తల్లిదండ్రులు తెలిపారు. దీంతో వేధింపులకు పాల్పడిన క్యాటరింగ్ వర్కర్ పై పాలకుర్తి పోలీస్ స్టేషన్ లో మైనర్ బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు.

ఈ విషయంపై పోలీసులను వివరణ కోరగా మైనర్ బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

రాష్ట్రంలో భూ సమస్యలు ఉండకూడదు

● కాంగ్రెస్ కిసాన్‌సెల్ జాతీయ ఉపాధ్యక్షులు కోదండరెడ్డి



నవతెలంగాణ-బచ్చన్నపేట

రాష్ట్రంలో భూ సమస్యలు ఉండకూడదని సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక ధరణి కమిటీని నియమించారని కాంగ్రెస్ కిసాన్ సెల్ జాతీయ ఉపాధ్యక్షులు, ధరణి కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే కోదండ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని బండనాగారం గ్రామానికి చెందిన రైతుల భూసమస్యలు సిద్దిపేట జిల్లా మద్దూరు మండలంలోని మర్మాముల శివారులో ఉండడంతో ఆ సమస్యలను తెలుసుకోవడానికి గ్రామానికి వచ్చారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ బండనాగారం, బంజేరు గ్రామాల రైతులు దాదాపు 30 మందికి 45ఎకరాల మేర భూమికి పట్టేదారు పాసుపుస్తకాలు అందలేదన్నారు. ఈ గ్రామంలో ఓ వ్యక్తి ఆ భూమిని మొత్తం పట్టా చేసుకొని ఈ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నాడన్నారు. భూమి పట్టాలేక ఆ రైతులకు రైతు భరోసా, రైతుబీమా వర్తించడం లేదని బ్యాంకులలో పంటల రుణాలను తీసుకోవడానికి కూడా ఈ రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. త్వరలోనే ఆర్ఆర్-2024 చట్టలను తీసుకురాబోతున్నామని అప్పుడు ఈ రైతులు దరఖాస్తు చేసుకొని పట్టాలను పొందవచ్చునని అన్నారు. ఈ విషయాన్ని రెవెన్యూ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో మాట్లాడి అవసరమైతే సీఎం దష్టికి కూడా తీసుకుపోతానని అన్నారు.

ఈ ప్రాంత రైతులకు ఏ భూ సమస్యలు ఉన్నా సంప్రదించాలని అవసరమైతే ధరణిలో మార్పులు చేర్పులు చేయడానికి సలహాలను కూడా ఇవ్వాలని తెలిపారు. వీరి వెంట కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు పిన్నింటి నారాయణరెడ్డి, రైతులు జంగిలి యాదగిరి, అంజనేయులు, సాయిబాబా, స్వామి, తిరుపతి, ఉప్పలయ్య తదితర రైతులు ఉన్నారు.

అసెంబ్లీలో మీ గొంతుకనై వినిపిస్తున్న

● ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



నవతెలంగాణ-బచ్చన్నపేట

అసెంబ్లీలో మీ గొంతుకనై తన గలాన్ని వినిపిస్తున్నానని అలాగే నియోజకవర్గ ప్రజలకు 24 గంటలు వైద్య సేవలు నీలిమ హాస్పిటల్‌లో అందుబాటులో ఉంటాయని నియోజకవర్గ ప్రజలు ఎప్పుడైనా వెళ్లి ఆధార్ కార్డు చూపిస్తే చాలు కార్పొరేట్ వైద్యం అందిస్తారని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని శ్రీనిధి ఫంక్షన్‌హాల్‌ల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన గొంతు లేవడం వల్లనే ఇక్కడికి సాగునీరు విడుదలవుతుందని అన్నారు.

మీ వంతుగా నేను అసెంబ్లీలో గట్టిగా అడుగుతున్నానని రాబోయే రోజుల్లో ఈ నియోజకవర్గానికి రావలసిన నిధులతో పాటు తాను స్వయంగా ముఖ్యమంత్రితో మాట్లాడి ఎక్కువ నిధులను తెచ్చి నియోజకవర్గాన్ని అభివద్ధి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా రైతు సమితి అధ్యక్షులు ఇరి రమణారెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ పులిగిల్ల పూర్ణచందర్, వైస్ చైర్మన్ మద్దికుంట రాదా, మండల పార్టీ అధ్యక్షులు బొడిగం చంద్రారెడ్డి, వివిధ గ్రామాల మాజీ సర్పంచులు ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలను ప్రారంభించిన కలెక్టర్



నవతెలంగాణ-జనగామ

స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా స్థానిక ధర్మకంచ లోని మినీ స్టేడియంలో ప్రభుత్వ ఉద్యోగస్తులకు ఏర్పాటు చేసిన క్రీడలను అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ తో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సోమవారం ప్రారంభించారు. జిల్లా స్థాయి అధికారులకు సిబ్బందికి జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టగ్ ఆఫ్ వార్, లెమన్ అండ్ స్పూన్ క్రీడలను పరిశీలించారు. అనంతరం స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు చేస్తున్న ఏర్పాటులను కలెక్టర్ పరిశీలిస్తూ పటిష్టంగా చేపట్టాలన్నారు. పారిశుద్ధ్యం మెరుగుపరుస్తూ పనులు వేగవంతం చేయాలన్నారు. కలెక్టర్ వెంట డిసిపి రాజమహేంద్ర నాయక్, ఏసిపి పార్థసారథి, ఆర్డీవో కొమురయ్య, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా బస్‌పాసులు పంపిణీ



నవతెలంగాణ-బచ్చన్నపేట

మండలం లోని నిరుపేద బాలలకు సుమారుగా 200 మందికి స్వంత డబ్బులతో ఫ్రీ బస్ పాస్‌లు చేపిచ్చిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు జంగిటి విద్యానాథ్. సోమవారం మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద ఆయన మండలంలో చదువుకున్న విద్యార్థులు నిరుపేదలఇన వారిని గుర్తించి తన సొంత డబ్బులతో బస్సు పాసులు ఇప్పించి విద్యార్థుల అభ్యున్నతికి కషి చేయడంతో మండల ప్రజలు ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడుబాల్రెడ్డి, బాలకిషన్ గౌడ్,అలవాల ఎల్లయ్య, ఎద్దు హరీష్ తదితరులు ఉన్నారు.

జెడ్పీ పాఠశాలలో బోరు మోటర్ ఏర్పాటు



నవతెలంగాణ-బచ్చన్నపేట

బచ్చన్నపేట ప్రాథమిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కనీస అవసరాలకు నీటి కొరతతో ఇబ్బందులు పడుతున్న వేల ఇది పాఠశాలలు విద్యను బోధిస్తున్న ఆంగ్ల ఉపాధ్యాయుడు భాస్కరుని పృథ్వీరాజ్ ప్రత్యేక చొరవతో తన స్నేహితుడైన ఎన్నారై పులిగిల్ల శ్రీనివాస్ తో చరవాణిలో ఇక్కడి విద్యార్థులు ఎదుర్కొంటున్న బాధను చెప్పడంతో వెంటనే స్పందించిన శ్రీనివాస్ రూ.50వేలు అందించారు. దీనితో పాఠశాలలోని బోరులో బోరు మోటర్ వేయించారు. ఉపాధ్యాయులు హెచ్ఎం వెంకటరెడ్డి, ఆంగ్ల ఉపాధ్యాయుని ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పృథ్వీరాజ్ మాట్లాడుతూ పాఠశాలలోని విద్యార్థిని విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యను తనను కలచి వేసిందని వెంటనే తన మిత్రునికి ఫోనులో చెప్పగానే తన వంతు సహాయం అందించినందుకు శ్రీనివాస్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

నవతెలంగాణ-స్టేషన్‌ఘన్‌పూర్

డివిజన్ కేంద్రంలో ఏఐఎస్ఎఫ్ 89వ ఆవిర్భావ దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా కన్వీనర్ మొహమ్మద్ యూనుస్ హాజరు కాగా ఏఐఎస్ఎఫ్ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశానికి సంపూర్ణ స్వతంత్రం లక్ష్యంగా విద్యార్థులను చైతన్యం చేసిన విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని పేర్కొన్నారు. స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో విద్యార్థులను ఏకం చేసి జాతీయస్థాయిలో ఏర్పడిన తొలి విద్యార్థి సంఘంగా ఏఐఎస్ఎఫ్ నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ నాయకులు మొహమ్మద్ రహమతుల్లా, చింత జగదీష్, పృథ్వీరాజ్, రాము, అక్షయ, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మహబూబాబాద్
మంగళవారం ఆగస్టు 13, 2024
www.navatelangana.com

సంక్షిప్త వార్తలు...

ఏసీబీ కేసులో డీటీఓ, మరో ఇద్దరు అరెస్ట్



నవతెలంగాణ-మహబూబాబాద్

ఏసీబీ కేసులో మహబూబాబాద్ ఎంవీఐ, డీటీఓ ఎండీ గౌస్ పాషాతో పాటు ఆయన డ్రైవర్ ఎలమందల సుబ్బారావు, తణుకు రాంగోపాల్‌ను సోమవారం అరెస్ట్ చేసి వరంగల్ ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. గత మే 28న ఏసీబీ అధికారులు మానుకోట డీటీఓ ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయంలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో లెక్క లోకి రాని నగదు పట్టుబడింది. నాటి నుండి నేటి వరకు అధికారులు పూర్తి విచారణ చేసి గౌస్ పాషాతోపాటు మరో ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు.

ప్రజావాణి ధరఖాస్తులు పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



నవతెలంగాణ-మహబూబాబాద్

ప్రజావాణి ధరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్ అన్నారు. సోమవారం ఐడిఓసి లోని ప్రధాన సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టొప్పో, ఎం డేవిడ్‌తో కలిసి ప్రజల నుండి ధరఖాస్తులను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా రెవెన్యూశాఖ నుంచి 60, ఈడీ ఎస్‌సి కార్పొరేషన్ నుంచి 66, జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ శాఖ-23, జిల్లా పంచాయతీ శాఖ-2, జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ-8, ఇతర శాఖలకు సంబంధించిన మొత్తం 188) ధరఖాస్తులు వచ్చాయని, సంబంధిత అధికారులకు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమలశాఖ అధికారి శ్రీనివాస్, డీపీఓ హరిప్రసాద్, సీపీఓ సుబ్బారావు, ఏడీ సర్వేల్యాండ్స్ అధికారి నరసింహమూర్తి, బీసీ డెవలప్ మెంట్ అధికారి నరసింహస్వామి, సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ కష్టవేణి, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్‌కుమార్, ఇతర శాఖల జిల్లా అధికారులు, మండల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో చిత్రలేఖన పోటీలు



నవతెలంగాణ-బయ్యారం

స్వాతంత్ర దినోత్సవాన్ని సందర్భంగా జిల్లా ఎస్పీ ఆదేశానుసారం మండలంలోని అన్ని పాఠశాలలలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నట్లు సీఐ రవికుమార్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఈ చిత్రలేఖన పోటీల్లో షీ టీమ్స్, డ్రగ్స్, ఆల్కహాల్, రోడ్ సేఫ్టీ, సైబర్ క్రైమ్, ఫ్రెండ్లీ పోలీసింగ్ వంటి ఆరు అంశాల పై పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.5000, ద్వితీయ బహుమతి రూ.3000, తృతీయ బహుమతి రూ.2000 చొప్పున జిల్లా ఎస్పీ చేతుల మీదుగా అందజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై తిరుపతి, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తొర్రూరులో గంజాయి కలకలం

ఆదివారం రాత్రి భారీగా తరలించినట్లు ప్రచారం

నవతెలంగాణ-తొర్రూరు

తొర్రూరు పట్టణంలో చాపకింద నీరులా గంజాయి వినియోగం, సరఫరా జరుగుతుందా అంటే అవుననే సమాధానం వినిపిస్తుంది. తొర్రూర్ పట్టణ కేంద్రం లోకి ఆదివారం అర్ధ రాత్రి భారీగా గంజాయి వచ్చినట్లు విశ్వ నీయ సమాచారం. కార్‌లో ముగ్గురు అపరిచిత వ్యక్తులు గంజాయి పట్టుకొని వచ్చి యువతతో భారీ డీల్ కుదుర్చుకున్నట్లు పట్టణంలో జోరుగా చర్చ జరుగుతోంది. రాత్రి 11 గంటల తరువాత కంటాయపాలెం రోడ్డులో యువకులు గుమిగుడి ఉండటంతో ఆ అనుమానలు నిజమేనా అంటూ పుకార్లు షికార్లు చేస్తున్నాయి. తొర్రూరు పట్టణానికి చెందిన ఒక ఆటో డ్రైవర్ బైక్ పై గంజాయి తరలిస్తుండగా గవిచెర్ల క్రాస్ రోడ్డు వద్ద పోలీసు వాహన తనిఖీల్లో పట్టుకున్నారనీ సమాచారం. ఇతని నుండి రెండు కిలోల ఎండు గంజాయిని పట్టుకున్నట్లు పోలీసులు తెలపడంతో తొర్రూరు లో గంజాయి సరఫరా జరిగిందా అన్న అనుమానాలకు బలం చేకూర్చుతుంది. గత కొంత కాలంగా తొర్రూరు ప్రాంతంలో గంజాయి మత్తుకు యువత అలవాటు పడుతున్నట్లు సమాచారం. గతంలో పోలీసులు కొంతమంది యువతకు కౌన్సిలింగ్ కూడా ఇచ్చారు. ఏది ఏమైనా గంజాయికి దూరంగా ఉండాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.

'సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి'



నవతెలంగాణ-గూడూరు

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని గూడూర్ మండల విద్యా వనరుల కేంద్రంలోని పలువురు సీఆర్పీలు డిమాండ్ చేశారు. సోమవారం మండల విద్యా వనరుల కేంద్రంలో ఇటీవల మరణించిన పలువురు సమగ్ర శిక్ష ఉద్యోగులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఉద్యోగ భద్రత లేదని, తక్కువ వేతనాలతోపాటు పని ఒత్తిడి పెరిగి మనోవేదనకు గురవుతున్నామని ఆ వేదన వ్యక్తం చేశారు. పెరిగిన నిత్యవసర ధరలతో కుటుంబ పోషణ భారం అవుతోందన్నారు. ఇటీవల పని ఒత్తిడితో గుండెపోటుతో పలువురు మరణించిన సందర్భాలు ఉన్నాయని అన్నారు. క్రమబద్ధీకరణ చేయాలని, అప్పటి వరకు బేసిక్ పే అమలు చేయాలని కోరారు. ఆరోగ్య భీమా రూ.5లక్షలు, జీవిత బీమా రూ.10 లక్షలు, ఉద్యోగ విరమణ చేసిన వారికి రూ.10లక్షల ప్రయోజనం కల్పించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించకుంటే దశలవారీ నిరసనలు తెలియజేసి సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఆర్పిలు శోభన్ రెడ్డి,రవికుమార్, జితేందర్, బాసింగ్, సరిత, నరేష్, ఎంఐఎస్ సుధాకర్, కంప్యూటర్ ఆపరేటర్ సంపత్, ఐఈఆర్ పి రవి, పవన్ కుమార్, ఉమేష్, పాల్గొన్నారు

సీఎం మెడల్‌కు అంజయ్య ఎంపిక.. జిల్లా ఎస్పీ అభినందనలు



నవతెలంగాణ-మహబూబాబాద్

ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లక్నో లో ఫిబ్రవరి 12 నుండి 16 వరకు జరిగిన 67వ ఇండియా పోలీస్ డ్యూటీ మీట్ యాంటీ సబటేజ్ చెక్‌కు అల్ ఇండియా లెవల్‌లో ఏఎస్‌సీ యాంటీ సబోటేజ్ చెక్ కు విన్నర్ ట్రోపి వచ్చినట్లు ఎస్పి సుధీర్ రామ్నాథ్ కేకన్ తెలిపారు. మహబూబాబాద్ జిల్లా బాంబ్ స్క్వాడ్ విభాగానికి చెందిన కె అంజయ్య పోలీస్ బెస్ట్ కోచ్, సీఎం మెడల్‌కు ఎన్నికైనందుకు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ శ్రీనివాస్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ అనిల్, భాస్కర్, సోములు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

'మంచం' పట్టిన ఎడ్జెర్ల..!



- విజృంభిస్తున్న జ్వరాలు..

నవతెలంగాణ-మరిపెడ

మహబూబాద్ జిల్లా మరిపెడ మండలం ఎడ్జర్ల గ్రామ ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. ఇంటికో జ్వరపీడితుడు మంచానికేఉ పరిమితమైన పరిస్థితి నెలకొంది. సబ్ సెంటర్లు ఉన్నప్పటికీ సరైన వైద్యం అందటం లేదని పలువురు విమర్శిస్తున్నారు. మొక్కుబడిగా హెల్త్ క్యాంపులు పట్టి చేతులు దులుపుకుంటున్నారని బాధితులు వాపోతున్నారు. ఎడ్జెర్ల గ్రామంలో 1341మంది ఓటర్లు ఉండగా, 1868 మంది జనాభా ఉంది. ఎడ్జెర్ల సబ్ సెంటర్ పరిధిలో గుర్రపుతండా, పూసల తండా, మంచ్య తండా, ఎడ్జెర్ల, అవాస ప్రాంతాలు ఉన్నాయి. గత నెల రోజులుగా ప్రజలు జ్వరాలతో అల్లాడుతున్నారు. ఈ నేపథ్యంలోనే తాము జ్వరంతో మంచానికే పరిమితమయ్యామని బాధితులు నామ వెంకటమ్మ, రెంటాల బుచ్చి రాములు, ఉపేంద్ర, గోపి మధుసూదన్, శానం నారాయణ, ఐలమ్మ, బుల్లెదు విజయ, లచ్చమ్మ, గోపి రేణుక, పెరుమాండ్ల వెంకన్న, మరియా మనోవేదన చెందుతున్నారు. ఒక్కో జ్వరపీడితుడు రూ.10 వేల నుంచి రూ.15వేల వరకు జ్వరం నివారణకు ఖర్చు పెడుతున్నామని వాపోతున్నారు. పల్లె దవఖానలో చూపించుకున్నా తక్కువ కాక మహబూబాబాద్, ఖమ్మం, మరిపెడ (బంగ్లా) లో ప్రైవేటు దావఖానాలు ఆశ్రయించి ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పల్లె దావకాన ఉన్నప్పటికీ ఇక్కడ డాక్టర్లు నియమించకపోవడంతో హెల్త్ క్యాంప్ సిబ్బంది కేవలం మందులు సరఫరా చేస్తున్నారని మండిపడుతున్నారు. ప్రభుత్వం వెంటనే సబ్ సెంటర్‌కు డాక్టర్ ను కేటాయించాలని కోరుతున్నారు.

డాక్టర్‌ను నియమించాలి



ఎడ్జర్ల గ్రామంలో నెల రోజుల నుండి జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఇక్కడ డాక్టర్ పోస్టు ఖాళీగా ఉంది. వెంటనే డాక్టర్‌ను నియమించాలి. గ్రామంలో పారిశుధ్యం లోపించి దోమలు వృద్ధి చెంది ప్రజలు జబ్బు బారిన పడుతున్నారు. ఎడ్జెర్లలో మెగా హెల్త్ క్యాంపులు నిర్వహించి రక్త నమూనాలను సేకరించి జబ్బుల నివారణకు చర్యలు తీసుకోవాలి.

- కేవీపీఎస్ జిల్లా కమిటీ సభ్యులు గోపి రమేష్

వైద్యుల సలహాలు, సూచనలు తీసుకోవాలి



మండలంలో వాతావరణ పరిస్థితుల వల్ల వైరల్ ఫీవర్ అధికమవుతోంది. రోగులు సొంత వైద్యంతో ప్రమాదానికి గురయ్యే అవకాశాలు ఉన్నాయి. డాక్టర్ల సూచనల మేరకే మందులు వాడాలి. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిం చాలి. ప్రజలు ఆందోళన చెందకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

-పీహెచ్‌సీ డాక్టర్ గూగులోత్ రవి, మరిపెడ



నెలలో 3సార్లు హెల్త్ క్యాంపులు

వర్షాకాలం సీజన్ ప్రారంభం కాగానే పల్లె దావఖాన సబ్ సెంటర్ పరిధిలో మూడుసార్లు హెల్త్ క్యాంపులు నిర్వహిస్తున్నాం. జూలై 12న 50మందికి, ఆగస్టు 2న 35మందికి, ఆగస్టు 9న 54మందికి వైద్య పరీక్షలు, షుగరు బీపీ, పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. పల్లె దవఖానలో మందుల కొరత లేదని అడిగిన వారికి ఆశా కార్యకర్తలతో ఇంటింటికి వెళ్లి మందులు ఇస్తున్నాం.

-బోడ తులసి,ఏఎన్ఎం

వైద్యం పట్ల నిర్లక్ష్యం వల్లే జ్వరాల విజృంభన

- మందులు, సిబ్బంది కొరత..
- వెంటాడుతున్న పారిశుధ్య సమస్య
- హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి : సీపీఐ (ఎం)



నవతెలంగాణ-మహబూబాబాద్

వైద్యంపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని, ఫలితంగానే జిల్లాలో విషజ్వరాలు లివిజంభిస్తున్నాయని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం కొరివి మండల కేంద్రంలో జంగం ఉప్పలయ్య అధ్యక్షతన నిర్వహించిన పార్టీ మండల కమిటీ సమావేశంలో జిల్లా కార్యదర్శి-వర్గ సభ్యులు ఆకుల రాజుతో కలిసి ఆయన పాల్గొని ప్రసంగించారు. జిల్లాలో వర్షాల కారణంగా ప్రజలు మలేరియా, డెంగ్యూ, వైరల్ ఫీవర్ బారిన పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడంలో విఫలమైందని తెలిపారు. తక్షణం ప్రతి మండల కేంద్రంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా పరిధిలో ఆదివాసీ గ్రామాలు, తండాలు, ఊళ్ళకు ఊళ్ళు జ్వరాల బారిన పడుతున్నాయన్నారు. అనేకమంది ప్రైవేటు వైద్యశాలల్లో చికిత్స పొందుతున్నారని తెలిపారు. దీంతో ప్రజలు వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తుందని తెలిపారు ప్రభుత్వ వైద్యశాలల్లో మందులు, సిబ్బంది కొరత తీవ్రంగా ఉందన్నారు. చాలా హాస్పిటల్స్ లో కాంట్రాక్టు డాక్టర్స్‌ను నియమించడంతో పీజీ, పై చదువుల నిమిత్తం దీర్ఘకాలిక సెలవులు పెట్టడం, ఉద్యోగాలకు రాజీనామా చేయడం తదితర కారణాలతో వైద్యుల కొరత ఏర్పడుతున్నదని అన్నారు. ఈ నేపథ్యంలో శాశ్వత ప్రాతిపదికన డాక్టర్లను నియమించాలని కోరారు. కొన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో కనీసం మంచినీటి సౌకర్యం కూడా లేదన్నారు. అనేక గ్రామాలు, ఆస్పత్రుల్లో పారిశుధ్య సమస్య వెంటాడుతోందన్నారు. అదనపు పారిశుధ్య కార్మికులను నియమించాల్సి ఉందన్నారు. చాలా పంచాయతీలలో వర్కర్లకు మూడు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని చెప్పారు. బ్లీచింగ్ కూడా చేయటం లేదని తెలిపారు. మొన్నటి బడ్జెట్‌లో వైద్యానికి నిధులు తగ్గించిన విషయాన్ని ప్రస్తావించారు. ప్రభుత్వం, ప్రతిపక్షాలు ప్రజా సమస్యలపై దృష్టి సారించడం లేదని ఆరోపించారు.హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించి ఊరూరా వైద్య శిబిరాలు నిర్వహించాలని కోరారు. అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసి మందుల కొరత లేకుండా చూడాలన్నారు. గ్రామపంచాయతీ సిబ్బంది, ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేసే పారిశుధ్య కార్మికులకు మూడు నెలల జీతాలు తక్షణం విడుదల చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి మలేడి కోటయ్య, మండల కమిటీ సభ్యులు కట్ల కష్ణయ్య, నాలం వెంకన్న, పోతుగంటి మల్లయ్య తగరం తిరుపతి, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా విద్యుత్‌శాఖ అధికారి నరేష్



నవతెలంగాణ -మరిపెడ

విద్యుత్ ప్రమాదాల పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మహబూబాబాద్ జిల్లా విద్యుత్‌శాఖ అధికారి నరేష్ అన్నారు. సోమవారం డోర్నకల్ నియోజక వర్గంలోని మరిపెడ, చిన్నగూడూరు, దంతాలపల్లి, నర్సింహుల పేట మండలాలకు చెందిన విద్యుత్‌శాఖ ఓ అండ్ స్టాఫ్‌తో విద్యుత్ ప్రమాదాలు, పొలం బాట, విద్యుత్ అంతరాయం, తదితర కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. మరిపెడ పట్టణం లోని ఓ ఫంక్షన్ హాలులో జరిగిన సమావేశంలో ఎస్‌ఈ నరేష్ పాల్గొని మాట్లాడారు. విద్యుత్ సిబ్బందికి అవగాహన కల్పించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలన్నారు. అనంతరం సిబ్బందికి సేఫ్టీ జాకెట్స్ అందజేశారు. అనంతరం మరిపెడలో పొలం బాట కార్యక్రమంలో రైతులతో కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మరిపెడ మున్సిపల్ వైస్ చైర్మన్ ముదిరెడ్డి బుచ్చిరెడ్డి, తొర్రూర్ డీఈ ఈ మధుసుధన్, మరిపెడ సబ్ డివిజన్ ఎడీఈ లోక్‌నాద్‌రెడ్డి, నెల్లికుదురు ఏడీఈ పాపిరెడ్డి, ఏఈలు, పావని, అజయ్, సబ్ ఇంజినీర్‌లు, సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్ మెన్లు, ఏఎల్ ఎంలు, జెఎల్‌ఎంలు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల పట్ల గత పాలకుల నిర్లక్ష్యం : ఎమ్మెల్యే మురళినాయక్



నవతెలంగాణ- ఇనుగుర్తి

గత పాలకులు రైతుల పట్ల నిర్లక్ష్యం వహించారని ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తలపెట్టిన రైతు పొలం బాట కార్యక్రమాన్ని విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో ప్రారంభించారు. అనంతరం లక్ష్మీపురం గ్రామ పార్టీ అధ్యక్షులు ముద్దిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 15 సంవత్సరాల నుండి లక్ష్మీపురం గ్రామ రైతులు ఇబ్బందులు పడుతున్నారని పార్టీ నాయకులు చెప్పడంతో ఎమ్మెల్యే సొంత నిధులు రూ.5 లక్షల60 వేలతో 100కెవి విద్యుత్ నియంత్రికను రైతుల చేత ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం లక్ష్మీపురం నుండి ముప్పారం వరకు మూడు కిలోమీటర్ల బీటీ రోడ్డుకు రూ.2కోట్ల80లక్షలతో నిర్వహిస్తున్న రహదారి నిర్మాణం సంవత్సరం కాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. రైతుల విషయంలో విద్యుత్ అధికారులు ఎలాంటి అలసత్యం వహించినా ఉపేక్షించబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్‌శాఖ డీఈఈ మధుసూదన్, ఏడీ పాపిరెడ్డి, ఏఈఈ భార్గవి, కాంగ్రెస్ పార్టీ నాయకులు సత్యపాల్‌రెడ్డి, యాదన్న రెడ్డి, కురెళ్ళి సతీష్, బైరు అశోక్ , ముత్యాల మల్లయ్య, గంజి రాజేందర్ రెడ్డి, కొయ్యంది యాకాంతం, తమ్మడపల్లి కుమార్ వివిధ గ్రామాల పార్టీ కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పని చేస్తా...

- తొర్రూర్ కార్మికశాఖ సహాయ అధికారి భూక్య రవి



నవతెలంగాణ -మరిపెడ

భవన నిర్మాణ కార్మికుల పట్ల అంకితభావంతో పనిచేస్తానని తొర్రూర్ కార్మిక శాఖ సహాయ ఆఫీసర్ భూక్య రవి అన్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా సోమవారం తొర్రూర్‌లో బాధ్యతలు చేపట్టిన ఆయనను సీఐటీయూ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కొండ ఉప్పలయ్య, జిల్లా నాయకులు కారపాటి వెంకన్న, భాష్పంగ ముత్తయ్య ,తదితరులు వారిని శాలువతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం లేబర్ ఆఫీసర్ రవి నాయక్ మాట్లాడుతూ... ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీ సర్వ సాధారణమని అన్నారు. ఎక్కడ విధులు నిర్వహించినా అంకితభావంతో పనిచేసి కార్మిక శాఖకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. బిల్డింగ్ రంగ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాద శక్తులతో రాజ్యాంగానికి ప్రమాదం

- కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు



నవతెలంగాణ-మహబూబాబాద్

భారత రాజ్యాంగానికి మతోన్మాద శక్తుల నుంచి ప్రమాదం పొంచి ఉందని, ఆ రాజ్యాంగమే దేశ సమైఖ్యత, సమగ్రతలను నిలబెడుతుందని, రాజ్యాంగ రక్షణకు యువతరం నడుం బిగించాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ స్కైలాబ్‌బాబు పిలుపునిచ్చారు. సోమవారం మహబూబాబాద్‌లోని పెరుమాండ్ల జగన్నాథం భవనంలో '77 ఏండ్ల స్వాతంత్రం రాజ్యాంగం ఎదుర్కొంటున్న సవాళ్లు' అనే అంశంపై జిల్లాస్థాయి సెమినార్ నిర్వహించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుడ్డేల రామ్మూర్తి అధ్యక్షత వహించగా ప్రధాన వక్తగా స్కైలాబ్ బాబు హాజరై మాట్లాడారు. అంబేద్కర్ 110 దేశాల రాజ్యాంగాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి ప్రజలందరికీ సమాన హక్కులు ఉండేలా రాజ్యాంగాన్ని రూపొందించారని చెప్పారు. ప్రాచీన మనువాద సంస్కృతి సైద్ధాంతిక భూమిక కలిగిన ఆర్‌ఎస్‌ఎస్ కనుసనల్లోని బీజేపీ ఆ రాజ్యాంగాన్ని రద్దు చేయడానికి కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. దీనిని సామాజిక శక్తులు అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. నూతన జాతీయ విద్యా విధానం తీసుకొస్తూ అట్టడుగు వర్గాల హక్కులను కాలరాస్తుందన్నారు. ప్రశ్నించిన దబెల్కర్ ఫన్సారే, కల్బుర్గి గౌరీ లంకేష్ వంటి మేధావులను 10 ఏండ్లలో సంగ్ పరివాహ శక్తులు పొట్టన పెట్టుకున్నాయని అన్నారురు. మత విద్వేషాలను రెచ్చగొట్టడం ద్వారా బీజేపీ, ఎంఐఎం పబ్బం గడుపుకుంటున్నాయని విమర్శించారు. రాజ్యాంగం మౌలిక పునాదులైన ప్రజాస్వామ్యం, ఫెడరలిజం, సామాజిక న్యాయం లౌకికత్వంను కాపాడుకోవాలని అన్నారు. చరిత్ర పాఠ్యాంశాలలో భగత్ సింగ్, అంబేద్కర్ వంటి మహనీయుల చరిత్రలను తొలగిస్తున్నారని అన్నారు. రాజ్యసభ స్థానాలలో రిజర్వేషన్లతో పాటు ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలని అన్నారు. ఎస్సీలలో క్రిమిలేయర్ పెట్టాలనే వాదన సరికాదని అన్నారు. జిల్లా ఉపాధ్యక్షులు చీపిరి యాకయ్య, జిల్లా నాయకులు దొనక దర్గయ్య,హేమానాయక్ బుర్గుల లక్ష్మణ్ పులిపాక నాగరాజు బెజ్జం ఐలేష్,షేక్ ఖాదర్ బాబా, చెపురి గణేష్, శేషం ప్రశాంత్, పోలేపాక వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులను పరిరక్షించుకోవాలి

- యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు మురళీకృష్ణ



నవతెలంగాణ-తొర్రూరు

ప్రభుత్వ బడులను పరిరక్షించుకోవాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు మురళీకృష్ణ అన్నారు. యూటీఎఫ్ స్థాపించి 50 సంవత్సరాలు, ఎస్‌టిఎఫ్ఐ స్థాపించి 25సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా సోమవారం స్థానిక ఆర్‌అండ్‌బి గెస్ట్ హౌస్ ముందు యూటీఎఫ్, ఎస్‌టీఎఫ్ఐ జండాలను ఆవిష్కరించారు. అనంతరం జిల్లా కోశాధికారి నాగమల్లయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో మురళీకృష్ణ మాట్లాడుతూ సంఘ నిర్మాతలు, పూర్వ నాయకత్వం సంఘం పటిష్టతకు, ఎంతో కృషి చేశారన్నారు. అప్పారి వెంకటస్వామి, దాచుడి రామిరెడ్డి, మైనేని వెంకటరత్నం వారసత్వాన్ని భవిష్యత్తు తరాలకు అందించాలని అన్నారు. ప్రైవేటు మోజు పెరుగుతున్న సమయంలో నేడు ప్రభుత్వ పాఠశాలల్లో తగ్గుతున్న విద్యార్థుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ పాఠశాలల బాగుకోసం నిబద్ధతతో పనిచేయాలన్నారు. యూటీఎఫ్ సమాజాభివృద్ధి, విద్యా వికాసం ఉపాధ్యాయుల సంక్షేమం కోసం పనిచేస్తుందన్నారు. సంఘాలు పెట్టుకునే హక్కును సాధించడంలో చెన్నుపాటి లక్ష్మయ్య పాత్ర కీలకమైనది అన్నారు. డీఈఓ, డిప్యూటీ ఈవో, ఎంఈఓ ఖాళీలను వెంటనే భర్తీ చేసి వ్యవస్థను గాడిలో పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో తొర్రూరు, నరసింహులపేట, దంతాలపల్లి, నెల్లికుదురు మండలాల బాధ్యులు ఎండీ రఫీ, వెంకటేశ్వర్లు, యాకయ్య, రాయలు, చైతన్య, పార్వతి, నాగు మీరా,విజయ్, లింగరాజు, రంజిత్, శేఖర్, యాకూబ్, జనార్ధన్, వర కుమార్, వెంకన్న సోమయ్య,కుమార్, రవి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంస్కృతిని కాపాడుకుందాం : తెలంగాణ గిరిజన సంఘం



నవతెలంగాణ-మహబూబాబాద్

మనువాద సంస్కృతీ ప్రభావంతో ప్రాచీన గిరిజన సంస్కృతి, ఆచారాలు రోజురోజుకు కనుమరు గవుతున్న తరుణంలో తీజ్ లాంటి ఉత్సవాలు గిరిజన సంస్కృతిని కాపాడుకునే విధంగా చేస్తాయని గిరిజన సంస్కృతిని కాపాడుకునేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ శ్రీరామ్‌నాయక్ పిలుపు నిచ్చారు. మహబూబాబాద్ పట్టణంలో సాంక్రియ తండా, ధోబి గాట్ ప్రాంతాల్లో బంజారాల తీజ్ ఉత్స వాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. గిరిజ నుల సాంప్రదాయ ఆటలు పాటలతో ఆ ప్రాంతం కోలాహాలంగా మారింది. 9 రోజులపాటు పెంచిన తీజ్ బుట్టలను ఊరేగింపుగా వెళ్లి బంధం చెరువులో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఆర్ శ్రీరామ్ నాయక్ మాట్లాడుతూ.. గిరిజన తెగలు తరతరా లుగా వారి సంస్కృతిని కాపాడుకుంటూ ఉనికిని చాటుకుంటూ వస్తున్నాయన్నారు. ప్రపంచీకరణ, సరళీకరణ విధానాల ఫలితంగా గిరిజనుల సంస్కృతి, ఆచారాలు ప్రమాదంలో పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతో పురాతనమైన గిరిజన తెగల సం స్కృతిని బీజేపీ కేంద్రమంత్రి బండి సంజయ్ సనా తన ధర్మంతో పోల్చడాన్ని ఖండిస్తున్నామని అన్నారు. తెగల సంస్కృతి వేరు, మత సంస్కృతి వేరు అన్నారు. ఆ అన్న విషయాన్ని బండి సంజయ్ తెలుసుకోవాలని హితవు పలికారు. గిరిజన తెగల సంస్కృతి పరిరక్షణ కు ప్రభుత్వాలు ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి భూక్యా వీరభద్రం, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బానోత్ వెంకన్న, భూక్యా హరినాయక్, ఉపాధ్యక్షులు బానోత్ సీతారాం నాయక్, మాలోత్ కిషన్, జిల్లా కమిటీ సభ్యులు గుగులోత్ పార్వతి, యసం అశ్విని, గుగులోత్‌రెడ్డి, సాయికుమార్, జరు పుల లతిరామ్, బానోత్ శ్రీరామ్, లకావత్ కృష్ణ, రమేష్ పూర్ణ, సుధాకర్, బానోతు జేత్రాం, వెంకన్న, నీల, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు



వినతులను సత్వరమే పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద

నవతెలంగాణ-వరంగల్

ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన విజ్ఞప్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా అధికారులను ఆదేశించారు. ప్రజావాణికి వచ్చే ఫిర్యాదీదారులతో మమేకమై వారి సమస్యలను సావధానంగా పరిశీలించి పరిష్కార దిశగా కృషి చేయాలని, నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. పరిష్కరించుటకు వీలులేని పక్షంలో తదుపరి చర్యల కోసం వారికి అర్థమయ్యే విధంగా సూచనలు అందించాలన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి 265 విజ్ఞప్తులను అదనపు కలెక్టర్ డిఆర్డిఏ పీడీ కౌసల్యాదేవి, జెడ్పీ సీఈఓ రామిరెడ్డి, ఆర్డీఓ కృష్ణవేణితో కలిసి స్వీకరించారు. అందులో 70రెవెన్యూ శాఖకు, 159 ఎస్సీ కార్పొరేషన్‌కు, 4గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్, 3డిపిఓ, 3 నర్సంపేట మెడికల్ కళాశాల, మిగిలిన శాఖలకు ఒకటి చొప్పున దర ఖాస్తు వచ్చాయి. ఈ ప్రజావాణిలో అన్ని శాఖల అధికారులు, కలెక్టరేట్ ఏవో శ్రీకాంత్ పాల్గొన్నారు.

పేదలకు అసైన్డ్ భూమి పంపిణీ చేయాలి

సీపీఐ సమితి సభ్యులు పంజాల రమేష్

నవతెలంగాణ-చెన్నారావుపేట

నిరుపేదలకు భూమిని పంపిణీ చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్ డిమాండ్ చేశారు. చెన్నారావుపేట మండలం అమినాబాద్ శివారు పనికిర గుట్ట దగ్గర గల ప్రభుత్వ అసైన్డ్ భూమిని 2006 నుండి గుడిసెలు వేసుకుని నివాసముంటున్న పేద ప్రజలకు మాత్రమే చెందాలని అన్నారు. గతంలో పేద ప్రజలు ధర్నాలు చేయడం జరిగిందని అన్నారు. ఈ ప్రభుత్వ భూమిని పేద ప్రజలకు పంచకుండా అధికారుల అండదండలతో అసైన్డ్ భూమిని పట్టా చేయించుకొని ప్రభుత్వ భూమిని కాజేయడానికి కొంత మంది ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఆ భూమిని ప్రభుత్వం పేద ప్రజలకు పంచాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నెక్కొండ మండల కార్యదర్శి కందిక చెన్నకేశవులు, రమేష్, మైదం యాకయ్య, నీరటి రజిత, సింగం వెంకటలక్ష్మి రాజేష్, చలకపల్లి శ్రీను, సావిత్రి, రేణుక, దూలం రజిత, చెక్క సరిత, కనుకుల సుగుణ యాదలక్ష్మి, అఖిల పాల్గొన్నారు.



మృతుని కుటుంబానికి 'సూర్య' పరామర్శ

నవతెలంగాణ-ములుగు

ములుగు మండలంలోని జంగాలపల్లి గ్రామంలో రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ సీతక్క గన్మేన్ (అంగ రక్షకుడు) రాజు కుమార్ బావ రమేష్ సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మంత్రి సీతక్క తనయుడు, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనసరి సూర్య సోమవారం పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఎండీ చాంద్‌పాషా, ఎండీ అప్సర్‌పాషా, సహకార సంఘం వైస్ చైర్మన్ మర్రి రాజు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు చింత క్రాంతి, మాజీ సర్పంచ్ రాజిరెడ్డి, యూత్ నాయకులు సుమన్ రెడ్డి, మైనార్టీ సెల్ జిల్లా కార్యదర్శి ఎండీ అజ్జు, గ్రామ కమిటీ అధ్యక్షులు జగన్, గుండ భిక్షపతి ఉన్నారు.



పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

నవతెలంగాణ-మంగపేట

పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చని మండలంలోని చుంచుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ చిన్నపాక యమునా తెలిపారు. సోమవారం మండలంలోని చుంచుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల రమణక్కపేట, చుంచుపల్లి గ్రామాలలో సోమవారం ఇంటింటి ఫీవర్ సర్వే, డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. 89 మందిని పరీక్షించగా 27మంది జ్వర పీడితులను గుర్తించి ఉచితంగా మందులు పంపిణీ చేసి, వారి రక్త నమూనాలను సేకరించి రక్త పరీక్షలు చేసినట్లు తెలిపారు. వర్షాకాలం ముగిసే వరకు ప్రజలు కాచి చల్లార్చిన నీటినే తాగాలని వేడిగా ఉన్న ఆహార పదార్థాలను తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం లు భాగ్యలక్ష్మి , సారమ్మ ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



రహదారికి మరమ్మత్తు

నవతెలంగాణ-ఖానాపురం

మండల కేంద్రం నుండి రంగాపురం వెళ్లే ప్రధాన రహదారి గుంతలు పడి ప్రయాణికులు ఇబ్బంది పడుతుండడంతో సోమవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, నర్సంపేట వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు స్థానిక నాయకులతో కలిసి తాత్కాలిక మరమ్మత్తు పనులు చేపట్టినట్లు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ నుంచి రంగాపురం వెళ్లే రహదారి వర్షాల కారణంగా, పలు సమస్యలతో ప్రధాన రహదారి గుంతల మయంగా మారాయని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో రహదారి తాత్కాలిక మరమ్మత్తు పనులు చేపట్టినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎర్ర జగన్మోహన్‌రెడ్డి, ఎలగందుల రాజుతో పాటు పలు గ్రామాల పార్టీ గ్రామ అధ్యక్షులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

లైన్ ఇన్స్పెక్టర్ డి రామచంద్రయ్య

నవ తెలంగాణ-గోవిందరావుపేట

నేడు మండలంలోని పసర గ్రామంలో ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు నార్లాపూర్ రోడ్డు స్కూల్ నుండి వన్ సైడ్ కరెంటు నిలిపివేయబడుతుందని వినియోగదారులు సహకరించాలని లైన్ ఇన్స్పెక్టర్ డి రామచంద్రయ్య తెలిపారు. నార్లాపూర్ రోడ్డు స్కూల్ నుండి వన్ సైడ్ కరెంటు బంద్ చేయబడుతుందని, నార్లాపూర్ రోడ్డులో హై స్కూల్ నుండి హైస్కూల్ వైపు సైడు ఒక్క సైడు స్కూల్లో చెట్లు ఉండటం వలన పిల్లలకు ఇబ్బంది కలుగుతున్నది కావున రేపు స్కూల్లో ఉన్న చెట్లు కొట్టేందుకు విద్యుత్‌ను నిలిపేస్తున్నట్టు తెలిపారు.

గ్రీవెన్స్ ఫిర్యాదుల పరిష్కారంలో వేగం పెంచాలి

బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

నవతెలంగాణ-వరంగల్



గ్రీవెన్స్ ఫిర్యాదుల పరిష్కారంలో వేగం పెంచాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్య క్రమాన్ని పురస్కరించుకొని బల్దియా ప్రధాన కార్యాల యంలోని కౌన్సిల్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్య క్రమంలో కమి షనర్ పాల్గొని ప్రజల నుండి వినతులు స్వీకరించి పరి ష్కార నిమిత్తం ఆయా విభాగాల ఉన్నతాధికారులకు అందజేశారు. ఈ సంద ర్భంగా స్వీక రించిన ఫిర్యాదుల వివరాలు విభాగాల వారిగా ఇంజనీ రింగ్ 18,హెల్త్, సాని టేషన్ 14,ప్రాపర్టీ టాక్స్(రెవెన్యూ) 10,టౌన్ ప్లానింగ్ 54, డిఆర్ఎఫ్ 01, మొత్తం 97 కార్యక్రమంలో ఎస్ఈలు ప్రవీణ్ చంద్రరాజయ్య సీఎంహెచ్ఓ డా.రాజేశ్, బయలజిస్ట్ మాధవరెడ్డి, హెచ్ఓ రమేష్, డిఎఫ్ఓ శంకర్‌లింగం, టిపిఆర్ఓ కోలా రాజేష్ కుమార్‌గౌడ్, డిసిపి రవీంద్ర, డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి, టిఓ బిర్రు శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలి

- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క
- పాఠశాల, వసతి గృహాల పరిసరాలు శుభ్రంగా ఉంచాలి
- మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలి
- జిల్లా అధికారులతో టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి దిశా నిర్దేశం



నవతెలంగాణ-ములుగు

పాఠశాలల వసతి గృహాలలోని విద్యార్థులపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని, నిరంతరం పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కల్పించాలని మంత్రి సీతక్క అన్నారు. సోమవారం రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణాభివద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో టెలి కాన్ఫరెన్స్ ద్వారా పాఠశాలల పరిశుభ్రత, వసతి గృహాల నిర్వహణ, మాదకద్రవ్యాలను నిరోధించడం, అనే అంశాలపై టెలికాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ టెలి కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్, జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు శ్రీజతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ అధికారులు విద్యార్థులను సొంత పిల్లల మాదిరిగా చూసుకోవాలని, కళాశాల పాఠశాల వసతి గృహాల పరిసరాలు నిరంతరం పరిశుభ్రంగా ఉండేలా చూడాలని వారంలో ఒకసారి ప్రత్యేకంగా వసతి గృహంలో ఉండే విద్యార్థులకు గదులను ప్రత్యేకంగా తనిఖీ చేసి వసతి గృహాల నిర్వహణను పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. పాఠశాల విద్యార్థులు మాదకద్రవ్యాలకు మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలని, వీటి ద్వారా వచ్చే అనర్థాలపై ప్రత్యేక అవగాహన కల్పించే కార్యక్రమాలను నిర్వహించాలని, ఎక్కడైనా విద్యార్థులు తప్పుదోవ పడుతున్నారని అనుమానం వచ్చిన వెంటనే సంబంధిత పాఠశాల పరిసరాలను వసతి గృహాలను అధికారులు తనిఖీ చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా వసతి గృహాలలో దోమలు ఈగలు మురికి నీరు నిలవకుండా చూడాలని, అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రాత్రి సమయంలో వసతి గృహాలలో లైట్లు ఉండేలా చూడాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి శ్రీజ తో కలిసి ప్రతిజ్ఞ చేసి " గంజాయి, కల్తీ కల్లు నిర్మూలిద్దాం మన సమాజాన్ని కాపాడుకుందాం"అనే పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డి.ఎస్.పి రవీందర్, డీడబ్ల్యూఓ స్వర్ణలత లెనిన, డీఎంహెచ్ఓ అప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

లొంగిపోయిన ఇద్దరు మావోయిస్టులు

ములుగు జిల్లా ఎస్పీ శబరీష్

నవతెలంగాణ-ములుగు



ప్రభుత్వ నిషేధిత మావోయిస్టు పార్టీకి చెందిన ఇద్దరు దళ సభ్యులు పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ తెలిపారు. సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో లొంగుబాటు వివరాలను జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ వెల్లడిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బాపట్ల జిల్లా వేటపాలెం మండలం రెడ్లలంప గ్రామానికి చెందిన దుడ్ల తేజ అమర్నాథరెడ్డి అలియాస్ అర్జున్, డివిసి సెక్రటరీ కాయ్యడ సాంబయ్య అలియాస్ ఆజాద్ భద్రతా దళంలో ఏరియా కమిటీ సభ్యుడిగా పని చేశాడని డిగ్రీ మధ్యలో నిలిపివేసి మావోయిస్టు బావజాలానికి ఆకర్షితుడై ఫేస్బుక్లో అన్నెం చందరావుతో పరిచయం ఏర్పడి సిపీఐ మావోయిస్టు పార్టీలో చేరాడన్నారు. 2022సంవత్సరం లో పార్టీ సభ్యుడిగా ప్రమోట్ చేయబడి 2024 లో ఏసిఎంగా పదోన్నతి పొందాడని, ఎక్కువగా ఆజాట్ ఎస్సీఎం దక్షిణ బస్తర్ చత్తీస్గఢ్ ప్రాంతాలలో ఉన్నందున నేరాలలో పాల్గొనలేదన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన గాలి నారాయణరెడ్డి బలియాస్ రాజకుమార్ శబరి ఎల్.ఎస్ డివిసిలో దళ సభ్యుడిగా పని చేశాడన్నారు. ఆజాద్ కలిసి తిరుగుతూ సరకులు చేరవేసేవాడన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కల్పించబడే పునరావాస పథకాలకు ఆకర్షించబడి శాంతియుతంగా తమ కుటుంబాలతో కలిసి సాధారణ జీవనం గడపాలని లొంగిపోయినట్లు తెలిపారు. పునరావాసం ద్వారా అమర్నాథ్‌రెడ్డిపై నాలుగు లక్షల రివార్డుడు. నారాయణరెడ్డిపై లక్ష రివార్డు బ్యాంక్ డిడి ద్వారా వారికి పంపిణీ చేసినట్టు తెలిపారు. పునరావాస ప్రక్రియలో భాగంగా లబ్ధి పొంది రాష్ట్ర నిర్మాణాత్మక భాగస్వామ్యం అందించి రాష్ట్ర బభివద్ధికి తోడ్ప డాలని, మావోయిస్టులు జనజీవన స్రవంతిలో చేరి రాష్ట్ర ప్రగతిలో పాలు పంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఓ ఎస్డీ మహష్ బి. గీతే, ములుగు డీఎస్పీ నలువాల రవిందర్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యారంగ పరిరక్షణకు సమరశీల పోరాటాలు

- ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు నద్దునూరి
- ఘనంగా ఏఐఎస్ఎఫ్ 89వ ఆవిర్భావ వేడుకలు

నవతెలంగాణ-కాశిబుగ్గ



భారతదేశ స్వాతంత్రమే లక్ష్యంగా అఖిల భారత విద్యార్థి సమైక్య (ఏఐఎస్ఎఫ్) ఆవిర్భవించిందని ఆ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు నద్దునూరి అశోక్ స్టాలిన్ అన్నారు. ఖిలా వరంగల్ మండలం రంగాశాయిపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగాణంలో ఎఐఎస్ఎఫ్ 89వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జిల్లా కార్యదర్శి ల్యాదల్ల శరత్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు నదునూరి అశోక్ స్టాలిన్ కేక్ కట్ చేసి జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ స్వతంత్ర సాధన మాజన్మహక్కు అని 1936, ఆగస్టు12న ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని లక్నో లో ఆవిర్భవించిన ఏఐఎస్ఎఫ్ మా అంతం చూసిన స్వాతంత్ర ఉద్యమ పంతం విడం అంటూ దేశ స్వాతంత్ర సంఘం పోరాటంలో ముందుండి పోరాడిందని గుర్తు చేశారు. నేటి పాలకులు అవలంభిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై, ప్రభుత్వ విద్య పరిరక్షణకు, అసమానతలతో కూడిన నూతన జాతీయ విద్యా విధానానికి వ్యతిరేకంగా సుదీర్ఘ చరిత్ర కలిగిన ఏఐఎస్ఎఫ్ స్ఫూర్తితో విద్యార్థులు పోరాటాలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఇసంపల్లి సాగర్, జిల్లా ఉపాధ్యక్షులు మోటం శివ కుమార్, నాయకులు మేకల అభిరామ్, మోరే రాజు, ప్రభాస్, సోను చౌహన్, నిశాంత్, ఖలీల్, సంతోష్, రోజా, షాజీయ, నాగజ్యోతి, కీర్తన, ప్రియాంక పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

నవతెలంగాణ-ములుగు



ప్రజావాణి ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. సుదూర ప్రాంతాల నుంచి తమ సమస్యలను పరిష్కరించుకోవడానికి వచ్చే బాధితులకు భరోసా కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ లోకల్‌బాడీ పి. శ్రీజ, అదనపు రెవెన్యూ కలెక్టర్ మహేందర్‌జి ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డిలతో కలిసి ప్రజావాణి ఫిర్యాదులను ప్రజల నుంచి స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి లో వచ్చిన ప్రతి ఫిర్యాదును అధికారులు పరిష్కరించాలని సూచించారు.ఎట్టి పరిస్థితుల్లోనూ వాటిని పెండింగ్లో పెట్టవద్దని, వార వారం ఫిర్యాదులు పరిష్కరించుకుంటూ ముందుకు సాగాలని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజావాణిలో రెవిన్యూ శాఖకు సంబంధించినవి 35, పింఛన్లకు సంబంధించినవి 08, 2 బీహెచ్‌కే సంబంధించినవి 02, ఉద్యోగాలకు సంబంధించి 05, దళిత బంధుకు సంబంధించి 10, ఇతర శాఖలకు సంబంధించినవి 22 మొత్తం 82 ఫిర్యాదులు వచ్చాయి. వీటి పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డిఆర్డిఓ సంపత్‌రావు, డీఎంఅండ్‌హెచ్ఓ అప్పయ్య, డిసీ ఎస్ ఓ రాంపతి, డిసిఓ సర్దార్‌సింగ్, సిపిఓ ప్రకాష్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తుల రవి, ఇతర అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీఓలు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏఐఎస్ఎఫ్ 89వ ఆవిర్భావ దినోత్సవం

నవతెలంగాణ-ములుగు



ఆగస్ట్ 12న అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) 89వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం గట్టమ్మ వద్ద ట్రైబల్ వెల్ఫేర్ గురుకులం హాస్టల్ ఆవరణలో జిల్లా ఉపాధ్యక్షుడు అనుముల రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి కుమ్మరి సాగర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పోరాటాలు, త్యాగాలే ధ్యేయంగా ఏర్పాటైన ఈ విద్యార్థి సంఘం స్వాతంత్ర్యానంతరం ప్రభుత్వ విద్యా పరిరక్షణకై, శాస్త్రీయ విద్య, కామన్ విద్యావిధానం అమలుపై నిరంతరం పోరాటాలు సాగిస్తూ 88 సంవత్సరాలుగా విద్యార్థుల శ్రేయస్సు కోసం అశేష త్యాగాలు చేస్తూ ఆవిర్భావం నాటి నుంచి నేటి వరకు గల్లి నుండి డిల్లీ వరకు విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉద్యమిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు ,వేణు. ప్రవీణ్. రమేష్. నాగరాజ్. 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

అత్తమామలపై అల్లుడి దాడి

మామ మతి, అత్త పరిస్థితి విషమం

నవతెలంగాణ మంగపేట



అత్తమామలపై దాడి చేసి మామ మరణానికి, అత్త పరిస్థితి విషమించడానికి కారణమైన అల్లుడి నిర్వాకం మండలంలోని బాలన్నగూడెం గ్రామంలో సోమవారం వెలుగు చూసింది. గ్రామస్తులు తెలిపిన సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని బాలన్న గూడెం పంచాయతీ పరిధిలోని నీలాద్రి పేట గ్రామానికి చెందిన గొర్రె నరసయ్య సమ్మక్క దంపతులు సుమారు 17 సంవత్సరాల క్రితం తమ కుమార్తె స్వప్నను అదే గ్రామానికి చెందిన గాందేర్ల రామకష్ణ కు ఇచ్చి వివాహం చేశారు. కాగా గత మూడేండ్ల క్రితం రామకష్ణ అదే గ్రామానికి చెందిన మరొక మహిళతో సహజీవనం చేస్తుండడంతో కోపించిన భార్య స్వప్న తన కూతురు కుమారుడితో కలిసి తల్లిదండ్రుల వద్ద ఉంటూ జీవిస్తుంది. ఆదివారం రాత్రి కిరాణా సరుకుల కోసం బయటకు వెళ్లిన స్వప్నను రోడ్డుపై దొరకబుచ్చుకున్న రామకష్ణ తనతో ఉండాలంటూ స్వప్నతో గొడవకు దిగాడు. మద్యం మత్తులో ఉన్న రామకష్ణ ఆగ్రహంతో ఊగిపోతూ తన అత్తమామల ఇంటికి వెళ్లి కర్రతో విచక్షణారహితంగా వారిపై దాడి చేయడంతో మామ గొర్రె నరసయ్య (60) అక్కడికక్కడే మతి చెందాడు. తీవ్ర గాయాల పాలైన నరసమ్మ పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యం కోసం ఆసుపత్రికి తరలించారు.సంఘటన వివరాలు తెలుసుకున్న స్థానిక ఎస్ఐ టీవీఆర్ సూరి నీలాద్రి పేటకు వెళ్లి సంఘటనా స్థలాన్ని పరిశీలించి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు టై, బెల్టుల పంపిణీ

నవతెలంగాణ-నెక్కొండ



నెక్కొండ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు జాన్‌నాయక్, ఐలయ్య టై, బెల్ట్‌లను బహూకరించారు. ఈ సందర్భంగా స్కూల్ కాంప్లెక్స్ ప్రధానో పాధ్యాయులు రంగా రావు పాల్గొని మాట్లాడుతూ పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు సొంత ఖర్చులతో 75 మంది విద్యార్థులకు టై, బెల్ట్‌లను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ లావణ్య, ఉపాధ్యాయులు భిక్షపతి, భారతి, భద్రు పాల్గొన్నారు.

పీఆర్టియు యూనియన్ సభ్యత్వ నమోదు

నవతెలంగాణ-రాయపర్తి



మండలంలోని వివిధ పాఠశాలల్లో పిఆర్టియు టీఎస్ యూనియన్ సభ్యత్వ కార్య క్రమాన్ని మండల అధ్యక్షుడు ఆవుల రవీందర్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వ హించారు. ఈ సంద ర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహ మ్మద్ అబ్దుల్‌గఫార్ మాట్లా డుతూ.. పీఆర్టియు యూని యన్ ఉపాధ్యాయుల సమస్య లను పరిష్కరించడంలో ముం దుంటుందని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న డీఏ లను వెంటనే విడుదల చేయాలని, 2003డీఎస్సి వారికి పాత పెన్షన్ వర్తింప చేయ్యాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలన్నారు. సోషల్ వెల్ఫేర్ ఉపాధ్యాయులకు ఈహెచ్ఎస్‌ను వర్తింపచేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధానకార్యదర్శి గాదె ప్రవీణ్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు పారుపల్లి సమ్మారెడ్డి, ఖానాపూర్ మండల మాజీ అధ్యక్షుడు ప్రసాదరావు, రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ అంజయ్య, రఘు పాల్గొన్నారు.

అత్యాచార యత్నానికి పాల్పడిన వ్యక్తికి పదేండ్లు జైలుశిక్ష


ఎస్ఐ గూడ అరుణ్ కుమార్

నవతెలంగాణ-చెన్నారావుపేట

మైనర్ బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడిన వ్యక్తికి 10ఏండ్ల జైలు శిక్ష పడినట్లు చెన్నారావుపేట ఎస్ఐ గూడ అరుణ్ కుమార్ సోమవారం తెలిపారు. గతేడాది మండలంలోని ఓ గ్రామంలో ఒంటరిగా ఉన్న బాలిక (మైనర్)పై రఘుపతి అనే వ్యక్తి అత్యాచార యత్నానికి పాల్పడ్డాడు. వెంటనే బాలిక తల్లి తండ్రులు అక్కడికి రాగా అక్కడి నుంచి పారిపోయాడు. వెంటనే తల్లి తండ్రులు చెన్నారావుపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్ఐ మహేందర్ పోక్సో కింద కేసు నమోదు చేశారు. ఆ తర్వాత సరైన ఆధారాలను సేకరించి కోర్టు ముందు హాజరు పర్చగా కోర్టు పలు విచారణల అనంతరం సోమవారం ఫస్ట్ అడిషనల్ జడ్జి ప్రేమలతరెడ్డి నిందితుడు రఘుపతికి 10ఏండ్ల శిక్షతో పాటు రూ.1000 జరిమానా విధించినట్లు తెలిపారు. బాధితురాలికి రూ.1లక్ష పరిహారం అందించాలని ఆదేశించారు. నిందితుడికి శిక్ష పడేందుకుకషి చేసిన చెన్నారావుపేట ఎస్ఐ గూడ అరుణ్ కుమార్, కోర్టు కానిస్టేబుల్ సురేందర్‌ను ఉన్నతాధికారులు అభినందించారు.

బంగ్లాదేశ్‌లో భారతీయులపై దాడులు ఆపాలి

నవతెలంగాణ-కాశిబుగ్గ



బంగ్లాదేశ్‌లో భారతీయులపై జరుగుతున్న దాడులను ఆపాలని రాష్ట్రీయ హిందూ పరిషత్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు మడిపల్లి నాగరాజు గౌడ్ కోరారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ సోమవారం కాశిబుగ్గచౌరస్తాలో హిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాగరాజుగౌడ్ మాట్లాడుతూ బంగ్లాదేశ్ లో మతో న్మాదులు చేస్తున్న అరాచకాలు, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కోమాకుల నాగరాజు, పత్రి సుభాష్, బండి నగేష్, మచ్చర్ల ప్రభాకర్, రామ నాగార్జున, గోగికర్ శ్రవణ్, పిట్టల కోటి, ఆడెపు రమేష్, బోడ సంజీవ్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతు రచ్చబండ

నవతెలంగాణ-గోవిందరావుపేట

బుసాపురం గ్రామంలో మంగళవారం (నేడు) కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రుణమాఫీ వర్తించని రైతుల కోసం రైతు రచ్చబండ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బీజేపీ మండల అధ్యక్షుడు మద్దిలేని తేజ రాజు తెలిపారు. ఈ సమావేశానికి మండల పరిధిలోని రాష్ట్ర,జిల్లా నాయకులు,మండల నాయకులు,మండల కిసాన్ మోర్చ అధ్యక్షులు, సభ్యులు బీజేపీ కార్యకర్తలు తప్పకుండా హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర నాయకులు ఆరూరి రమేష్, అజ్మీర సీతారాం నాయక్‌లు హాజరవుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రైతులకు సూచించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మహబూబాబాద్
మంగళవారం ఆగస్టు 13, 2024
www.navatelangana.com

సమస్యలను ధీటుగా ఎదుర్కోవాలి

ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఎండి రియాజ్, ప్రధాన కార్యదర్శి ఆర్. వీరాంజి



నవతెలంగాణ -మరిపెడ

సమాజం శ్రేయస్సులో జర్నలిస్టు పాత్ర అత్యంత కీలకమని, ప్రభుత్వానికి ప్రజలకు వారధులుగా పని చేసే జర్నలిస్టులు నేడు ఆర్థికంగా, మానసికంగా నలిగిపోతున్నారు. మరిపెడ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మొహమ్మద్ రియాజ్ పాషా, ప్రధాన కార్యదర్శి రాంపెల్లి వీరాంజీ, అన్నారు. ఆర్థిక ఇబ్బందులతో కుమార్తె తో సహా ఆత్మహత్య చేసుకున్న వరంగల్ కు చెందిన జర్నలిస్టు యోగి, ఆయన కుమార్తె చిత్ర పటానికి మరిపెడ మండల ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో మరిపెడ మండల కేంద్రలోని కార్గిల్ స్తూపం వద్ద కొవ్వొత్తుల నివాళి అర్పించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు రియాజ్ పాషా మాట్లాడుతూ సమాజ హితం కోసం పోరాడే జర్నలిస్టులు సమస్యలను ధీటుగా ఎదుర్కోవాలని, యువ జర్నలిస్టు నేడు ఆత్మహత్య చేసుకోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వం యోగి కుటుంబానికి అండగా నిలవాలని, వారి కుటుంబాన్ని ఆదుకోవాలని అన్నారు. కాంగ్రెస్ మరిపెడ పట్టణ అధ్యక్షుడు షేక్ తాజోద్దీన్, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి దుండీ వీరన్న, నాయకుడు గుండగాని మధుసూదన్, పట్టణ వాసులు అలువల శ్రీధర్, రహీం, స్థానికులు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవ సలహా దారులు శ్రీరంగం శ్రీనివాస్, గాడిపెల్లి శ్రీశైలం, పసునూటి వేణు, కోశాధికారి మచ్చ రాజేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శి జిన్నా లచ్చన్న, సహాయ కార్యదర్శి పోతుల గోవర్ధన్, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ ఇనుగుర్తి మండలశాఖ కమిటీ ఎన్నిక

అధ్యక్షులుగా సుక్క ఉప్పలయ్య, ప్రధాన కార్యదర్శిగా కదిరే ప్రభాకర్.





నవతెలంగాణ -ఇనుగుర్తి

మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ ఇనుగుర్తిమండల శాఖ అధ్యక్షులు గుండు సురేందర్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించడం జరిగింది. ప్రధాన కార్యదర్శి కదిరే ప్రభాకర్ నివేదిక సమర్పణ, ఆమోదం అనంతరం ఈ కమిటీ ని రద్దు చేసి, ఎన్నికల అధికారిగా వ్యవహరించిన జిల్లా కార్యదర్శి చీకటి ఉపేందర్ నేతత్వంలో తిరిగి నూతన కమిటీ ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా సుక్క ఉప్పలయ్య ప్రధాన కార్యదర్శిగా కదిరే ప్రభాకర్ ఉపాధ్యక్షులుగా కోటేశ్వరరావు, కార్యదర్శిగా పుల్లూరు సారంగపాణి, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా రాజు సభ్యులుగా పాషా, కీర్తన, సతీష్ లు ఎన్నుకోబడ్డారు. ఈ కార్యక్రమంలో కేసముద్రం మండల శాఖ బాధ్యులు చీకటి వెంకట్రాంనరసయ్య, నరసింహ, రాజు పాల్గొన్నారు.


ఆర్మీ జవాన్ రమేష్ స్మారక స్థూపం ఆవిష్కరణ



నవతెలంగాణ-గార్ల

దివంగత ఆర్మీ కానిస్టేబుల్ భూక్య రమేష్ జ్ఞాపకార్థంగా మండలం లోని పీక్లి తండా లో రమేష్ చదివిన పాఠశాల లో ఖమ్మంలో బెటాలియన్ ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్, విశాఖపట్నంలో ఎస్ హెచ్ ద్వారా సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్‌తో పాటు స్థానిక సివిల్ అడ్మినిస్ట్రేషన్ డిప్యూటీ కమాండెంట్, ఇన్‌స్పెక్టర్ దలీప్ కుమార్,బి.శ్రీనివాస రెడ్డి ప్రారంభించారు. 2013లో రమేష్ ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్‌లో చేరి ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్‌లోని 04వ బెటాలియన్ అరుణాచల్ ప్రదేశ్ లో విధులు నిర్వహిస్తున్నప్పుడు దేశ సేవలో వీరమరణం పొందాడని రమేష్ సేవలను కొనియాడారు. అనంతరం జవాన్ రమేష్ కుటుంబ సభ్యులను ఘనంగా సత్కరించారు. సివోడికే అధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఐటిబిపి సిబ్బంది, ఆర్డివో ఆలి వేలు, డిప్యూటి కమాండ్డెంట్ బి.శ్రీనివాస రెడ్డి,ఇన్స్పెక్టర్ దిలీప్ కుమార్, హెడ్ కాని స్టేబుల్ లు కె. ప్రతాప్ రెడ్డి, రాము నాయుడు, సంగప్ప, సతీష్, మన్మధ రావు, నరసింహ, మాజీ జడ్పీటీసీ జాటోత్.జాన్సీ లక్ష్మి,డిటి సుధాకర్, మాజీ సర్పంచ్ రమేష్ పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు



నవతెలంగాణ-గార్ల:

గ్రామీణ ప్రాంతాల్లో ప్రథమ చికిత్స చేస్తున్న ఆర్ఎంపి,పిఎంపిలు పరిమితికి మించిన వైద్యం చేస్తున్నారని, నిబంధనలు పాటించకుంటే చర్యలు తీసుకుంటామని ఎస్సై జీనత్ కుమార్, ప్రభుత్వ నోడల్ అధికారి డాక్టర్ రాజ్ కుమార్ జాదవ్ హెచ్చరించారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్సై జీనత్ కుమార్ అధ్వర్యంలో ఆర్ఎంపి, పిఎంపిలు, ల్యాబ్, ఎక్స్ రే, ఫార్మసి నిర్వాహకులతో పరిమితులపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతా గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అత్యవసర సమయాల్లో నిత్యం అందుబాటులో ఉంటూ ప్రథమ చికిత్స అందిస్తున్న వారిని అభినందించారు. కానీ కొందరి పరిమితికి మించిన వైద్యం అందించడం వల్ల ప్రజలకు ఆరోగ్య తలెత్తుతున్నాయని, పరిమితికి మించిన వైద్యం అందించకూడదని,ప్రథమ చికిత్స కేంద్రాలు గ్రామీణ ప్రజల ఆరోగ్య, ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ నిబంధనలు పాటించాలన్నారు.

వయనాడు బాధితులకు విరాళాల సేకరణ

నవతెలంగాణ-నెల్లికుదురు

కేరళ రాష్ట్రంలోని వయనాడు వరద బాధితులకు అండగా విరాళాలు సేకరిస్తున్నట్లు సీపీఐ(ఎం) మండల కార్యదర్శి పెరుమాళ్ళ తిలక్ బాబు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో విరాళాల సేకరణ కార్యక్రమం ప్రారంభించి మాట్లాడారు. వరద బీభత్సవానికి కొండ చర్యలు విరిగి అనేక అనేక గ్రామాలు శిథిలా వ్యవస్థకు చేరుకోగా వందలాదిమంది మరణించారని అన్నారు. వయనాడ్ బాధితులను ఆదుకునేందుకు తమ పార్టీ కేంద్ర కమిటీ పిలుపుమేరకు విరాళాల సేకరణ చేపట్టినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు బాబు గౌడ్, మండల రైతు సంఘం అధ్యక్షులు తోట నరసయ్య, వ్యవసాయ కార్మిక సంఘ మండల నాయకులు బత్యం సత్యనారాయణ, తోట యాకయ్య పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను నెరవేర్చాలి : టీపీయూఎస్

నవతెలంగాణ-చిట్యాల

గత ఎన్నికల్లో ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని టీపియుఎస్ మండల గౌరవ అధ్యక్షులు బుర్ర సదయ్య అన్నారు. సోమవారం టిపియుఎస్ చిట్యాల మండలశాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సమావేశాన్ని నిర్వహించారు. టిపియూఎస్ మండల గౌరవ అధ్యక్షులు బుర్ర సదయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వాలు ఉపాధ్యా యుల సమస్యలను పట్టించుకోలేదన్నారు. 30 సంవత్సరాలు ఉద్యోగం చేసిన కనీసం పెన్షన్ లేకపోవడం దారుణమని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఉద్యోగులకు ఇబ్బందిగా ఉన్న సిపిఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పున రుద్ధరించాలని పేర్కొన్నారు. పెండింగ్ డీఏలను వెంటనే చెల్లించాలన్నారు. జీఓ 317 బాధితులకు వెంటనే న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిట్యాల మండల అధ్యక్షులు కానుగుల రఘుపతి, జిల్లా బాధ్యులు గోపగాని భాస్కర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నీటి సంఘం ఎన్నికలు ఎప్పుడో?

2016లో చివరిసారిగా ఎన్నికల నిర్వహణ
అధ్వాన్నంగా మారుతున్న చెరువులు,
పట్టించుకోని ప్రభుత్వం

నవతెలంగాణ-తొర్రూరు

గత ఎనిమిది సంవత్సరాలుగా నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించడం లేదు. దీంతో చెరువులు అధ్వాన్నంగా మారాయి. మరోవైపు మిషన్ కాకతీయ పథకంలో భాగంగా గత ప్రభుత్వం చెరువులు, కుంటలకు మరమ్మతులు చేసిన వాటిపై అజమాషి లేక నీటి విడుదల మరమ్మత్తులపై దష్టి పెట్టేవారు కరువయ్యారు. చెరువుల అభివృద్ధి కోసం గత టిఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మిషన్ కాకతీయ పథకానికి శ్రీకారం చుట్టింది. ఒకప్పుడు చెరువుల అభివద్ధికి, నిర్వహణకు, ఆయకట్టుకు నీరు సరఫరా చేయడం, తదితర పర్యవేక్షణ పనులు నీటిసంఘాలు, పాలకవర్గాలు చేపట్టేవి. గత 8ఏళ్లుగా ప్రభుత్వాలు నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో పర్యవేక్షణ కరువైంది. దీంతో కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా పనులు చేపడుతున్నారు. కొన్ని గ్రామాల్లో పనులు చేపట్టకముందే నిధులు కాజేసారన్న ఆరోపణలు ఉన్నాయి.

గతంలో ఇలా....

గత ప్రభుత్వం నీ సాగునీటి సంఘాలకు ఎన్నికలు నోటిఫికేషన్ విడుదల చేయగానే 100 ఎకరాల ఆయకట్టు ఉన్న ప్రధాన చెరువుల ఆయకట్టుకు రైతులు చైర్మన్ తో పాటు డైరెక్టర్ ను ఎన్నుకునే వారు. పాలకవర్గ సభ్యులు చెరువుల నిర్వహణతో పాటు నీటిని పంట పొలాలకు విడుదల చేసుకొని పొదుపుగా వాడుకునేలా చర్యలు తీసుకునేవారు. అంతేకాకుండా రైతులను సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి పనులు నిర్వహించేవారు. గత 8 ఏళ్ల నుంచి నీటి సంఘాల ఎన్నికలు నిర్వహించకపోవడంతో చెరువుల నిర్వహణ అధ్వాన్నంగా మారింది. కొన్ని చెరువులు శిథిలావస్థకు చేరుకున్నాయి. తూములు పనిచేయక, సాగునీరు రాక నిరుపయోగంగా మారాయి.

పాలకుర్తి నియోజకవర్గం తొర్రూరు మండలంలో 58 చెరువులు ఉన్నాయి. వీటిలో ప్రధానంగా 10 పెద్ద చెరువులు ఉండగా మిగతావి చిన్న నీటి చెరువులే. ప్రస్తుతం అన్ని చెరువులో డెడ్ స్టోరేజ్ లో ఉన్నాయి. కొన్ని కాలువలు, తోములు రిపేరు చేయాల్సి ఉంది.ఇప్పటికైనా నీటి సంఘాల ఎన్నికలు నిర్వహించి చెరువులను మరింత అభివద్ధి చేయాలని రైతులు కోరుతున్నారు.

నీటి సంఘాలతోనే చెరువుల అభివద్ధి

: రావుల బుచ్చిరెడ్డి, రైతు, మడిపల్లి



నీటి సంఘాలను ఎన్నుకుంటేనే చెరువుల అభివద్ధి చెందుతాయి. గతంలో నీటి సంఘాలు ఉండడంతో నీటిని పొదుపుగా వాడుకోవడమే కాకుండా వాటి పర్యవేక్షణ కూడా పకడ్బందీగా ఉండేది. గత ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకం పేరుతో చెరువులను అభివద్ధి చేసింది. ప్రస్తుత ప్రభుత్వం నీటి సంఘాల పై దృష్టి సారించాలి.





ఇంకా ఆదేశాలు ఏమీ రాలేదు

: బి వినోద్‌కుమార్, తాసిల్దార్, తొర్రూర్



ప్రభుత్వం నుంచి నీటి సంఘాల ఎన్నికలు నిర్వహించాలని ఎలాంటి ఆదేశాలు రాలేదు. ఆదేశాలు వస్తే తప్పకుండా నిర్వహిస్తాం. ప్రస్తుతం ఈ అంశంలో ప్రభుత్వ ఆదేశాలే అంతిమం.

శివాలయం భూమి కౌలుకు వేలం

దేవాలయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఆర్ సునిత

నవతెలంగాణ-మహబూబాబాద్

మహబూబాబాద్ పట్టణంలోని ఇల్లెందు రహదారిలో ఉన్న శ్రీ పార్వతి రామలింగేశ్వర స్వామి దేవాలయం(శివాలయం) భూమిని మూడు సంవత్సరాలకు కౌలుకు ఇవ్వడానికి ఈనెల 20వ తేదీన దేవాలయం ఆవరణలో టెండర్ కం వేలం నిర్వహిస్తున్నట్లు దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఆర్ సునిత ఈవో బిక్షమాచారి ఒక ప్రకటనలో తెలిపారు. శివాలయం భూమికి సంబంధించి సర్వే నెంబరు 126, 127, 145 నన్ను నాలుగు ఎకరాల 12 గుంటల భూమిని కౌలుకి కి ఇవ్వడానికి వేలంపాట నిర్వహి స్తున్నట్లు తెలిపారు. 20 24 ఆగస్టు 21 నుంచి 20 27 ఆగస్టు 20 తేది వరకు మూడు సంవత్సరాలకు కౌలుకి ఇవ్వనట్లు తెలిపారు. వేలంలో పాల్గొనే వారు పదివేల రూపాయల డిపాజిట్ చెల్లించి పాల్గొనాలని తెలి పారు. పూర్తి వివరాలకు దేవాలయం ఈవో బిక్షమా చారిని సంప్రదించాలని సూచించారు.

చంద్రమౌళీశ్వర స్వామి దేవాలయం షాపుల వేలం

మహబూబాబాద్ పట్టణంలోని స్టేషన్ రోడ్ లో ఉన్న శ్రీ చంద్ర మౌళీశ్వర స్వామి దేవాలయం ఆధీనంలో ఉన్న మూడు షాపుల సముదా యాలను ఈనెల 20వ తేదీన దేవాలయం ఆవరణలో వేలం కం ఫీల్డ్ టెండర్లు నిర్వహిస్తున్నట్లు దేవాలయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఆర్ సునీత ఈవో బిక్షమాచారి ఒక ప్రకటనలో తెలిపారు. వేలం నిర్వహించిన నాటి నుండి రెండు సంవత్సరాలపాటు దుకాణ సముదాయాలు వేలం వేస్తున్నట్లు తెలిపారు. 19వతేదీన టెండర్ పాడాలు దేవస్థానం వద్ద తీసుకోవాలన్నారు.

చాంద్‌బీకి రూ.8 లక్షల రివార్డ్ చెక్కు

నవతెలంగాణ-మహబూబాబాద్

వరంగల్ రూరల్ జిల్లా ఖానాపురం మండలం బుధరావుపేట శివారు మనుబోతుల గడ్డకు చెందిన సీపీఐ(మావోయిస్ట్) పార్టీ సభ్యురాలు షేక్ ఇమాంబీ, అలియాస్ జ్యోతక్కకు సోమవారం ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ ఎనిమిది లక్షల రూపాయల చెక్కు అందజేశారు. సీపీఐ(మావోయిస్ట్) పార్టీ సిద్ధాంతాలతో ప్రభావితురాలు పార్టీలో చేరారని, తిరిగి సాధారణ, ప్రశాంతమైన జీవితాన్ని గడపడానికి 20 24 మార్చి 19న ప్రభుత్వ సరెండర్ కమ్-రిహాబిలిటేషన్ పాలసీలో భాగంగా మహబూబాబాద్ ఎస్పీ కార్యాలయంలో లొంగిపోయారని తెలిపారు. ఈ మేరకు ఇమాంబి పై ఉన్న 8 లక్షల రివార్డ్ చెక్కును మహబూబాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో అందించినట్లు తెలిపారు. ప్రభుత్వం సరెండర్-కమ్-పునరావాస విధా నాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మావోయిస్టు భావజాలంతో భ్రమపడిన వారందరు శాంతియుత జీవితాన్ని గడపడానికి అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని ఎస్పీ తెలిపారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు పెంచాలి

బీసీ హక్కుల సాధన సమితి

జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుగు కుమార్

నవతెలంగాణ-మహబూబాబాద్



బీసీలకు 42శాతం రిజర్వేషన్లు పెంచి స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహించాలి అని బీసీ హక్కుల సాధన సమితి మహబూబాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుగు కుమార్ డిమాండ్ చేశారు. బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముం దు మోకాళ్లపై కూర్చొని నిరసన కలిపి జిల్లా కలెక్టర్ అద్వైత్ సింగ్ కుమార్‌కి వినతి పత్రం అందజేత చేశారు. బీసీ హక్కుల సాధన సమితి మహబూ బాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో నేడు బీసీ హక్కుల సాధన సమితి డిమాండ్స్ డే కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా బీసీ హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుగు కుమార్ మాట్లాడుతూ రానున్న గ్రామపంచాయతీ ఎంపీటీసీ మున్సిపాలిటీ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచి ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. దేశ జనగణనలో బీసీ కులగలనా జరపాలని డిమాండ్ చేశారు. చట్టసభలలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రెండు లక్షల రూపాయల కోట్ల తో బీసీలకు కేంద్ర బడ్జెట్‌లో కేటాయించాలన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని కోరారు యుద్ధ ప్రాతిపదికన రాష్ట్రంలో బీసీ కులగనన జరపాలన్నారు. ఇతర సమస్యలను పరిష్కరించి వారికి న్యాయం చేయాలని కోరారు. లేఆదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిసి నేతలు రేషపల్లి నవీన్ ఆబోతు అశోక్ జలగం ప్రవీణ్ భారత రమేష్ మిర్యాల మల్లికార్జున్, డొనికేని రమేష్, తోట రమేష్, హర్షవర్ధన్, నిధిగొండ సత్యం, గుంటోజు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు వీడుకలు సన్మానం

నవతెలంగాణ-మహబూబాబాద్

పదోన్నతి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు సుమీలా రాణి, భాగ్య మెర్సి, మమతలను ఉపాధ్యాయులు విద్యార్థులు ఘనంగా సన్మానించినట్లు మహబూబాబాద్ మండలం పర్వతీరి గ్రామ శివారు ఎంపీపీ ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పంజాల లింగమూర్తి తెలిపారు. సోమవారం ఏర్పా టు చేసిన సమావేశంలో పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించినట్లు తెలిపారు. బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు విద్యార్థులకు బూట్లు ఫర్నిచర్, బహుమతిగా అందజేశారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గీత, రామాచారి , బానోతు హరినాయక్ , జి రాధిక పాల్గొన్నారు.

స్వతంత్ర ఉద్యమంలో పాల్గొన్న ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నిర్మాణ బాధ్యులు తక్కలపల్లి శ్రీనివాస్

నవతెలంగాణ-భూపాలపల్లి

స్వాతంత్రం మా జన్మ హక్కు అంటూ స్వతంత్ర ఉద్యమంలో పాల్గొన్న ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నిర్మాణ బాధ్యులు తక్కలపల్లి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రం లోని రావినారాయణరెడ్డి భవన్ ఆవరణలో ఏర్పాటుచేసిన ఏఐఎస్ఎఫ్ 89వ ఆవిర్భావ దినోత్సవ జెండాను ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నిర్మాణ బాధ్యతలు తక్కలపల్లి శ్రీనివాసరావు జెండా ఆవిష్కరించి మాట్లాడారు. భారతదేశానికి సంపూర్ణ స్వసంత్రం లక్ష్యంగా విద్యార్థులను చైతన్యం చేసిన విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అన్నారు. స్వతంత్ర ఉద్యమ సమయంలో అక్కడక్కడ ఎవరికి వారుగా పోరాడుతున్న విద్యార్థులను ఏకం చేసి జాతీయ స్థాయిలో ఏర్పడిన తొలి విద్యార్థి సంఘముగా ఏఐఎస్ఎఫ్ నిలిచిందన్నారు. ఈ విద్యార్థి సంఘం నేటికీ 88 సంవత్సరాలు పూర్తి చేసుకుని 89వ సంవత్సరంలో అడుగు పెడుతున్న సంఘం ఏఐఎస్ఎఫ్ అన్నారు. విద్య కాషాయీకరణకు వ్యతిరేకంగా కామన్ విద్యా విధానం కోసం విద్యార్థుల హక్కుల కోసం పోరాడుతోందని అన్నారు. సంక్షేమ హాస్టల్‌లో మెస్ చార్జీలు పెంచాలని అన్నారు. పెండింగ్ స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలని తదిర సమస్యల ప రిష్కారం కోసం ఏఐఎస్ఎఫ్ పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రవీణ్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి నేరెళ్ల జోసఫ్, పోతుల పవన్, ఓద్దులే సాకేత్ రెడ్డి, మహేందర్, రాధిక, చల్లూరి రక్షిత, గోలి లావణ్య, శరణ్య రామ్ చరణ్, రాజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ బోదకాల నివారణ కార్యక్రమం

నవతెలంగాణ-బయ్యారం

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జాతీయ బోదకాల నివారణ కార్యక్రమాలు సోమవారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ, విద్యార్థులకు ప్రభుత్వ వైద్యశాల సిబ్బంది టాబ్లెట్ పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వీరస్వామి, ఎన్ఎస్ఎస్ పిఓ కే. సంతోష్, అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసి తొర్రూరు సీఐ

నవ తెలంగాణ-తొర్రూరు

తొర్రుర్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన కే.జగదీష్ సోమవారం మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ని మర్యాదపూర్వకముగా కలిశారు. సీఐ కె.జగదీష్ రామగుండం కమీషనరేట్‌లో స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించి తొర్రుర్ సీఐగా బదిలీ అయ్యారు. తొర్రూరు పోలీస్ స్టేషన్ బాధ్యతలు స్వీకరించిన సీఐ జగదీష్ మహబూబాబాద్ జిల్లా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు.

భవాని శంకర్ తండాలో వైద్య శిబిరం

నవతెలంగాణ-మహబూబాబాద్

మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డు భవన శంకర్ తండాలో జ్వరాలతో బాధపడుతున్న వారి కోసం సోమవారం వైద్యాధికారులచే వైద్య శిబిరం నిర్వహించినట్లు వైద్య అధికారి రమ్య లతా తెలిపారు. భవాని శంకర్ తండాలో మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ జ్వరాలు, బీపీ షుగర్ ఇతర సమస్యలతో బాధపడుతున్న వారందరికీ టెస్టులు చేసి 30 మంది వరకు మందులు ఇచ్చినట్లు తెలిపారు. దోమల నియంత్రణకు ఫాగింగ్ చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు పద్మావతి, మమత, ఆశా వర్కర్లు, జనని విజయ, సీపీఐపార్టీ ప్రతినిధి బందం రేషపల్లి తరుణ్, మంద అభిలాష్, రేషపల్లి సాయి, బానోతు నరేష్, వంశీ, పాల్గొన్నారు.

'విజయోత్సవ ర్యాలీని విజయవంతం చేయండి'

నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్

నేడు హైదరాబాదులో నిర్వహిస్తున్న ఎస్సీ వర్గీకరణ విజయోత్సవ ర్యాలీని విజయవంతం చేయాలని మాదిగ జర్నలిస్ట్ ఫోరం(ఎంజెఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంతెన సమ్మయ్య పిలుపునిచ్చారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ లక్ష్యంగా మందకష్ణ మాదిగ నేతృత్వంలో ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాలు 30 ఏళ్లు నిర్విరామంగా ఉద్యమించాయని అన్నారు. ఈ క్రమంలో సుప్రీంకోర్టు స్పందించి వర్గీకరణ న్యాయమైందని తీర్పునివ్వడం శుభ పరిణామన్నారు. ఈ సందర్భంగా విజయోత్సాహంతో ఢిల్లీ నుంచి హైదరాబాద్ కు తిరిగి వస్తున్న మందకష్ణ మాదిగకు ఘనంగా స్వాగతం పలుకాలని కోరారు. సమావేశంలో ఎం జె ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎర్రం సతీష్ కుమార్, నాయకులు సంపత్, సుధాకర్, ప్రవీణ్, రవి, రమేష్, చంద్రమౌళి, సజన్, తదితరులు పాల్గొన్నారు.

పీజీహెచ్ఎంకు ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ సన్మానం

నవతెలంగాణ-గూడూరు

మండల కేంద్రంలోని ట్రైబల్ వెల్ఫేర్ బాలికల ఆశ్రమ పాఠశాలకు పీజీ హెచ్ఎంగా పదోన్నతిపై వచ్చిన కే లలిత కుమార్‌ను ఆదివాసి టీచర్స్ అసోసియేషన్స్ మండల శాఖ పక్షాన సోమవారం ఘనంగా సన్మానించారు అసోసియేషన్స్ మండలశాఖ అధ్యక్షులు ముయ్యబోయిన వెంకన్న, ఉపాధ్యక్షులు చుంచ లక్ష్మయ్య ప్రధాన కార్యదర్శి మేడ వెంకన్న, ప్రచార కార్యదర్శి కొట్టెం రవీందర్, ధనుసరి రమేష్, మోకాళ్ళ వెంకన్న, చుంచ బాలయ్యమోకాళ్ళ వెంకటేశ్వరరావు, వజ్జ కృష్ణయ్య, బిజ్జ సృజన్ రావు, అమృత దేవి , అల్లెం యశోద, మేడ వినోద ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోటగుళ్లలో ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-గణపురం

కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్ళ లో శ్రావణ సోమవారం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం గణపతి పూజతో అర్చకులు నాగరాజు కార్యక్రమాలు ప్రారంభించారు. అనంతరం స్వామివారికి రుద్రాభిషేకం నందీశ్వర అభిషేకం నిర్వహించారు. మహిళలు నాగేంద్ర స్వామి పుట్ట వద్ద పంచామతాలతో అభిషేకం నిర్వహించి పుట్టలో పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. అభిషేకం అనంతరం స్వామివారిని పట్టు వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం అర్చకులు జూలపల్లి నాగరాజు తీర్థప్రసాదాలను ప్రజలకు అందజేసారు.

రూ.2.50 లక్షల ఎల్ఓసీ అందజేత

నవతెలంగాణ-మల్హర్‌రావు

మంథని నియోజకవర్గంలో అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేద బాధిత కుటుంబాలకు తెలంగాణ రాష్ట్ర ఐటి,పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పలువురికి అండగా నిలుస్తున్నారు. అనారోగ్యంతో బాధపడుతూ వైద్యం చేయించుకోలేని పరిస్థితుల్లో ఉన్న పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఎల్ఓసిలు ఇప్పిస్తూ పేదలకు భరోసా కల్పిస్తున్నారు. ఈ క్రమంలో మండలంలోని వళ్లెంకుంట గ్రామానికి చెందిన గడ్డం హర్షన్ అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని ఆయన కుటుంబ సభ్యులు మంత్రి దష్టికి తీసుకపోయారు.వెంటనే దుద్దిళ్ల స్పందించి వైద్య ఖర్చుల కోసం సిఎంఎఫ్ఆర్ ద్వారా రూ.2.50 లక్షల ఎల్ఓసిని మంజూరు చేయించి మంత్రి ఆసుపత్రి సహాయకుడి ద్వారా హైదరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం అందజేశారు.ఇందుకు బాధితురాలు కుటుంబం మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

'వైద్య శిబిరం ఏర్పాటు చేయాలి'

నవతెలంగాణ-చిట్యాల

సీజనల్ వ్యాధుల్ని అరికట్టేందుకు గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని సీపీఐ(ఎంఎల్) జిల్లా కార్యదర్శి మారపెల్లి మల్లేష్ కోరారు. సోమవారం స్థానిక తహసీల్దార్ హేమకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 25 గ్రామపంచాయతీలు ఆమ్లెట్ పల్లెల్లో మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని అన్నారు. అన్నీ గ్రామల లో సీజన్ వ్యాధులు ప్రబలకుండా వ్యాధులను అరికట్టేటందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సీపీఐఎంఎల్ మండల కార్యదర్శి పర్లపెల్లి శ్రీకాంత్, నాయకులు శాంతినగర్ కార్యదర్శి బోడ అరేందర్, ఏఐఎస్ఏ విద్యార్థి సంఘ నియోజకవర్గ ఇన్‌చార్జి చేరిపెల్లి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

తాడిచెర్ల కళాశాలలో 'నషా ముక్త్ భారత్ ' ప్రతిజ్ఞ

నవతెలంగాణ-మల్హర్ రావు

మండల కేంద్రమైన తాడిచెర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ విజయదేవి ఆదేశాల మేరకు సోమవారం మాదక ద్రవ్య రహిత భారత్ ప్రచారంలో భాగంగా ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులచే "నషా ముక్త్ భారత్" ప్రతిజ్ఞ చేయించడం జరిగిందని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి రవిందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు దేశానికైనా యువతే శక్తి సమాజమని, దేశాభివద్ధిలో యువత పాత్ర కీలకమని,కావున యువత మదకద్రవ్యాలను పూర్తిగా నిషేధించాలన్నారు. ఈ సందర్భంగా అధ్యాపకులు విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు నరేందర్ ప్రవీణ్ వెంకటరెడ్డి కరుణాకర్ స్వరూప రాణి నరేష్ రమేష్ భరత్ రెడ్డి, జైపాల్ రవి, కళాశాల సిబ్బంది రాములు రవి షబ్బీర్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అండగా ఉంటుంది

మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మదుకర్

నవతెలంగాణ-మల్హర్‌రావు

అధైర్య పడొద్దు బీఆర్ఎస్ అన్నివిధాలా అండగా ఉంటుందని మంథని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ మంథని నియోజకవర్గ ఇంచార్జి పుట్ట మదుకర్ అన్నారు. మండలంలోని కొయ్యుర్ గ్రామానికి చెందిన చెలిమేల వెంకట్ రెడ్డి విద్యుత్ షాక్‌తో, తాడిచెర్ల గ్రామానికి చెందిన మేనం సమ్మక్క ఇటీవల అనారోగ్యంతో చనిపోయారు. సోమవారం బాధితుల కుటుంబాలను ఆయన పరమార్శించి, అధైర్య పడొద్దని, అన్నివిధాలా అండగా ఉంటామని అన్నారు. అనంతరం మతుల చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి గొనె శ్రీనివాసరావు, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాఘవ రెడ్డి, యూత్ అధ్యక్షుడు జాగరి హరీష్, నాయకులు రాజేశ్వర్ రావు, మేనం బాపు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవానికి ఈటెల..

ఆహ్వానించిన బీఎంఎస్ నాయకులు

నవతెలంగాణ-కోల్ బెల్ట్

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ (బి ఎం ఎస్) కార్యాలయ ప్రారంభోత్సవానికి ఆ సంఘం అధ్యక్షులు యాదగిరి సత్తయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ అప్పాని శ్రీనివాస్ లు సోమవారం మల్కాజ్ గిరి ఎంపీ ఈటెల రాజేందర్ ను ఆహ్వానించారు. ఈ నెల 18 ఆదివారం రోజున కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమం ఉంటుందని బి ఎం ఎస్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రవీందర్ కేంద్ర కార్యదర్శి, ఉపాధ్యక్షులు కర్రావుల మహేష్, భూపాలపల్లి ఏరియా ఉపాధ్యక్షులు వేలబోయిన సుజేందర్, కార్యదర్శి ఒణికుంట్ల మల్లేష్,బర్ల నారాయణ, రాజన్న పాల్గొన్నారు.

అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధం

నవతెలంగాణ-శాయంపేట

భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి హయాంలో శాయంపేట మండలం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందిందని, జరిగిన అభివృద్ధిపై శాయంపేట ప్రయాణ ప్రాంగణంలో బహిరంగ చర్చకు సిద్ధమని మైలారం మాజీ సర్పంచ్ అరికిళ్ళ ప్రసాద్ కాంగ్రెస్ నాయకులకు సవాలు విసిరారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాం గ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి 8 నెలల కాలంలో భూపాలపల్లి నియోజక వర్గంలో జరిగిన అభివృద్ధి శూన్యమన్నారు. ఆగస్టు 15లోపు రూ.2లక్షల రుణ మాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించిందని ఎంతమందికి రుణమాఫీ చేశారని చెప్పాలన్నారు. రుణమాఫీ పొందని రైతులే అధిక సంఖ్యలో ఉన్నట్లు తెలిపా రు.

ఈ సమావేశంలో పరకాల ఏఎంసి వైస్ చైర్మన్ మారపల్లి నందం, బీఆర్ఎస్‌వీ రాష్ట్ర నాయకులు కొమ్ముల శివ, గ్రామశాఖ అధ్యక్షుడు గాజే రాజేందర్, నాయకులు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

లేబర్‌కార్డుల పేరుతో అక్రమ దందా

నవతెలంగాణ-శాయంపేట

మండలానికి చెందిన కొందరు ప్రైవేట్ వ్యక్తులు కేంద్ర ప్రభుత్వం ద్వారా జారీ చేయబడే లేబర్‌కార్డులను లేబర్ కార్డు జారీ కావడానికి అయ్యే రుసుము కంటే ఎక్కువ మొత్తంలో వసూలుచేస్తూ లేబర్‌కార్డుల పేరుతో అక్రమ దందా చేస్తున్నారని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి నరహరిశెట్టి రామకృష్ణ ఆరో పించారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడుతూ ఇలాంటి సంఘటనలు మరొకసారి పు నరా వృతంకాకుండా చూడాలని, ఏఎల్‌ఓ కార్యాలయానికి సంబంధించిన ఉ న్న తాధికారులు దర్యాప్తు చేసి ఇలాంటి వసూళ్లను చేసిన వ్యక్తులు, వీరికి సహక రిస్తున్న అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఉప్పు రాజు, కొత్తపల్లి శ్రీకాంత్, బాసాని విద్యాసాగర్, అనుమండ్ల రమేష్, మేకల సుమన్ తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీలు ఐక్యంగా ముందుకు సాగాలి

నవతెలంగాణ-ఆత్మకూరు

పద్మశాలీలు సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ముందుకు సాగాలని మండల పద్మశాలి అధ్యక్షుడు వెల్దే వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఆత్మకూరు మండలంలోని పద్మశాలి మండల కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 18న జరగబోయే రాష్ట్ర పద్మశాలీ అధ్యక్ష పదవి కోసం జరిగే ఎన్నికల గురించి మండల పద్మశాలి అధ్యక్షుడు వెల్దే వెంకటేశ్వర్ల ఆధ్వర్యంలో పద్మశాలీ భవనంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్మశాలీలు ఈనెల 18న జరగబోయే ఎన్నికలలో పాల్గొని ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పద్మ శాలీ జిల్లా జెయింట్ సెక్రెటరీ ఇరసడ్ల సదానందం, మండల కమిటీ ఉపాధ్యక్షులు పాపని రవి, కాట బత్తి రాజమౌళి, మండల కోశాధికారి వడ్డేపల్లి ప్రసాద్, మాజీ మండల అధ్యక్షుడు వెల్దే సదానందం, గ్రామ కమిటీ అధ్యక్షుడు వడ్డేపల్లి వేణు, గ్రామ కార్యదర్శి మార్త కేదారి, యూత్ అధ్యక్షుడు మార్త రంజిత్ కుమార్, యూత్ కోశాధికారి అలువాల రవి,పద్మశాలి మండల పంచాయతీ కమిటీ అధ్యక్షుడు బూర రాజేందర్, చిమ్మని బిక్షపతి, ముంద్రాతి శీను, వెంకటేశ్వర్లు,బలబద్ర సదానందం, బలబద్ర సంజయ్, వెళ్లే సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-శాయంపేట

మండల కేంద్రంలోని 31 డిబి ఎం ఎస్సారెస్పీ కాలువను ఆక్రమిం చిన కబ్జాదారులపై చర్యలు తీసుకో వాలని ఏబీఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు నాగుల పవన్ కళ్యాణ్ సోమవారం గ్రీవెన్స్ సెల్ జిల్లా కలెక్టర్ ప్రావీణ్యకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ ఎస్సారెస్పీ కాలువ కబ్జాదారులకు అధికారులు వత్తాసు పలుకుతున్నారని, నోటీసులు అందజేసిన కూడా వారిపైన చర్యలు తీసుకోకుండా ఉండడంపై ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఎస్సారెస్పీ కాలువ ద్వారా రైతులకు సాగునీరు అందేలా చూడాలని నవీన్, వంశీ, ప్రేమ్‌లతో కలిసి కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు.

ఎమ్మెల్యే నాగరాజును కలిసిన గణపతిరెడ్డి



నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

సోమవారం హనుమకొండ రాష్ట్ర రైస్ మిల్లు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పాడి గణపతి రెడ్డి వర్ధన్నపేట ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్.నాగరాజు బొకే ఇచ్చి మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది.ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ వీసం సురేందర్ రెడ్డి, మండల అధ్యక్షులు పోరెడ్డి మహేందర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు కనపర్తి కిరణ్, అనిల్, రాజు, రైస్ మిల్లు అసోసియేషన్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలకు సన్మానం



నవతెలంగాణ-నడికూడ

పరకాల ఎస్బిఐ ఏడిపి బ్యాంక్ మేనేజర్ సేరి సతీష్ ఆధ్వర్యంలో పరకాల పట్టణం, నడికూడ మండల కేంద్రంతోపాటు కౌకొండ గ్రామాలాకు చెందిన స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలను ఘనంగా సన్మానించారు. బ్యాంకు మేనేజర్ సతీష్ మాట్లాడుతూ 78వ స్వతంత్ర దినోత్సవం సందర్భంగా దేశ స్వతంత్రం కోసం పోరాడిన సమరయోధులను వారి కుటుంబాలను కలుసుకోవడం సంతోషంగా ఉందని వారిని సన్మానించడం ఒక గొప్ప అవకాశంగా భావిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ నుండి పెన్షన్ సెల్ అధికారి శంకర్, పి.నారాయణ రావు, కమ్యూనికేషన్ టి.రాజేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువత సన్మార్గంలో పయనించాలి

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య



నవతెలంగాణ-స్టేషన్ ఘన్‌పూర్

యువత సన్మార్గంలో పయనించాలని రాష్ట్ర తొలిఉపముఖ్యమంత్రి, మాజీ ఎమ్మెల్యే డా తాటికొండ రాజయ్య తెలిపారు. సోమవారం అంతర్జాతీయ యువ దినోత్సవ సంధర్భంగా యువతకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. శాంతి, పరస్పర గౌరవం, సమాజం పట్ల బాధ్యతను యువత పెంపొందించుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-కొడకండ్ల



మండలంలోని మొండ్రాయి గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త తండా సోమయ్య అనారోగ్యానికి గురై మృతి చెందగా సోమవారం పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ఇన్చార్జి ఝాన్సీ రెడ్డి ఆదేశాల మేరకు మండల పార్టీ అధ్యక్షుడు ధారావత్ సురేష్ నాయక్ భౌతికకాయంపై పూలమాల వేసి నివాళులర్పించి ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు మచ్చ మల్లేష్ కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మద్యంసేవించి వాహనం నడిపిన వ్యక్తి సమాజసేవ శిక్ష

నవతెలంగాణ-వేలేరు



ఫుల్ గా మద్యం సేవించి ద్విచక్ర వాహనం నడిపిన వ్యక్తి పోలీసులకు చిక్కడంతో ఒక రోజు సమాజసేవ చేయాల్సిందిగా కోర్టు తీర్పునిచ్చింది. వివరాల్లోకి వెళితే రాజవరం ప్రాంతానికి చెందిన బాబీ శుక్రవారం మద్యం సేవించి ద్విచక్ర వాహనంపైతిరిగి వస్తుండగా ఎస్ఐ సురేష్ పోలీసు బృందం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో వాహనదారుడు బాబీను పరీక్షించగా వాహనదారుడు పెద్దస్థాయిలో మద్యం సేవించినట్లుగా నిర్ధారణ జరిగింది .సదరు మద్యం సేవించిన వాహనదారున్ని సోమవారం రెండవ తరగతి కోర్టు న్యాయమూర్తి ఎదుట పోలీసులు హాజరు పర్చారచగా వాహన దారుడు సేవించిన మద్యం మోతాదును పరిశీలించిన న్యాయమూర్తి ఎక్కువ మొత్తం లో మద్యం సేవించి వాహనం నడపడాన్ని నేరంగా పరిగణిస్తూ బాబీ ఒక రోజు సమాజసేవ చేయాల్సిందిగా తీర్పు ఇచ్చారు. తీర్పును అనుసరించి స్థానిక వేలేరు తహశీల్దార్ కోమీ ఎదుట హాజరు పరచడంతో సదరు నిందితుడు తాసిల్దార్ పరిసరా లను శుభ్రం చేయాల్సిందిగాఉత్తర్వులు జారీచేయడంతో పిచ్చి మొక్కలు, గడ్డిని తొలగించి శిక్షను పూర్తి చేసాడు.

జర్నలిస్టు యోగిరెడ్డి కుటుంబానికి వైద్యుడి చేయూత



నవతెలంగాణ-హనుమకొండ

దివంగత జర్నలిస్ట్ యోగిరెడ్డి కుటుంబానికి చక్రవర్తి హస్పిటల్ ఎండీ డాక్టర్ వరుణ్ కుమార్‌రెడ్డి బాసటగా నిలిచారు. సోమవారం బాలసముద్రం లోని ప్రెస్‌క్లబ్‌లో యోగి కుటుంబానికి రూ.50వేల ఆర్థిక సహాయాన్ని ప్రెస్‌క్లబ్ బాధ్యులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగిరెడ్డి కుటుంబానికి అండగా నిలవటం తన బాధ్యతగా భావించానన్నారు.

ఈ సందర్భంగా డాక్టర్ వరుణ్ రెడ్డిని జర్నలిస్టులు అభినందించారు. అభ్యుదయవాదుల ఐక్యవేదిక ప్రతినిధులు సైతం తమవంతు సాయంగా రూ.5వేలు అందించారు. సహాయం అందించే దాతలు ప్రెస్‌క్లబ్ బాధ్యులను సంప్రదించాలని కోరారు. ఆపద సమయంలో అండగా నిలిచిన వారికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బోల్ల అమర్, ఉపాధ్యక్షులు గోకారపు శ్యాం, బొడిగె శ్రీను, కొడిపల్లి దుర్గాప్రసాద్, అల్లం రాజేష్ వర్మ, యంసాని శ్రీనివాస్, జాయింట్ సెక్రెటరీలు సంపెట సుధాకర్, పెద్దపల్లి వరప్రసాద్, వలిశెట్టి సుధాకర్, బూర్ల నరేందర్, పెడిచెట్టి విష్ణువర్ధన్, కార్యవర్గసభ్యులు హరీష్, శ్రీకాంత్, నయీంపాషా, వేణుగోపాల్, దిలీప్, సంజీవ్, రాజు, విజయ్‌రాజ్, యూనియన్ల నాయకులు గాడిపెల్లి మధు, టీవీ రాజు తదితరులు పాల్గొన్నారు.

పింగిళి కళాశాలలో అంతర్జాతీయ యువజన దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-నయీంనగర్



యువత విదేశాల మీద మోజు వదిలి స్వదేశ అభివృద్ధికి తోడ్పడాలని లెఫ్టినెంట్ బి.చంద్రమౌళి కోరారు. హన్మకొండ పింగిళి ప్రభుత్వ మహిళా కళాశాలలో అంతర్జాతీయ యువజన దినోత్సవం వేడుకలు ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్, లెఫ్టినెంట్ బి.చంద్రమౌళి మాట్లాడుతూ యువతే దేశ భవిత అని, యువత విదేశీ మోజు వదిలి, స్వదేశాన్ని అభివృద్ధి చెందినదేశంగా రూపొందించాలని యువతకు నిర్దేశించారు. కార్యక్రమ నిర్వాహకులు ఆంగ్ల విభాగ అధిపతి డాక్టర్ ఆవుల మీనాక్షి అంతర్జాతీయ యువజన ప్రాశస్త్యాన్ని విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో విజేతలైన దీక్షిత, వినీల, సమీనా, ఆర్షిన్లకు పోటీలో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆంగ్ల విభాగ బోధన సిబ్బంది పీడి సుజాత, డాక్టర్ బి.సువర్ణ, జి.హెప్సిబా, టి.రమేష్ కుమార్, పి.రామ్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు

కాకతీయ యూనివర్శిటీలో ఎన్‌సీసీ క్యాడెట్‌లకు శిక్షణ

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా



కాకతీయ విశ్వవిద్యాలయంలో ఎన్‌సీసీ 10వ తెలంగాణ బెటాలియన్ ఆధ్వర్యంలో 10రోజుల సిఎటిసి 10 పదిరోజుల క్యాంప్ జరుగుతున్నట్లు కమాండెంట్ కల్నల్ ఎస్ఎస్.రమదురై తెలిపారు. ఈ క్యాంపు ఈనెల 5 నుండి 14 వరకు కొనసాగుతుండగా సోమవారం 8వ రోజు ఎన్సిసి క్యాడెట్‌లు ఆర్మీ విన్యాసాలను నిర్వహించారు. యుద్ధభూమిలో శత్రువులను మట్టుపెడుతూ విజయం సాధించే మెలకువలను, కఠినమైన అడ్డంకులను ఎలా అధిగమించాలో ఈ విన్యాసాల ద్వారా యూనివర్సిటీ క్రీడా మైదానంలో యుద్ధ భూమిని తలపరిచే విధంగా శిక్షణ ఇచ్చారు. సాయంత్రం జరిగిన కార్యక్రమంలో భారత ఆర్మీలో ఉద్యోగ అవకాశాలు, యువత భవిష్యత్తు, దేశసేవకు సిద్ధంగా ఎలా ఉండాలో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ రవి సుణరాయ్, కెప్టెన్ డాక్టర్ పి.సతీష్ కుమార్, కెప్టెన్ డాక్టర్ ఎం. సదానందం, సుబేదారి మేజర్ సుహాస్కధం, లెఫ్టినెంట్ గణేష్, సెకండ్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్, కెప్టెన్ డాక్టర్ సబిత, ఫస్ట్ ఆఫీసర్ బాలు రెడ్డి, థర్డ్ ఆఫీసర్ శాంతి, జిసిఐ సుజిత, సీతలూ, సూపరింటెంట్ అరుణ, కుమారస్వామి, సతీష్, మహేష్, ఏడుకొండలు, సౌరస్య, జెసిఓ, బిహెచ్ఎం, జెసిఓ ఖదం, 580 మంది క్యాడేట్స్ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్‌లు రికవరీ చేసిన కేయూ పోలీసులు



నవతెలంగాణ-నయీంనగర్

కేయూసీ పోలీస్ స్టేషన్ పరిధిలో నివసిస్తున్న వివిధ వ్యక్తులు పోగొట్టుకున్న 19 సెల్ ఫోన్లు ట్రేస్ చేసి బాధితులకు అప్పగించడం జరిగిందని ఇన్స్పెక్టర్ సంజీవ్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరంగల్ పోలీస్ కమిషనరేట్ కేయూసీ పోలీస్ స్టేషన్ పరిధిలో సెల్ ఫోన్ యజమానులు పోగొట్టుకున్న సెల్ ఫోన్ల వివరాలు వెంటన సిఈఐఆర్ పోర్టల్ బ్లాక్ చేసి కేయుసి పోలీసుస్టేషన్‌లో సమాచారం ఇవ్వాగా, వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు మేరకు సోమవారం 19-సెల్ ఫోన్లు సిసిఎస్ వారి సహకారము తో ట్రేస్ చేసి సంబంధిత సెల్‌ఫోన్ యజమానులకు అప్పగించడం జరిగిందని, పోగొట్టుకున్న సెల్ ఫోన్స్ తిరిగి లభించడంతో వాటి యాజమానులు వరంగల్ పోలీస్ కమీషనర్‌కు హృదయ పూర్వక ధన్యవాదములు తెలిపినారు అన్నారు. పోలీస్ శాఖ ఎప్పుడు ప్రజల పక్షాన పని చేస్తుందని ,ఎపుడు ఎవరికీ ఏ సమయంలో ఎలాంటి అవసరం ఉన్న పోలీస్ వారిని సంప్రదించమని ,ఉన్నతధికారుల ఆదేశాలను శిరసావహిస్తు ప్రజల మన్ననలు పొందేవిధంగా విధులు నిర్వహిస్తామని అన్నారు.

ఈ కార్యక్రమంలో కేయూ పోలీస్ సెల్ఫోన్ బాధితులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎర్రబెల్లి పరామర్శ



నవతెలంగాణ-దేవరుప్పుల

మండలంలోని బీఆర్‌ఎస్‌పార్టీ కుటుంబ సభ్యులు ఆక్సిడెంట్ లో గాయపడగా, అనారోగ్యంతో చనిపోయిన తరుణంలో వారి కుటుంబ సభ్యులను సోమవారం మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్ పరామర్శించారు .అందులో భాగంగా సింగరాజుపల్లిలో మేకపోతుల నర్సింహులు భార్య ప్రమాదంలో గాయపడగా వారిని,పెద్దమడుర్‌లో మూటకొండుర్ శ్రీనివాస్ శర్మ ఇటీవల గుండె పోటుతో చనిపోగా వారి కుటుంబాన్ని ,సీతారాంపురం గ్రామసినియర్ నాయకులు బాషిపాక కొండయ్య భార్య స్వప్న అనారోగ్యంతో చనిపోయారు వారి కుటుంబాన్ని , మండల కేంద్రంలో పత్రిక విలేకరి ఉడుగు సందీప్ నానమ్మ ఉడుగు ముత్తమ్మ మృతిచెందగా వారి కుటుంబాన్ని ,పెద్ది వెంకన్న తల్లి పెద్ది లచ్చమ్మ చనిపోగా వారి కుటుంబాన్ని పరామర్శించారు.

ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు తీగలదయాకర్,జిల్లా నాయకులు పల్లా సుందర్ రాం రెడ్డి,మాజీ ఎంపీపీ బస్వ సావిత్రి మల్లేశం,వర్కింగ్ ప్రెసిడెంట్ దరావత్.రాంసింగ్ నాయక్,మండల పార్టీ ప్రధాన కార్యదర్శి చింత రవి,సీనియర్ నాయకులు ఇదునూరి.నర్సింహారెడ్డి కోతి ప్రవీణ్,కారుపోతుల భిక్షపతి,ఏల సుందర్,పానుగంటి క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు .

వివాహ వేడుకల్లో మాజీ మంత్రి

నవతెలంగాణ-కొడకండ్ల

మొండ్రాయి గ్రామానికి చెందిన మాజీ జీసిసి చైర్మన్ గాంధీ నాయక్ కుమారుడు రాహుల్ గాంధీ నాయక్ వివాహ వేడుకల్లో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రామోజీ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాము రాజరెడ్డి ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతులేని వెంచర్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు

నవతెలంగాణ-దేవరుప్పుల

మండలంలోని నీర్మాల గ్రామంలోని గత రెండు సంవత్సరాల క్రితం వెంచర్ పనులు కొనసాగుతున్నాయి .సర్వేనెంబర్ 3,6,8,22,23,24,30,31,32,44 గల భూమి 16 ఎకరాల భూమిలో సగటు మూడెకరాలే నాలా చేసి అధికారులను తప్పు దోవ పట్టిస్తున్నారని గ్రామస్తులు ప్రజావాణిలో సోమవారం పిర్యాదు చేశారు .ఈ సందర్భంగా వారు మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ లేఔట్‌లో మొత్తం గ్రామపంచాయతీకి ఎకరం ఇరవై నాలుగు గుంటలు భూమి రావాల్సి ఉందని అట్టి భూమిని గ్రామపంచాయతీకి రిజిస్ట్రేషన్ చేసి అనుమతులు తీసుకోవాలని అధికారులు చెప్పిన నిర్వాహకులు పాట్లను విక్రయిస్తున్నారని అధికారులను పక్కదారి పట్టించి ఇష్టారాజ్యంగా వ్యాపారం నడుపుకుంటున్నారని ఈ విషయం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలోని సింగారపు రమేష్, చింతల రవీందర్ రెడ్డి, పయ్యం లా బిక్షపతి, కాసర్ల మాధవరెడ్డి, నల్ల నరేందర్, వడ్లకొండ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ ఎన్నికలకు అధికార పార్టీ శ్రేణుల తహతహ

రిజర్వేషన్లు యధాతథం-కాంగ్రెస్‌లో విపరీతమైన పోటీ

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

దాదాపు దశాబ్ద కాలానికి పైగా ఎలాంటి పదవులు లేకుండా ఉన్న కాంగ్రెస్‌లోని కిందిస్థాయి నాయకులు, కార్యకర్తలు సర్పంచ్ ఎన్నికల కోసం తహతహలాడుతున్నారు. ఎప్పుడెప్పుడు ఎన్నికలు నిర్వహిస్తారా రంగంలో దిగుదామా అనుకుంటూ సర్వహంగులను సిద్ధం చేసుకుంటున్నారు. అధికార కాంగ్రెస్ పార్టీలో గ్రామస్థాయిలో ఏకైక ఉన్నత పదమైన సర్పంచ్ కోసం విపరీతమైన పోటీ ఏర్పడుతుంది. ద్వితీయ శ్రేణి నాయకులు, పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనే శ్రేణులు సర్పంచులుగా పోటీ చేసేందుకు ఉవ్విళ్ళూరుతున్నారు. రిజర్వేషన్ లు యథాతథంగా గతంలో మాదిరిగానే కొనసాగుతాయని చెబుతుండడంతో ఒకింత నిరాశ పడ్డప్పటికీ ఆ రిజర్వేషన్ సామాజిక వర్గానికి చెందిన వారిలో ఇంతో అంతో ఆర్థికంగా కలిగిన వారు మాత్రం తమకు అందుబాటులో ఉన్న వనరులను సమకూర్చుకుంటున్నారు. నాయకులను కలుసుకొని అవకాశం కల్పించాలని కోరుతున్నారు. వచ్చే ఆగస్టులోనే సర్పంచ్ ఎన్నికలు ఉంటాయంటూ వార్తలు వెలువడుతున్న నేపథ్యంలో గ్రామాల్లో రాజకీయ సందడి ప్రారంభమైంది. ముఖ్యంగా అధికార పార్టీలో నాయకులు, కార్యకర్తలు ఆ దిశలో చురుకుగా ముందుకు కదులుతున్నారు. జనగామ జిల్లాలో గతంలో అంతటా బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులే ఉంటుండేవారు. గత సంవత్సరం నిర్వహించిన శాసనసభ ఎన్నికల్లో పాలకుర్తి మినహా స్టేషన్ ఘన్‌పూర్, జనగామను బిఆర్ఎస్ అభ్యర్థులు కైవసం చేసుకున్నారు. పాలకుర్తిలో మాత్రం కాంగ్రెస్ అభ్యర్థి యశస్విని రెడ్డి గెలిచారు. ఆ తర్వాత జరిగిన రాజకీయ పరిణామాలు నేపథ్యంలో స్టేషన్ ఘనపూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. ఆయన వెంట అధికార పార్టీలో భారీగానే చేరికలు కొనసాగాయి. జనగామ నియోజకవర్గంలో కూడా బిఆర్ఎస్‌లో కీలకపదవులు అనుభవించిన వారంతా ఇటీవలనే కాంగ్రెస్ పార్టీ బాట పట్టారు. దీంతో జిల్లా అంతటా కాంగ్రెస్ గాలే వీస్తోంది. అప్పటికి కొన్ని దశాబ్దాలుగా పార్టీని నమ్ముకొని ఉన్న ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలతో పాటు ఇటీవల బిఆర్ఎస్ తదితర పార్టీల నుండి వలస వచ్చిన వారికి ఏ విధంగా అవకాశం కల్పిస్తారోనని ప్రజలు ఆసక్తిగా గమనిస్తున్నారు. జనగామ నుండే మాజీ శాసనసభ్యులు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షులుగా కొనసాగుతున్నారు. పార్టీని నమ్ముకొని ఉన్న వారిని, వలస వచ్చిన వారిని సమన్వయం చేయాల్సిన బాధ్యత ఆయన పైనే ఉంది.

పీఏసీఎస్ డైరెక్టర్ పెద్దికి ఎమ్మెల్యే పరామర్శ

నవతెలంగాణ-దేవరుప్పుల

పిఏసిఎస్ డైరెక్టర్ పెద్ది కష్టమూర్తి గౌడ్ తల్లి పెద్ది లచ్చుమ్మ(80) ఆదివారం మృతిచెందగా విషయం తెలిసిన ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి ఆమెరికా నుంచి పెద్ది కృష్ణమూర్తి గౌడ్‌కు ఫోన్ చేసి చరవాణిలో వారిని పరామర్శించారు.

కార్మిక సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమిస్తాం

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు టీ.ఉప్పలయ్య



నవతెలంగాణ-ఎన్జీవోస్ కాలనీ

నగర మున్సిపల్ కమిషనర్ హామీ ప్రకారం కార్మికుల స్థానిక సమస్యలు పరిష్కరించకుంటే ఆగస్ట్ 20 తరువాత సిఐటియు ఇతర కార్మిక సంఘాలతో కలిసి ఉద్యమిస్తాం అవసరమైతే సమ్మె చేస్తాం అని జిల్లా అధ్యక్షులు ఉప్పలయ్య హెచ్చరించారు. సోమవారం కాజీపేట మండలం మడికొండలోని పద్మశాలి భవన్లో సిఐటియు కాజిపేట్ మున్సిపల్ యూనియన్ మండల కమిటి సమావేశం మండల అధ్యక్షులు రొంటాల కోటేశ్వర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా టి,ఉప్పలయ్య హాజరై మాట్లాడుతూ ప్రతీ నెల 5వ తారీకు వరకే కార్మికులకి వేతనాలు ఇవ్వాలని, రెయిన్‌కోట్, పిపి కిట్లు, యూనిఫామ్స్, చెప్పులు ఇవ్వాలని, వాహనాల రిపేర్స్ చేయాలని, చనిపోయిన కార్మికుని స్థానంలో రీప్లేస్ చేయడానికి వెంటనే కమిటి సమావేశం ఏర్పాటు చేయాలని, జవాన్లకి రూ.19500లు, 452 మంది కార్మికులకి రూ.16600లు ఇవ్వాలని, ఆదివారాలు పని పెట్టవద్దనే డిమాండ్‌లను కమిషనర్ దష్టికి తీసుకువచ్చి 15 రోజులు గడుస్తున్నా ఇంత వరకు పరిష్కారం కాలేదని విమర్శించారు. ఇప్పటికైనా వెంటనే పరిష్కరించకుంటే ఆగస్టు 20 తరువాత ఎప్పుడైనా పోరాటాలకి, సమ్మెకైనా వెనకాడం అని, దానికి అధికారులే భాద్యత వహించాలని హెచ్చరించారు. ఈ సమావేశములో జిల్లా అధ్యక్షులు బరుపట్ల మహేష్ , మండల కార్యదర్శి ఎర్ర నరేష్, మల్లయ్య, వెంకటస్వామి, మైదం కుమారు, సుశీల్, రేణుక, సువర్ణ, శ్రీను, శివ, కమిటి సభ్యులు హాజరయ్యారు.

రోడ్డు ప్రమాదంలో సీఐ దంపతులకు గాయాలు

నవతెలంగాణ-పాలకుర్తి

రోడ్డు ప్రమాదంలో పాలకుర్తి సీఐ గట్ల మహేందర్ రెడ్డి దంపతులకు తీవ్రంగా గాయాలైన సంఘటన ఆదివారం రాత్రి సూర్యాపేట జిల్లా అర్వపల్లిలో చోటుచేసుకుంది. సోమవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పాలకుర్తి సిఐ గట్ల మహేందర్ రెడ్డి దంపతులు సూర్యాపేటలోని బంధువుల ఇంటికి శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి ప్రమాదానికి గురికావడంతో సీఐ మహేందర్ రెడ్డి కి భుజంపైన ఎముక విరగడంతో పాటు పక్కటెముకలు విరిగాయని తెలిపారు. సీఐ సతీమణికి కాలు విరిగిందని స్థానికుల సహాయంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. రోడ్డు ప్రమాదంలో సిఐ దంపతులు తీవ్రంగా గాయపడటంతో పాలకుర్తి కొడకండ్ల దేవరుప్పుల ఎస్ఐలు మోడం సాయి ప్రసన్న కుమార్, ఎం లింగారెడ్డి, బండి శ్రావణ్ కుమార్, సజన తోపాటు పోలీస్ సిబ్బంది సీఐ దంపతులను పరామర్శించారు.

ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

నవతెలంగాణ-స్టేషన్‌ఘన్‌పూర్

సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులను క్రమబద్దీకరించాలని కోరుతూ ఇటీవల మరణించిన సమగ్ర శిక్ష ఉద్యోగులకు సోమవారం నియోజక వర్గ కేంద్రంలో ఎమ్మార్సీ కార్యాలయ ఎదుట భోజన విరామ సమయంలో నివాళులు అర్పించారు. అనంతరం రాష్ట్ర మండల విద్యా వనరుల కంప్యూటర్ ఆపరేటర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోరంతల యాదగిరి విలేకరులతో మాట్లాడుతూ తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వివిధ హోదాల్లో 21వేలకు పైగా ఉద్యోగులు 15 ఏండ్లుగా పనిచేస్తున్నామని, విద్యాశాఖలో కీలకంగా ఉంటూ రాష్ట్రంలో విద్యాభివద్ధికి తమవంతు కషి చేస్తున్న తమను గుర్తించక పోవడం బాధాకరమన్నారు. మెరిట్, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికై ఉద్యోగ భద్రతకు అర్హత కలిగి ఉన్నా తమపై చులకన భావం ఎందుకని ప్రశ్నించారు. అన్ని రకాల అర్హతలు ఉన్నప్పటికీ తమకు ఉద్యోగభద్రత కరువైందని ఆవేదన వ్యక్తంచేశారు. ఇతర రాష్ట్రాల్లో క్రమబద్ధీకరణ జరిగిందని, కేవలం తెలంగాణలోనే క్రమబద్ధీకరణ జరగలేదని వాపోయారు. కనీస వేతన స్కేలు అమలు, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విధులు నిర్వర్తిస్తున్న వారామంతా నిరుపేద, దిగువ, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారేనని, తమ ఆర్థిక, సామాజిక స్థితిగతులను దష్టిలో ఉంచుకొని తమను క్రమబద్ధీకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోరంట్ల యాదగిరి, బక్కం రాజ్ కుమార్, రౌతు రామ్ గోపాల్, ప్రజ్ఞాపురం వెంకటేశ్వర్లు, లవన్ కుమార్, శివరాత్రి సునీత, కన్నా జ్యోతి, శ్రీలత, రామతులసి, ప్రవీణ్ కుమార్, తాటికొండ రమేష్, మాచర్ల రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ భవన నిర్మాణానికి కృషి

నవతెలంగాణ-లింగాలఘనపురం

మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనం నిర్మాణ అనుమతుల కొరకు సోమవారం స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి , మాజీ జెడ్పిటిసి గుడి వంశీధర్‌రెడ్డిని కలిసి సమస్యను చెప్పగానే పైఅధికారులతో మాట్లాడి ఈ పని త్వరగా పూర్తి చేయాలని మాట్లాడటంతో స్పందించిన అధికారులు భవన నిర్మాణానికి కావలసిన అనుమతుల ప్రక్రియ వేగవంతం చేయడం జరిగింది ఈ కార్యక్రమానికి సహకరిస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి, మాజీ జెడ్పిటిసి గుడి వంశీధర్‌రెడ్డి కి మండల అంబేద్కర్ భవన సంఘం తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

బెల్టు షాపుపై పోలీసుల దాడులు

నవతెలంగాణ-పాలకుర్తి

బెల్టు షాపుపై పోలీసులు దాడులు చేసి రూ.15 వేల విలువ చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్న సంఘటన సోమవారం మండలంలోని దర్దేపల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై మోడం సాయి ప్రసన్న కుమార్ తెలిపిన వివరాలు ప్రకారం దర్దేపల్లి గ్రామానికి చెందిన వెన్న గణేష్ అక్రమంగా బెల్టు షాపు నిర్వహిస్తున్నాడని తెలిపారు. బెల్టు షాప్ పై దాడులు నిర్వహించి 15 వేల విలువచేసే స్వాధీనం చేసుకున్నామన్నారు. గ్రామాల్లో బెల్టు షాపుల నిర్వహణతో యువత మద్యానికి బానిసై జీవితం అంధకారం అవుతుందన్నారు. మద్యంతో పాటు డ్రగ్స్ కు బానిస అవుతున్నారని గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహిస్తే చర్యలుతప్పవని హెచ్చరించారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-బచ్చన్నపేట

మండలంలోని పోచన్నపేట గ్రామంలో మతి చెందిన గోరంత మల్లేశం కుటుంబ సభ్యులకు సామాజిక సేవాకర్త పోతుల రాములు యాదవ్ రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట కొ క్కుల కొండ బాబు, రామచంద్రం, బిక్షపతి, బాలరాజు, ఎల్లేష్, లింగం తదితరులు ఉన్నారు.

ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన శ్రావణ్ కుమార్

నవతెలంగాణ-లింగాలఘనపురం

లింగాలఘనపురం మండల ఎస్ఐ బండి శ్రావణ్ కుమార్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాకు వచ్చే ప్రతి వ్యక్తికి న్యాయం జరిపిస్తామన్నారు అవసరం ఉన్నవారు నేరుగా పోలీస్ స్టేషన్కు వచ్చి ఫిర్యాదు చేయాలన్నారు. మధ్య దళారులను ఆశ్రయించ వద్దన్నారు మండలంలోని యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. గుట్కా జూదం గుడుంబా ర్యాగింగ్ వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులు చదువుకునే దృష్టి సారించి జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించి తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చాలని పిలుపునిచ్చారు.

కొడకండ్ల ఎస్సైగా పనిచేస్తున్న బండి శ్రావణ్ కుమార్ లింగాల గణపురం ఎస్సైగా బాధ్యతలు చేపట్టారు.